# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక ఆగష్టు 2011 ₹ 20



స్వాతంత్ర్యం

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 22** **ఆగష్టు 2011** **సంచిక 8**



*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*
అన్నపరెడ్డి బుద్ధఘోషుడు
డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ జయధీర్ తిరుమల రావు
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
ముంగర జాషువ

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**



<u>*Printed & Published by*</u>

Bapanna Alapati
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹200
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*


మరిన్ని వివరాలకు 64వ పుట చూడండి.


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 3

స్త్రీల హక్కులు – సామాజిక ప్రతిబంధకాలు ........ 5
– *కనుపర్తి విజయబక్ష్*

సద్ధర్మ సార్వజనీనత ........ 9
– *ఎమ్. రాజగోపాలరావు*

నా జీవితం ఈ ఉత్తరం ద్వారా బతికే ఉంటుంది ........ 13
– *దాశరథి కృష్ణమాచార్యులు*

గుండెలో దీపాలు ........ 16
– *దాశరథి*

చిత్తూరు జిల్లా – స్వాతంత్ర్య పోరాటం ........ 17
– *దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి*

కాంక్షా పరిమళం ........ 25
– *శిఖామణి*

పద్మశాలి ఆశ్రిత కళారూపాల రహస్య భాష ........ 26
– బాసని సురేష్

దాసి సుదర్శన్ ........ 28
– *ఎన్నార్కే*

మాక్సిమ్ గోర్కీ – *అమ్మ* – కథ ........ 30
– *ము.పా.సా – వి.ఎ.కె.*

ఫిడేల్ రాగాల పఠాభి ........ 32
– *నందన*

కవులు నిద్రపుచ్చిన ఊర్మిళ ........ 36
– *మహావీర్ ప్రసాద్ ద్వివేదీ*

ముంగిట్లో గమ్యం ........ 40
– *డా. సి. నారాయణ రెడ్డి*

ఎచటిదీ కర్ణాట భాష ........ 42
– *పలగాని గోపాలరెడ్డి*

పరుసవేది (ఆరోహణ–6) ........ 48
– *ముక్తవరం పార్థసారథి*

వెలుగు చూడని తెలంగాణ సాహిత్య నిధులు ........ 53
– *కుర్రా జితేంద్రబాబు*

కనకపుష్యరాగం (పుస్తక పరిచయం) ........ 60

నవ్వులు ........ 62


*ముఖచిత్రం* : అన్ని నాలోనే – చిత్రకారుడు : దాసి సుదర్శన్
*రెండవ అట్ట* : స్వాతంత్ర్యం – యూజిన్ డెలక్రాయ్ (1798–1863)
*(స్టాట్యూ ఆఫ్ లిబర్టీకి ప్రేరణ ఈ చిత్రం)*
*మూడవ అట్ట* : వాన–వాన – వి. వాటర్‌హౌస్ (1849–1917)
*చివరి అట్ట* : అన్నిట్లో నేనే – చిత్రకారుడు : దాసి సుదర్శన్

ఎప్పటినుంచి మహిళాబిల్లు ఢిల్లీ రాజకీయ వీధుల్లో తిరుగుతోంది? మహిళలే అధికారంలో వున్నా మహిళాబిల్లు విషయంలో ఉదాసీనులై ఎందుకుంటున్నారు? ఈ విషయాన్ని రాజకీయ పార్టీలన్నీ రాజకీయం ఎందుకు చేస్తున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానం వెదకటం, కళ్ళు మూసుకుని చీకట్లోకి నడవటమే – కాని స్త్రీల హక్కులకు సామాజిక అవరోధాలు ఎవరు కలిగిస్తున్నారు? అంతర్జాతీయసమాజం వారి హక్కుల పరిరక్షణకు ఏమి చేసింది? ఈ విషయాలను స్పృశించే వ్యాసం విజయ బక్ష్ గారిది.

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలు చేసిన పోరాటాలు – సామాన్యులు లోనయిన అంతులేని కష్ట నష్టాలు తెలుసుకుంటుంటే – ఆ స్వాతంత్ర్య ఫలాలను ఈనాడు విషపూరితం చేస్తున్న వారిని ఏ విధంగానూ క్షమించలేము. భావితరాలకు మనం సమాధానమూ చెప్పలేము.

అక్షరాలను నమ్ముకుని అష్టకష్టాలు పడిన కవులకు, రచయితలకు మనదేశంలో కొదవలేదు. కాని దాశరథి ఉత్తరం చదువుతుంటే శత్రువు ఎవ్వరైనా మన రక్తం ఉడికిపోక తప్పదు.

ప్రబంధ కవులను కాదని, భావకవులను త్రోసిరాజని, అభ్యుదయ కవులను అవతల బెట్టి "నేను అహంభావకవి"నని మోర ఎత్తుకు తిరిగిన తిరుగులేని పఠాభిని ఆయన బిడ్డ మనకు మరొక్కసారి జ్ఞాపకం చేస్తుంది.

భాషలున్నాయి – యాసలున్నాయి, కాని రహస్య భాషలున్నాయని బాసని సురేష్ తెలుపుతున్నారు.

సాహిత్యానికి పరిధులు, పరిమితులు లేకపోయినా తెలంగాణా ప్రాంతంలో వెలుగు చూడని అనేక గ్రంథాల వివరాలను జితేంద్రబాబు అందిస్తున్నారు.

పాఠకులకు త్వరలో 'మధురవాణి' మధుర భాషణలు వినిపిస్తామని తెలిపేందుకు ఆనందిస్తున్నాము.

**– సంపాదకులు**



# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'సిద్ధార్థ'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

★ "... ***మిసిమి*** సంపాదకులకు నమస్సులు! దయతో మీరు పంపిస్తున్న ***మిసిమి*** పత్రిక క్రమం తప్పకుండా అందుకొంటున్నాను. ధన్యవాదాలు. మీరు ప్రచురిస్తున్న వ్యాసాలూ, ప్రముఖ చిత్రాలు వాటికవే సాటి. అన్ని సంచికల్నీ భద్రపరచుకోవాల్సి వస్తోంది. జూలై సంచికలో (పే.59) 'ఊరిపేరు' శీర్షికన బందరు గురించి రాశారు. వంగోలు వెంకటరంగయ్యగారు చాలా పరిశోధించి రాసినది తప్పు పట్టటమో, కాదనటమో నా ఉద్దేశం కాదు. వారి ప్రజ్ఞ సముద్రప్రాయం. నేను కీ.శే. రాంభట్ల కృష్ణమూర్తి గారి ద్వారా బందరు గురించి విన్నది రాస్తున్నాను. నిజానికి దాని పేరు 'మచిలీ బందరు' కాదు. పాతకాలం వాళ్ళు 'మసిలీ బందరు' అంటారు చేపకీ మహాభారతంలోని మత్స్యదేశానికీ మసిలీ పట్నానికీ సంబంధం అస్సలు లేదు. బందర్ అంటే హార్బర్, లేదా ఓడరేవు. (ఎగుమతులు, దిగుమతులు జరిగే ఓడరేవు) ఏయే వస్తువులు ప్రముఖంగా సదరు ఓడరేవు నుంచి ఓడలకెత్తుతారో ఆ వస్తువుల పేరు ఆ ఓడరేవుకి స్థిరమైపోతుంది. అట్లా మసిలీ బందర్ అయింది. చైనా తరువాత పట్టు వస్త్రాలకు ఆంధ్రసాగరతీరం ప్రతీతి. పట్టు వస్త్రాల ఇక్కడి నేత పద్ధతిని 'మస్లిస్' అన్నారు. లేదా 'మస్లిస్‌నేత' అంటారు– అలా ఆ ఊరికి మస్లిస్ బందర్, మసిలీ, మస్లీ... వగైరాపేర్లు స్థిరమయ్యాయి. 'స' 'చ'గ మారటం వల్ల గందరగోళపడి మచ్చీ, మచిలీ, 'మత్స్య' మొదలగు చేప సంబంధ అన్వయం ఆరంభమయింది. ఇది రాంభట్లగారు నాకు చెప్పిన విషయం.

... ఇక పోతే అరబ్ దేశాల నుంచి, యూరప్‌నుంచీ, చైనా వరకు (మధ్య ఆసియా మీదుగా) ఉన్న మార్గాన్ని 'సిల్క్‌రూట్' (సిల్క్‌రోడ్డు) అంటారు. 13వ శతాబ్దికన్న ముందే ఇది ఏర్పడ్డది. ఈ మార్గంలోనే వ్యాపారులపై మొదటిగా జెంగీజ్ ఖాన్ (ఖాగాన్) పన్ను విధించింది. చైనానుంచి సిల్క్ వస్త్రాలూ, తదితర నేత వస్తువులూ రవాణా అయ్యేవి. కనుక దీన్ని సిల్క్‌రూట్ అన్నారు. రాను రాను సిల్క్‌రూట్ భారతదేశంతో అను సంధానమయ్యి బందరు మీదుగా వెళ్లేది..."

**– శ్రీధర్, కార్టూన్ ఎడిటర్, ఈనాడు,** హైదరాబాదు.

✶ "...జూన్ సంచిక గురించి. 38వ పుటలో బాక్సులో వి.ఎ.కె పొడి అక్షరాలతో ప్రచురింపబడిన లేఖ నాది కాదు. ఆ పొడి అక్షరాల వ్యక్తి మరొకరుంటే, వారెవరో స్పష్టపరచగోర్తాను. కనీసం నేను కాదని తెలిపినా సరే. ...విదేశాల స్థలాల వ్యక్తుల పేర్లు వేసేటప్పుడు అక్కడి ఉచ్చారణే వేస్తే బాగు. గ్లస్టర్ షైర్ (పుట 5.) అదే వ్యాసంలో యిటువంటి పదాలలో అచ్చుతప్పులు కొల్లలు. కథలూ, వ్యాసాలూ నేనాశించే అంతస్తులోనే వున్నవి. ***మిసిమి*** లాంటి పత్రికలో సాధారణ అక్షర దోషాలు..కళ్యాణం, ధృవం, కళ్ళు..వుండకూడదు. కల్యాణం, ధ్రువం, కళ్లు అనే వుండాలి. ఇది చాదస్తం కాదు తెలుగుపై చూపవలసిన గౌరవం..."

**– వి.ఎ.కె. రంగారావు,** మద్రాస్.

❑ *మీరు వి.ఎ.కె. రంగారావు – వారు వి.ఎ.కె. మాత్రమే; అది మీరు కాదు.*

✶ "...ఆర్యా! హైదరాబాదులో నివసించు శ్రీ చంద్రమౌళిగారు ***మిసిమి***ని చందా చెల్లించి నాపేరున బెంగుళూరులో ***మిసిమి*** ఆగమనానికి దోహదం కలిగించారు. ...మొదటిసారిగా ***మిసిమి***ని దర్శించాను. 'భారతి' తర్వాత ఆంధ్ర పాఠకులను అలరిస్తున్న ***మిసిమి*** సంపాదకులైన మీకు నా నమస్కారాలు ...అంతటితో ఆగిపోకుండా నాయకులు శ్రీ ఆర్.నాగిరెడ్డి ప్రముఖ న్యాయవాది, చిత్తూరు చిరునామాకు ***మిసిమి*** పంపే యేర్పాటు కూడా 'సాహిత్యధేయుడు' 'గ్రంథదాత' ఏర్పాటు చేసినారు.

**– సి. వేణుగోపాల్ రెడ్డి,** బెంగుళూరు.

✶ "...చాట్ల శ్రీరాములు గారిపై ***మిసిమి*** వారు అచ్చొత్తించిన వ్యాసం బాగుంది. చాట్ల శ్రీరాములు వ్యక్తి అభివ్యక్తి అన్న నేపథ్యంలో కొంచెం లోతుగా పరిశీలన చేసిందా వ్యాసం.

శ్రీరాములగారికి గొప్ప పేరు తెచ్చిన నాటకం, దర్శక సంవిధానంలో కొత్త మార్గాలకు తెరలేపిన ప్రయోగాత్మక నాటకం *త్రిజాకీయమదర్శనం.* నామిత్రుడు అబ్బూరి గోపాలకృష్ణ రచించిన ఈ నాటకానికి శ్రీశ్రీ నామకరణం చేశాడు. ఈ నాటకాన్ని దర్శకత్వం చేయడం ద్వారా అభినయశాస్త్రానికి కొత్త వ్యాకరణం అందించారు చాట్ల. అందుకే శ్రీరాములు 'అభినయ భరతాచార్యుడు' కాగలిగాడు. *మరో మొహెంజదారో* దర్శకత్వం ఒక గిమిక్ మాత్రమే. *త్రిజాకీ* అలాక్కాదు. (ఆ నాటకాన్ని పోర్టు టీముకి దర్శకత్వం చేస్తున్న రోజుల్లో నేను వారితో కలసి పనిచేసి గమనించిన సత్యం ఇది.)

ఈ నాటకం గురించి ***మిసిమి*** వ్యాసంలో చెప్పక పోవడం విచారించవలసిన విషయం. ఆ నాటకం పూర్వాపరాలు విపులంగా ప్రస్తావించవలసింది. యూనివర్సిటీల్లో ఉద్యోగాలకి అతుక్కుని ఉండకపోతే శ్రీరాములు త్రిజాకీ లాంటి నాటకాలు తన జీవిత కాలంలో మర్రెండు నాటకాలు తెలుగు రంగస్థలానికి అందించి వుండేవారు. అంతర్జాతీయ స్థాయికి ఎదిగి వుండేవారు. తెలుగు నాటకాల్లో ప్రయోగాల్ని ప్రపంచస్థాయికి తీసుకు వెళ్ళేవారు. అలా జరగలేదు. ఇది తెలుగు వారి దురదృష్టం ...ఏమాట కామాటే చెప్పాలి. ఇంతో అంతో శ్రీరాములుగారే నయం. శ్రీరాముడి దయచేతను నారూఢిగ రసజ్ఞులు ఔరా! అన్నట్లు.. వారిది చరితార్థ జీవితమే. ***మిసిమి***ని అభినందించ వలసినదే...

అంతేకాక పదేళ్ళ కాలంలో వచ్చిన కవిత్వాన్ని పరిశీలించిన 'మో' వ్యాసం, ప్రజానాట్యమండలి నిర్మాతలలో ఒకరయిన మిక్కిలినేని పై వ్యాసం, ***మిసిమి***ని మరింత మిసమిసలాడేలా చేశాయి. **– విరియాల లక్ష్మీపతి**, విశాఖపట్నం.

✶ "...ఆర్యా! ఉగాది ముఖచిత్రంతో వెలువడిన ఏప్రిల్–11, ***మిసిమి*** మాసపత్రిక, ఆసాంతం, యథార్థంగా చాలా బాగుంది. పరిశీలన, వేగుంట మోహన ప్రసాద్ గారి శీర్షిక అత్యంత ఉపయుక్తము. జితేంద్రబాబుగారి ప్రజానాట్య మండలి చుక్కాని, స్వర్గీయ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారి గురించి, వారి సహచరుల గురించి వ్యాసంలో విపులంగా తెలుసుకున్నాం. నాటకంలో చాట్ల శ్రీరాములు గారి ప్రయోగాలు, నాటకం రావడానికి వారి కృషి చదివి, అభినందిస్తున్నాను. ప్రపంచ సాహిత్యంలో జాన్ మాక్స్‌వెల్ కోయిట్జి గురించి, వారి రచనా వ్యాసాంగాల గురించి, 'అతనూ–అతని మనిషీ'లో చక్కగా వివరించారు. సి.ఎస్.రావుగారి జ్ఞాపకాలు శీర్షికలో ముళ్లపూడి వెంకటరమణగారి గురించి, వారి చతుర, హాస్యసరళి గురించి, తదితర విషయాలు గ్రహించాము. కవితలు రెండూ చాలా బాగున్నాయి. రాజేశ్వరిదేవి గారి నాయికలు వ్యాసం బాగుంది. కె.రామలక్ష్మీగారి 'పెళ్లిగోల'లో ఆరుద్రగారి గురించిన విషయాలు తెల్సినవి. చేతన, ఊర్వశి ఎవరు, మానవశాస్త్రం శీర్షికలు కడు ఉపయుక్తం. సంగయ్యగారి తెలుగు పదాలు వివరంగా చదివాము. తదితర శీర్షికలు, అన్నీ బాగున్నాయి. చాలా మంచి శైలితో పత్రికను ప్రచురిస్తున్నందుకు మీకు నా అభినందనలు. కవితలు లాగా, పత్రికలో మంచి కథ ఒక్కదానిని ప్రచురించగలరు. రచయితలకు, నా అభినందనలు. ప్రచురణకర్తలకు, ఎడిటర్‌గార్కి, నా అభినందనలు. సహపాఠకులకు నా శుభాకాంక్షలు..." **– పి. మురళీ కృష్ణ**, కృష్ణాజిల్లా.

✶ "... ఇప్పుడే చూసాను ***మిసిమి*** నా ధన్యావాదాలు మొదట. మా అమ్మగారి (వన్నమ్మ) 'ముళ్లపొదలో పూల బాట' కథనం చక్కగా సమీక్షించారు. నేటి సమాజానికి ఆనాటి సమాజం ఒక స్ఫూర్తిదాయకమైన సత్యాన్ని చెప్పారు, అతి విలువైన మాట. ...వన్నమ్మ మాటల్లో చెప్పించి మరింత వన్నె తెచ్చారు ఆ రచనకు. మీకు మరొక్కసారి ధన్యవాదాలు.."

**– ఎమ్.వసంతకుమారి,** చికాగొ.

✶ "...స్థానాపతి రుక్మిణమ్మ (దయ్యాలు), ఆచంట శారదాదేవి (కథలు), ద్వివేదుల విశాలాక్షి (వీలునామా)తోబాటు రామలక్ష్మి నా అభిమాన రచయిత్రులలో ఒకరు. ఆమె 'పెళ్ళిగోల' చాలా సరదాగా ఉంది. ఆమెను వివాహమాడిన ఆరుద్రగారు మేధావేకాదు, మహా ధైర్యస్థుడు కూడాను. 'అన్నల్లారా నా తప్పేమిటి'కి రామలక్ష్మి ప్రత్యేక పరిశోధన చేశారని ఆ నవల చదివాను. అక్కడి పరిస్థితుల వర్ణన అత్యంత సహజంగా ఉంది. అయితే బయటకు రావటానికి చాలా రిస్కయిందని విన్నాను. దాని గురించి కూడ ఆమెతో వ్రాయించరూ..." **– సు.నా.మీనలక్ష్మి,** మద్రాసు.

✶ "... జూన్ 2011 ***మిసిమి*** చాలా బాగుంది. ముఖ్యంగా ప్రతినెల మీరందిస్తున్న చిత్రాలు ముచ్చటగొల్పుతున్నాయి. నాటితరం విషయాలు ఎన్నో యీ నాటితరానికి అందిస్తున్నందులకు ధన్యవాదాలు. ..రామలక్ష్మిగారి సొంత కత "ప్రేమించడం సులువే–పెళ్లే కష్టం!" ఏమాసించి మీరు ***మిసిమి*** లో ప్రచురించారో అర్థం కాలేదు. యీవిడగారు అరచేయి అడ్డు పెట్టినంత మాత్రాన 'ఆసూర్యుని' కాంతి ఆగిపోదుకదా? అసలు ఆరుద్ర గారి వర్థంతికి–యీ సొంత కతకి పొంతన యేమైనా వుందా? **– డి. రాములు,** ఏలూరు.

# స్త్రీల హక్కులు
# సామాజిక ప్రతిబంధకాలు

- *కనుపర్తి విజయబక్ష్*

**మానవ హక్కులు :**

రెండు ప్రపంచ యుద్ధాలు మానవాళికి కలిగించిన భయ భ్రాంతులు, విచ్ఛిన్నం చూసి భయపడిపోయి శాంతి సామరస్యం వైపు ప్రపంచ ప్రజలు అర్రులు చాచారు. ఈ భూమి మీద జన్మించిన ప్రతివ్యక్తి భయం భీతి లేని సమాజంలో కొన్ని హక్కులతో జీవించాలి అనే సదాశయంతో U.N.O. 1948 డిసెంబర్ 10వ తేది 'మానవ హక్కుల' పత్రాన్ని జారీ చేసింది. ఇందులో పురుషులతో పాటు స్త్రీలకు కూడా సమానంగా అన్ని హక్కులు వుండాలని నిర్దేశం వుంది. ఇందులో మొత్తం 30 ఆర్టికల్సు వున్నాయి. అన్ని సభ్య దేశాలు జాతి, మత, లింగ, వర్ణ, వర్గ భాషలతో నిమిత్తం లేకుండా మానవ హక్కుల పరిరక్షణకు ఆమోదం తెలిపాయి. మానవ హక్కులకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. దీనికి అనుబంధంగా 1961లో లండన్ కార్యాలయంగా ఏర్పడిన "ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్" సంస్థ మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్నది. అంతర్జాతీయంగా మానవ హక్కుల సమావేశాలు జరుగుతున్నాయి. అయితే మానవ హక్కుల ఉల్లంఘనను ఏ దేశమూ కూడా అరికట్టలేక పోతున్నది. ఇక స్త్రీలపరంగా చూచినట్లయితే హక్కులను పొందటం, అనుభవించటం అన్నది నామమాత్రంగానే కొనసాగుతోంది. మహిళా అభ్యున్నతి కూడా అంతంత మాత్రమే!

**మహిళా దశాబ్దం (1975-85) :** ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల స్థితిగతుల పరిశీలన, విచారణ జరిపి, తిరిగి హక్కుల పునరుద్ధరణకై 1975వ సంవత్సరాన్ని U.N.O. 'అంతర్జాతీయ మహిళా' సంవత్సరంగా ప్రకటించింది. స్వేచ్ఛ, సమానత్వం, అభివృద్ధి అనే సూత్రాలను ప్రాతిపదికగా స్త్రీలకు సమాన గౌరవాన్నివ్వాలని, స్త్రీలను అన్ని రంగాల్లో భాగస్వాములుగా చేసి, ప్రపంచ శాంతి పరిరక్షణ చేయాలనేది




మహిళా సంవత్సరపు లక్ష్యం. 1975లో మొదటి రెండు సభలు మెక్సికోలోను, మూడవ సభ బెర్లిన్‌లోను జరిగాయి. 150 దేశాల నుండి దాదాపు 5 వేల మంది ప్రతినిధులు హాజరైనారు. ఈ సభల్లో ప్రపంచ దేశాల స్త్రీల పరిస్థితులపై ఎన్నో చర్చలు జరిగాయి. ఈ అంతర్జాతీయ మహిళా సంవత్సరం స్త్రీలనే కాక, పురుషులను, ప్రపంచం మొత్తాన్ని ఆలోచింప చేసింది. నూతన చైతన్యం అంతటా వెల్లి విరిసింది. స్త్రీల స్థాయి అనుకొన్న రీతిలో పెరగనందున 1976 నుండి 1985 వరకు U.N.O. మహిళా దశాబ్దంగా ప్రకటించింది. ఈ దశాబ్దంలో జరిగిన అతిపెద్ద సభ, 'కోపెన్ హేగెన్' సభ. ఇంకా స్త్రీలు అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించవలసి ఉందని, సాధించింది చాలా తక్కువ అని, ఆ సభలో అభిప్రాయపడ్డారు. ఇందువల్ల ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల

డా. కనుపర్తి విజయబక్ష్, ఫోన్ : 9441382303

అభివృద్ధిని గురించిన సర్వేలు, రిపోర్టులు (మన దేశంతో సహా) బయటకు వచ్చి స్త్రీల స్థితిగతులను గూర్చి పునరాలోచించుకోవలసిన ఆగత్యం ఏర్పడింది.

**మానవ హక్కులు మహిళలకు వర్తించవా?**

ప్రస్తుత సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిగణనలోకి తీసుకొన్నట్లయితే మానవ హక్కులు మహిళలకు వర్తిస్తున్నాయా అనే ప్రశ్న ఎదురవుతుంది. మానవ హక్కుల పత్రం విడుదల చేసిన అంశాలు అన్నీ అందరికీ వర్తించాలి. "The aim of the Declaration is to achieve a world in which human beings shall enjoy freedom of speech and belief and freedom from fear and war.

Article one proclaims that all the human beings are free and equal in dignity and rights. All the rights put forth in the Declaration are applicable to all people without distinction of any kind such as race, colour, sex, language, religion, political or other opinion, national or social origin property birth or other status.

అయితే మన దేశానికి సంబంధించినంత వరకు మనం పరిశీలించినట్లయితే స్త్రీలు పైన పేర్కొనబడ్డ యే యే అంశాల్లో ఏ విధమైన హక్కులు అనుభవిస్తున్నారో మనం చూడవలసి వుంది. దేశ, మత, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల్లో స్త్రీల భాగస్వామ్యం ఎంత? ఏ మేరకు వారు తమ అభిప్రాయానుగుణంగా నడచుకో గలుగుతున్నారు?

1. మత విషయంలో స్త్రీలు ఏనాడు ఎక్కడా, ఎప్పుడూ స్వేచ్ఛ అనుభవించినట్లు లేదు. తమ తల్లిదండ్రుల నుండి, భర్త నుండి సంక్రమించిన మతాన్ని సంప్రదాయాన్ని మాత్రమే స్త్రీలు అనుసరిస్తున్నారు. కాదంటే చాల సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది.

2. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడ రాజకీయాలలో స్త్రీల భాగస్వామ్యం నామమాత్రమే! 73వ రాజ్యాంగ సవరణ ద్వారా స్త్రీలు స్థానిక సంస్థల్లో (33 శాతం) భాగస్వామ్యం పొందినా కీలకమైన చట్టసభలో మాత్రం నామమాత్రమే! గత పదిహేను సంవత్సరాలుగా ఇప్పటి వరకూ స్త్రీల రాజకీయ రిజర్వేషన్లపై చర్చోపచర్చలు జరుగుతూనే వున్నాయి.

3. ఆర్థికాంశానికి సంబంధించినంతవరకు స్త్రీలకు ఆస్తి హక్కులు కాయితాల్లోనే! దేశార్థికాభివృద్ధిలో స్త్రీల భాగస్వామ్యం ఎంతో వున్నా, అది పరిగణనలోకి రావటం లేదు. గ్రామీణ స్త్రీలు పాడిపంటల పనుల్లోను, చేతి వృత్తుల్లోను, నిర్మాణ రంగంలోను పనిచేస్తున్నప్పటికీ వారి సేవలకు విలువలేదు.

4. సామాజికాంశాల్లో స్త్రీలు చాలా హక్కులు తమకు తెలీకుండానే జీవితం గడిపేస్తుంటారు. కుటుంబపరంగా, సామాజికంగా హక్కులను పొందాలనుకొనే ప్రయత్నంలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయి. సంస్కృతీ, సాంప్రదాయం హక్కుల్ని గురించి ప్రశ్నించనీయవు.



**రాజ్యాంగం : స్త్రీల హక్కులు :**

చట్టం ముందు అందరూ సమానులే. స్త్రీ పురుష వివక్షత వుండరాదు. ఆర్టికలు 14లో చెప్పబడ్డ ప్రకారం అందరికీ ఒకే రకమైన రక్షణ కల్పించాలి. ఆర్టికల్సు 15-16 కూడ స్త్రీలకు సమాన అవకాశాలు గురించే చెప్పాయి.

ఇన్ని రకాలయిన హక్కులు చట్టాలు కల్పించబడ్డా ఈ 21వ శతాబ్దంలోను స్త్రీ పురుషునితో సమానంగా చూడబడుతున్నదా? పురుషుని వలె స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందగలుగుతున్నదా? ఆధునిక కాలంలో స్త్రీలపై ఇంకా హింస పెరగలేదా? ప్రపంచీకరణ, సాంకేతిక పరిజ్ఞానం ఇంకా స్త్రీల సమస్యలను



పెంపొందించలేదా? అనేవి మన ముందున్న ప్రశ్నలు.

సాంఘికంగా మనదేశ స్త్రీల దుస్థితికి, పరిస్థితి మరీ దిగజారటానికి తరతరాలుగా వస్తున్న మన సంప్రదాయాలు ఒక కారణం కాదా? అందుకే చట్టాలు ఎన్ని చేయబడ్డా అవి సంప్రదాయం ముందు దిగదుడుపే! ఏతావాతా తేలేది ఏమంటే చట్టం కంటే సంప్రదాయం బలీయమైందని!

**ఆడపిల్ల పుట్టుకే అనర్థదాయకం :**

అబ్బాయి పుడితే ఆనందం అందరికీ! అమ్మాయి పుట్టిందంటే ఆవేదనే! కారణం కొడుకు ఇహపరాల్లో మంచి గతులు కలుగ చేస్తాడట (పున్నామ్నో నరకాత్రయాతి ఇతి పుత్రః). ఆడపిల్ల పెళ్ళి చేయటంకంటే అశ్వమేధ యాగం చేయటం తేలిక అనే నానుడి జనంలో వుండటమే!

1961లో వరకట్న నిషేధ శాసనం వచ్చింది, అది పేపర్ల మీదనే! కాని వ్యవహారంలో కట్నం యివ్వటం పుచ్చుకోవటం బహిరంగ రహస్యమే!

పుట్టబోయే శిశువులు ఆడో మగో తెలుసుకొని, ఆడ శిశువు అయితే గర్భంలోనే హతమార్చే 'భ్రూణహత్య' సమాజంలో నిత్యకృత్యమయింది. దీన్ని నిరోధించాలనే సంకల్పంతో 1994 సం॥లో 'Pre Natal Diagnostic Techniques Act.' గర్భస్థ పిండ పరీక్షా ప్రక్రియ నియంత్రణ మరియు దురుపయోగ నివారణా చట్టాన్ని ప్రవేశపెట్టింది ప్రభుత్వం. అయినా 1995–2001 మధ్యకాలంలో 15 లక్షల మంది ఆడపిల్లల్ని లింగ నిర్ధారణ పరీక్ష ద్వారా తొలగించారంటే మనదేశంలో ఆడపిల్ల పుట్టుక ఎంత భయాన్ని కలిగిస్తుందో అర్థమవుతుంది.

**ఆడపిల్ల గుండెల మీద కుంపటి** :

ఆడపిల్ల పుట్టుకే అనర్థం. అయితే ఇక పెంపకంలోను ప్రతీ నిముషం 'నీవు ఆడపిల్లవే' అని గుర్తు చేయటం. అమ్మాయి మీద పెట్టే ఖర్చు దండుగ మారిందని, తిరిగి రాని పెట్టుబడి అనే భావన ఎల్లెడలా వుంది. ఆడపిల్లలకి ఈ రోజుకి ఆడుకొనేందుకు ఇచ్చే ఆటవస్తువులు లక్కపిడతలే! వంటింటి సామాగ్రియే! అబ్బాయిలు చదువులో ప్రతిభ చూపకున్నా డొనేషన్లు కట్టి అయినా చదివించాల్సిందే! అమ్మాయి ఎంత బాగా చదువుతున్నా చదువుకు పరిమితియే! ఎక్కువ చదివిస్తే ఇంకా ఎక్కువ చదివిన వాడ్ని తేవాలి! బోలెడు కట్నం పోయాలి! ఇదీ ఒకప్పటి సామాజిక పరిస్థితి. ఈ పరిస్థితి ఇప్పుడు కొంతవరకూ మారింది.

సంప్రదాయం ఆడపిల్లని అవివాహితగ వుండటాన్ని అంగీకరించదు కదా మరి! జీవితాంతం తండ్రో – భర్తో – కొడుకో రక్షణ కవచంలా వుండాలని నిర్దేశించింది కదా!

**హక్కులను అనుభవించటానికి అడ్డంకులు :**

చారిత్రకంగా సాంప్రదాయికంగా స్త్రీలని రెండవ తరగతికి చెందిన వారిగానే చూచారు. 'అబలగ', 'ముగ్ధలుగ' 'లోకజ్ఞాన శూన్యులుగ,' 'మూఢులైనవారిగ' పరిగణించారు. కేవలం భోగ్య వస్తువుగా, వంశానుద్ధరించే కొడుకులను ప్రసాదించే ఒక కొఱముట్టుగా భావించారు. అది అప్పటి మాట.

ఈ 21వ శతాబ్దంలోను స్త్రీలు చదువుకొన్నా, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సంపాదించగలిగినా అభిప్రాయాల్లో పెద్ద

మార్పేమి రాలేదు. ఏ పనినీ స్త్రీలు స్వతంత్రించి చేయకూడదు. నిర్ణయాధికారం స్త్రీలకు లేదు. తన సంపాదన మీద, తన మీద తనకే హక్కు లేదు.


స్త్రీవాదం అనేది ఈ ఆధునిక కాలంలో రూపుదిద్దుకొన్న మరొక అంశం. తమ జీవితానుభవాలను తామే చెప్పటం వల్ల, వినిపించటం వల్ల స్త్రీ సమస్యలనేవి మరిత బలంగా అర్థం చేసుకొనే అవకాశం కలుగుతోంది. ఎందుకంటే స్త్రీ సమస్యలను ఇంత కాలం పురుషులు చెప్పారు. అట్లాగే మానవ హక్కులు కూడా – "Human rights continue to be rights of Man"!

***హక్కులను పొందాలంటే...***

1. స్త్రీలు తమకి తాము సాంప్రదాయపు చట్రంలో బంధించుకొన్నంతకాలం బాధ్యతలు తప్ప హక్కులుండవు.
2. పురుషులు స్త్రీలను 'తమవంటి వారే'నని గ్రహించగలగాలి.
3. అమ్మాయిలు, ఆధారపడి బతకటం కాక, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి.
4. సహనం – సంయమనం – సర్దుకుపోవటం అనేది అమ్మాయిలకు మల్లే అబ్బాయిలకు అవసరమని నేర్పాలి.
5. పాఠ్య ప్రణాళికల్లో స్త్రీ పురుష సమానత్వాన్ని పెంపొందించే అంశాలు చేర్చాలి.
6. మాతృత్వం అనేది వ్యక్తిగత బాధ్యత కాదని, అదొక సామాజిక బాధ్యత అని అనుకోవాలి.
7. గృహహింస, వరకట్న నిషేధం వంటి చట్టాలున్నాయని జనంలో 'పోలియోమందు'కు జరిగినంత విశేష ప్రచారం జరగాలి.

ఎన్నోచట్టాలున్నా, హక్కులున్నా వాటిని ఎవరి నిమిత్తమైతే చేశారో, వారు వాటిపట్ల జాగరూకతతో వ్యవహరించందే ఎవరు ఏమీ చేయలేరు. తమ కోసమై చేసిన చట్టాలతో తమకు 'రక్షణ' కలుగుతుందనే నమ్మకం స్త్రీలకు కలగాలి. కలిగించే బాధ్యత సమాజానిది, ప్రభుత్వానిదే! మి

## తిరిగి వెనక్కిరా!



చెదిరిపోయిన కుటుంబాల
జాడ వెతుకుతూ పోగా
అంతటా తెగిపోయిన అనుబంధాల
శిథిలాల మధ్య ఒంటరిగా
ఎవరెందుకు విడిపోయారో
వెనక్కి తిరిగి చూడగానే
సుదూరంగా ఆనాటి అనురాగాలు
ఆత్మీయ స్పర్శల మధురానుభూతులు!
మానవ సంబంధాలను శాసించే
వస్తుమయ వినిమయ బేరాల
వంతెనల మీదుగా కదా మనప్రయాణం?
ఎప్పుడో ఒకప్పుడు
వంతెన కూలుతుంది
ఆస్తిపాస్తుల అగాధలోయల్లో
కూరుకు పోగానే
చుట్టూ విధ్వంస విహంగాల
రెక్కల కింద మనమంతా
భయం భయంగా
ఎప్పుడు ఎక్కడ ఎందుకు
ఏ నెపంమీద చస్తామో –
సమాధానం కోసం మళ్లీ వెనక్కి
మమతానురాగాల
ఒయాసిస్సుల వైపు వెళ్లవలసిందే!!

**- నిఖిలేశ్వర్,**

ఫోన్: 9177881201

# సద్ధర్మ సార్వజనీనత

● ఎమ్. రాజగోపాలరావు

ఋగ్వేదంలోని పదిమండలాల్లోను "ధర్మ"పదం 910 సార్లే ప్రయుక్తమయిందనీ దానిని సార్వజనీనంగావించిన విశిష్టత బుద్ధునిదేననీ బిమల్ చరణ్ లా (B.C.Lous) అన్నాడు. బుద్ధుని కాలంలోను, అటు తరవాతి కాలంలోను ఆ పదం అత్యంత ప్రాచుర్యం పొంది, అనేక అర్థ తాత్పర్యాలను సమకూర్చుకున్నది. బుద్ధుని కాలంలో 62 మంది తీర్థంకరులు తమ ధర్మాలను ప్రచారం చేసుకొంటూ ఉండేవారని "సామఞ్ఞ ఫలసుత్తః" (సమణ /*శమణ* జీవితం లేదా ధార్మిక జీవితం వలన కలిగే సతఃఫలాల సూత్రం) చెబుతున్నది. అటువంటి వారు 368 మంది అంటున్నది "సూత్రకృతాంగం". అటువంటి వారెందరున్నా ఎన్నిధర్మాలనుపదేశించినా అవన్ని అసంపూర్ణాలేననీ, అసద్ధర్మాలేనని అవి అన్నీ అటు కామసుఖాలు అందు కోవటానికో కామ–సుఖాల్లికాను యోగః (కామసుఖాలకు అలవాటు పడి కొట్టుకుపోయేవాడు) ఇటు శరీరాన్ని కృశింపజేయటానికో (అత్తఖింమథాను యోగ) పనికొస్తాయే కాని దుఃఖ విముక్తికి దోహదం జేయవని బుద్ధుడు వివరిస్తూ తన ధర్మాన్ని సద్ధర్మంగా పేర్కొన్నాడు. అందువల్లనే శ్రీలంక వంటి థేర వాద దేశాలవారు బౌద్ధధర్మాన్ని "సద్ధర్మం"గా స్వీకరించి అనుసరిస్తుంటారు. మన పొరుగునే ఉన్న "ఒడిశా" రాష్ట్రంలో లక్షలాదిగా దళితవర్గాలవారు తరతరాలుగా బౌద్ధ–వైష్ణవ సమన్వయ మతాన్ని అనుసరిస్తూ "సద్ధర్మదేవత"కు ఆలయాలు నిర్మించి ఆరాధిస్తున్నారు.



నికాయాలలో పరిరక్షితమయిన బుద్ధుని ఉపదేశాలను జాగ్రత్తగా పరిశీలిస్తే వాటిలో మానవుడు క్రమక్రమంగా పురోగమించి మానసిక శారీరక అకుశలాలను తొలగించుకొని దుఃఖాన్ని అంతంజేసుకొని నిర్మాణానికి, జన్మరాహిత్యానికి చేరుకోవటమే లక్ష్యంగా నిర్దేశిస్తూ సాధనమార్గాన్ని–ఆచరణాత్మక విధానాన్ని గూడా స్పష్టంజేయటం కనిపిస్తుంది. అందుకే నికాయాలు బుద్ధుని ధమ్మవినయాలను పదేపదే ప్రస్తావిస్తుంటాయి. బుద్ధుని మహాపరినిర్వాణం తరువాత జరిగిన ప్రథమ సంగీతిని "ధమ్మవినయసంగీతి" అంటుంది చూళవగ్గ (వినయపిటక). ద్వితీయ సంగీతికూడ "ధమ్మవినయ సంగీతి" అంటుంది, సమంతపాసాదిక. ఆ విధంగా బుద్ధుని ధర్మం–ధర్మ–వినయ సంశ్లిష్ట ధర్మం, సర్వేసమగ్రధర్మం, సద్ధర్మం.

బహుజనహితానికి, బహుజన సుఖానికి, లోక కల్యాణానికి అంకితమయి పోయిన బుద్ధుడు సమ్యక్ స్సంబుద్ధుడయిన నాటినుండి మహాపరినిర్వాణ మందేదాకా నిరంతరంగా పర్యటిస్తూ గ్రామాలు, నిగమాలు, పట్టణాలు–నలుగురు ఒక చోట చేరే కూడళ్లన్నిటిలో, అన్ని వర్గాల వారికీ ఎటువంటి వివక్షతలు లేకుండా *అనంతరం, అబాహిరం* అనే ఆంక్షలు లేకుండా, ఎటువంటి రహస్యాలకీ తావీయకుండా, బహిరంగంగా వారికి అర్థమయ్యే విధంగా, వారి భాషలో (సకాయనిరుత్తియా) ఉపదేశించాడు. సమయసందర్భాలను బట్టి, శ్రోతల అవగాహనాపరిమితులను బట్టి, ఒక్కొక్కసారి సంక్షిప్తంగా (సంఖిత్త) ఒక్కొక్కసారి విపులంగా (బహుళం) ఒక్కొక్కసారి క్రమానుగత పురోగమనంగా (అనుపుబ్బ) ధర్మదేశనం సాగేది. విధాన మేదయినా ధర్మవినయమొక్కటే, లక్ష్యమొక్కటే–విముక్తి–

దుఃఖవిముక్తి. తన సాధనానుభవానికి, సాధించుకొన్న సంబోధి వివరాలను జోడించి తనలాగే అందరూ ఎవరికి వారు స్వయం కృషితో సాగవలసిందే, లక్ష్యం సాధించుకోవలసిందేనని ఉపదేశిస్తూ అటువంటి చైతన్యాన్ని అందరిలో రగిలించి లక్ష్యసాధనకు ఉపక్రమింప జేయటమే లక్ష్యంగా బుద్ధుడు ఉపదేశించాడు. బుద్ధుని ఉపదేశాలు విన్న వారందరూ శ్రావకులే. అందుకొన్నది ధమ్మవినయమే. దానిని ఎవరి తాహతుమేరకు వారు అర్థంజేసుకొని ఎవరికి అనువైన మేరను వారు నిర్ణయించుకొని క్రమక్రమంగా అనేక దశలలో ఆచరిస్తూ అనుభవికంజేసుకొంటూ పురోగమించేవారు. ఆ విధంగా తొలిదశలో బుద్ధుని ధమ్మవినయంలో ఎటువంటి హద్దులకు, విభజనలకు ఆస్కారం కనిపించదు. ఆ యథార్థాన్నే నికాయాలు ఆవిష్కరిస్తాయి.

తాను ప్రయోగించిన పదాలను-పదబంధాలను -సవివరంగా విశ్లేషిస్తూ, వాటి అర్థాలను స్పష్టంజేయటం బుద్ధుని విధానం. అందుకే బుద్ధుడు విభాజ్యవాదిగా ప్రసిద్ధి చెందాడు. అంతమాత్రాన ఆ పదాలు పరస్పరభిన్నాలు కాబోవు. వాటిని భిన్నాలుగా అర్థంజేసుకోవటం, వాటి ఆధారంగా వేరువేరు వ్యవస్థలున్నాయను కోవటం అటుతరువాత కాలంలో సంభవించిన పరిణామం. అది ఒక్క ధమ్మ వినయానికే కాదు. జ్ఞాన దర్శనకు (ఞాణదస్సన) విద్యాచరణకు (విజ్జాచరణ) గూడ వర్తిస్తుంది. ధమ్మ వినయంలాగానే విద్యాచరణ, జ్ఞానదర్శనం ఆలోచన ఆచరణల సమగ్రతనే అందిస్తాయి. అటువంటి మౌలిక సూత్రాలను కొన్నిటిని గమనించినప్పుడే బుద్ధుని ధర్మాన్ని సక్రమంగా, సమగ్రంగా గ్రహించుకోవటం సాధ్యమవుతుంది.

బుద్ధుడులోకంలో ఉన్న వారందరికీ-దేవతలు, మారులు, దమ్మలు, శ్రమణ బ్రాహ్మణులు, ఇతర ప్రజలు, మనుష్యులందరికీ – తాను స్వయంగా గ్రహించుకొన్న ధర్మాన్ని ఉపదేశించాడు. అది ఆదికల్యాణం, మధ్యకల్యాణం, అంతంకల్యాణం అని బోధించాడు. అది అర్థవంతం, పదసమృద్ధం, కేవల పరిపూర్ణతను, పరిశుద్ధతను బ్రహ్మచర్యాన్ని ప్రకాశింప జేస్తుందన్నాడు. ఆ విధంగా బుద్ధుడు అందరికీ అనువర్తించే ధర్మాన్ని అందించాడు. అది విన్న వారందరూ శ్రావకులే (సావక్). అందుకే బుద్ధుడు తరచుగా నా శ్రావకులందరూ (సబ్బామమసావకొ) అంటుంటాడు; నా శ్రావకులందరూ- ఉపాసకులయినా, భిక్షువులయినా, గృహస్థులయినా, ప్రవ్రజులయినా సమానమన్నాడు (మహాపరినిబ్బాన సుత్తతం). కావలసిందల్లా విముక్తిని సాధించుకోవాలనే చిత్తసన్నద్ధత. తనకోసం, పరులకోసం, ఉభయులకోసం, సర్వ లోకహితంకోసం ఆలోచించే వారెవరయినా ఆచరిస్తూసాగితే, ఉపాదానాలను నిరోధించుకో గలిగితే-అందరూ నిర్వాణగాములవుతారు, నిర్వాణమందు కొంటారు. బుద్ధ, ధర్మ, సంఘం మీద అచంచల శ్రద్ధతో (అవేచ్చప్పసాద) ఉంటూ మనసును మదమాత్సర్య రహితం గావించుకొంటూ, ఇంట్లో ఉంటూనే, త్యాగభావంతో, పవిత్రహస్తాలతో, యాచించినవారికి అవసరమయింది అందించేవారికి, వారేకులం (కుటుంబం) వారయినా వారి ధర్మం అత్యున్నతం, అటువంటి శీలవంతులు, కల్యాణ ధర్ములు, పరినిర్వాణమందుతారని వివరించాడు బుద్ధుడు (థపతిసుత్తం, సంయుత్తానికాయం). ఆ విధంగా నిర్వాణ మందిన 21 మంది గృహస్థుల పట్టిక అంగుత్తరనికాయంలో కనిపిస్తుంది. ఇంకా అనేకదశలలో నిర్వాణగాములయిన వారి వివరాలుకూడ దానిలో చోటుజేసుకుంటాయి. ఆ విధంగా గృహస్థులు, భిక్షువులు అందరూ నిర్వాణానికి అర్హులే అవుతారు. అవసరమయిన కృషిచేసి నిర్వాణమందు కొంటారు. నిజానికి "అర్హత" పదానికి "నిర్వాణార్హత", "దానాలు వగయిరా అందుకొనే అర్హత" అనే అర్థాలు నికాయాలలో కనిపిస్తాయి.

బుద్ధుని "ధమ్మవినయా"లను వేరువేరుగా భావిస్తూ ధర్మంవేరు, వినయంవేరు, అనుకొంటూ "సుత్తపిటకాన్ని" ధర్మానికి మూలంగా ''వినయపిటకాన్ని' వినయానికి మూలంగా పరిగణించటం వల్ల అనేక అపోహలు తలెత్తాయి. ఉపాసకులు ఒకవర్గం, భిక్షువులు మరోవర్గం అనే వర్గభేదానికదే ఆజ్యం పోసింది. సంప్రదాయంలో సుత్తపిటకం, వినయపిటకం, అభిధర్మపిటకం అనే క్రమం కనిపిస్తున్నా, భిక్షువులే యథార్థ బౌద్ధులనే భావం బలపడిపోయి, వినయపిటకానికి ప్రాధాన్యతనిస్తూ, వినయపిటకం తర్వాతనే సుత్తపిటకమనే ధోరణి రంగం ప్రవేశించి భిక్షు అధిపత్యంతోపాటు వినయపిటక ఆధిపత్యానికి దోహదంజేసింది. వినయపిటకంలోని మహావగ్గ బుద్ధుని సాధనా పురోగమన అవగాహనకు, సంబోధి సాధనకు, అటుతరవాతి పరిణామాలకు, సంఘ సంస్థాపనకు,

నియమాలు అభివృద్ధి చెందిన వివరణ, వగైయిరాల అవగాహనకు ప్రామాణిక ఆధారం. బుద్ధుని మహాపరినిర్వాణం తరవాత పరిస్థితులు, ప్రథమ సంగీతికి సంబంధించిన సమాచారం, "ధమ్మవినయ" సంగ్రహణకు పూనుకొని ముందుగా ఉపాలిచేత వినయం నిర్ధారించవలసిన పరిస్థితులతోపాటు "దుతీయసంగీతి" జరుపుకోవలసి వచ్చిన పరిస్థితులు, భిక్షువర్గాల మధ్య తలెత్తిన విభేదాలు, "పాపభిక్షువు"లను బయటికిపంపి మిగతా అరహతులు సంగీతి నిర్వహించుకోవటం వంటి సమాచారం "చూళవగ్గ" అందిస్తుంది. ఇది అంతా బౌద్ధ ధర్మపరిణామానికి దారి తీసిన చారిత్రక పరిస్థితులనందించటవే అవుతుంది. "విభంగాల"లోనే భిక్షు, భిక్షుణీల ప్రాతిమోక్ష శిక్షాపదాలు ఉంటాయి. అవిభిక్షుసంఘంలో థేరులు, మధ్యమభిక్షువులు, నవభిక్షువులు, మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలకు సంబంధించిన నియమనిబంధనలకే పరిమితమవుతాయి. భిక్షువుల అవసరాలన్నీ గృహస్తులు తీర్చవలసిందే. భిక్షువులు-గృహస్థుల మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగవలసిందే. సాధారణ సమాజంలో ఉండే కట్టుబాట్లకు భిక్షువులు కట్టుబడవలసిందే. దశశీలాలతో గృహస్థులకు ఆదర్శంగా నడుచుకోవలసిందే. ఆ విధంగా వినయపిటకంలో విభంగాలు మాత్రమే పూర్తిగా భిక్షువులకు పరిమితమవుతాయి.

సుత్తపిటకంలో బుద్ధుని ధమ్మవినయమంతా సమగ్రంగా అభివ్యక్తమవుతుంది. అది గృహస్థుల, భిక్షువుల జీవన విధానాలను, అనుసరించవలసిన 'పథానాలను-మార్గాలను' గూడా అందిస్తుంది. నికాయాలలో ప్రతి ప్రధాన 'సుత్త' ప్రారంభంలో బుద్ధుడు ఎక్కడ, ఎవరికి, ఏమి ఉపదేశించాడనే వివరణ ఉంటుంది. దానిని బట్టి ఆ సుత్తాల స్వరూప స్వభావాలను రావించుకోవచ్చు. వాటికి అనుగుణంగా నికాయాలలో అనేక వర్గాలు ఏర్పాటుజేయటం కనిపిస్తుంది. వాటిని పరిశీలిస్తే బుద్ధుడు ఎన్ని వర్గాలవారికి ఉపదేశించాడో స్పష్టమవుతుంది. గృహపతులు, పాపణికుట (చిన్న వ్యాపారస్తులు), సైనికులు (యోధాజీవులు), కర్షకులు (కస్యక), వణిజులు, స్త్రీలు (మాతుగాతు), రాజులు, భిక్షువులు, పరివ్రాజకులు, శ్రమణ బ్రాహ్మణులు, అరహంతులు వగైరాలతోపాటు, దేవతలు, దేవపుత్రులు, నాగులు, యక్షులు, గంధర్వులు వగైరాలకుగూడ బుద్ధుడు ఉపదేశించినట్లు స్పష్టమవుతుంది. భిక్షువులు, పరివ్రాజకులు, అర్హతులు, శ్రమణ బ్రాహ్మణులు వారి ఉపదేశాలను ధర్మంగా పరిగణించవలసిందే, వారికి నిర్దేశించిన మార్గాలను వినయంగా పాటించవలసిందే. ఆ విధంగా 'సుత్త పిటకం' ధర్మవినయపిటకమని స్పష్టమవుతుంది.

అంతేకాదు భిక్షువులకు సంబంధించిన ముఖ్య నియమాలు, వారు వర్షావాసంలో పునశ్చరణజేసుకొనే ప్రాతిమోక్ష శిక్షాపదాలు, వారి కార్యకలాపాలు నిర్వహించుకొనే విధానం గూడా నికాయాలలో చోటుచేసుకోవటం గమనార్హం. వారి మధ్య తలెత్తే వాద వివాదాలను పరిష్కరించుకొనే "అధికరణసమధ సుత్తం"నికాయాలలో ఉంది. భిక్షువులు అనుసరించవలసిన యేడు ప్రధాన నియమాలందించే "వినయవగ్గ"ముంది. వర్షాకాలం మూడు/నాలుగు మాసాలలో బయట పర్యటించే అవకాశముండదు కనుక ఎక్కడో ఒక స్థిరనివాసాన్ని నిర్ణయించుకొని దానిలో ఆ ప్రాంత భిక్షువులను గూడి (రోపవసధ) నిర్వహించుకొనే "ఉపోసధ" కార్యక్రమంలో పునశ్చరణజేసుకొనే (ఉద్దేస్స) శిక్షాపదాల నిర్దేశలక్ష్యం వివరాలతో పాటు 23 విభాగాలను "వినయపెయ్యాలం" (అ.ని.దుఃఖనిపాత). 150 ప్రాతిమోక్ష శిక్షాపదాలను "వజ్జిపుత్తాసుత్తం" (ఆకనిపాత) ప్రస్తావిస్తుంది. వినయపిటక విభంగాలలోని 227 శిక్షాపదాల కంటె ఇవే ముందువని పండితులు అంగీకరిస్తున్నారు.

ఆ విధంగా బుద్ధుని "ధమ్మచరియ" కొనసాగించినంత కాలం బుద్ధుడంటే గౌతమ బుద్ధుడే; ధర్మమంటే "ధమ్మవినయమే"; సంఘమంటే "శ్రావకసంఘమే"; అందులో ఒక విభాగం భిక్షుసంఘం. బుద్ధుని మహాపరినిర్వాణం తరువాత పెనుమార్పులు సంభవించినట్లు అర్థమవుతుంది. బుద్ధునికి అత్యంత విశ్వాసపాత్రుడయిన "ధమ్మసేనాని" సారిపుత్రయందే మహాపరినిర్వాణమందటం, ఆనంద అర్హత్వం సంశయాస్పదంగావటం, నా తరువాత నా ధర్మవినయమే మీకు శాస్త అనటం (పయోతో ఆనంద మయా ధమ్మోచ వినయోచ దేసితో పఞ్ఞత్తో సతోమమచ్చయేన సద్ధామహాపరి నిబ్బానసుత్తంతం) ఆ ధర్మవినయం అర్హతుల అధీనంలో కొనసాగటం వంటి పరిణామాలతో సమకాలిక సంప్రదాయంలో కొనసాగుతున్న బ్రాహ్మణ ఆధిపత్య ప్రభావాలు తోడయి అర్హతులలో ఆధిపత్యధోరణి విజృంభించినట్లు కనిపిస్తుంది. తమనుతాము విశుద్ధవర్తనులుగా, అసలయిన బౌద్ధులుగా భావించుకొంటూ తమ పోషకులైన గృహస్థ బౌద్ధులను అపరి శుద్ధ వర్తనులుగా పరిగణిస్తూ, వారికి నిర్వాణార్హత లేదంటూ


భిక్షువుల సందేహాలను తీర్చే "చత్తగహపతి" (సంయుక్తనికాయ) వంటివారిని విస్మరిస్తూ ''కామేసుమిచ్చాచారాన్ని'' బ్రహ్మచర్యంగా, బ్రహ్మచర్యమంటే మైథున ధమ్మ విరమణగా, అర్థాలు రావిస్తూ ఉపాసకుల–భిక్షువుల మధ్య అఖాతాలను పెంచి పోషించటంతో పాటు వారినే శ్రావకయానులుగా విశ్వసించటంతో సహజంగా గృహస్థులలో అసహనానికి అంకురార్పణం జరిగి ఉంటుంది. దానికి కొందరు ఉదార భిక్షువుల అండదండలు తోడయి ''సంఘవిభజన'' అనివార్యమయి పోయింది. ఉపాసక–ఉదారభిక్షువుల మహాసంఘమేర్పడింది. అర్హతుల ఒంటెత్తుపోకడలకు అంకుశం పడింది. ఉపాసకులకు సముచిత స్థానం లభించింది. అదే క్రమక్రమంగా మహాయానంగా అభివృద్ధి చెందింది. సొంతవిముక్తే లక్ష్యంగాసాగే అర్హతయానం –థేరులవాదం–హీనయానంగా నిరసనకు గురయి పోయింది.

మహాయాన ఆవిర్భావం బౌద్ధ ధర్మంలో నూతన శకాన్ని ఆవిష్కరించింది. అది బహుముఖంగా అభివృద్ధిచెందింది. ఉపాసకుల విశ్వాసానికి పెద్దపీటవేసింది. బుద్ధుని సర్వలోకహిత ఆదర్శాన్ని, సర్వమానవ, సర్వప్రాణివిముక్త ఆదర్శంగా అభివృద్ధి చేసింది. దాని సాధన జన్మజన్మాంత రాలతో కొనసాగుతూ సర్వప్రాణి విముక్తికీ పాటుబడే బోధిసత్వుని సంభావించింది. దీనితో బహుబుద్ధభావానికి పూర్వబుద్ధులు– పరిమానబుద్ధులు –భవిష్యబుద్ధులు యుగయుగాలలో అవతరిస్తూ మానవశ్రేయస్సుకు లోకకల్యాణానికీ పాటుబడే లోకోత్తర బుద్ధభావం బలపడి పోయింది. అది బౌద్ధగృహస్థులనేకాక ప్రపంచ గృహస్థులందరి ధర్మంగా ఇంటింటి ధర్మంగా ఆదరణ పొందింది. రకరకాల ముద్రలలో బుద్ధుడు, ధ్యానబుద్ధులు, వారి వారసులు, ప్రతిమలు అభివృద్ధిచెంది, ఆరాధనలు అందుకోవటంతో బౌద్ధ ధర్మం బౌద్ధమతంగా రూపాంతరమంది సార్వజనీనమయి పోయింది.

ఆ ప్రయత్నానికి మరింత ఊతమిస్తూ హీనయానానికి పూర్తిగా భిన్నమైన ధోరణిని అవలంబిస్తూ గృహాలలో నివసిస్తూనే సంసారిక జీవితం కొనసాగిస్తూనే వజ్రసంకల్పంతో బుద్ధుని ధర్మవినయాలను అనుష్ఠించటం ద్వారా నిర్వాణమందుకోవచ్చు, జన్మరాహిత్యం గూడా సాధించు కోవచ్చుననే అచంచల విశ్వాసాన్ని కలిగిస్తూ వజ్రయాన మభివృద్ధిచెందింది. దానికి భారతదేశంలో తంత్రయానమనే నామాంతరముంది. శాక్తేయతంత్రాలు, వామాచారులయిన శైవకాపాలికుల తంత్రాల పాత్ర దీనిలో ఎంతవరకుందో పరిశీలించవలసి ఉంది. ఏమయినా ఈ మూడు యానాలు–హీనయానమనే శ్రావకయానం, మహాయానం, వజ్రయానం, తంత్రయానాలు ఈ నాటి వరకూ ప్రపంచ వ్యాప్తంగా అనేకదేశాలలో అనేకరూపాంతరాలలో కొనసాగుతూనే ఉన్నాయి. వాటి మధ్య వ్యక్తమయ్యే తరతమభేదాలు బౌద్ధ సమైక్యతకు ఆటంకాలు కలిగిస్తూనే ఉన్నాయి.

ఈ యానాలను సమన్వయిస్తూ వాటికి అతీతమైన శాక్యముని ధర్మ ఏకత్వాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలు ఆనాడే సాగటం ఆశ్చర్యంగొలుపుతుంది. త్రియానాల ప్రభంజనంలో బడి కొట్టుకుపోతున్న బౌద్ధప్రపంచం దానికి తగిన గుర్తింపు ఇవ్వకపోవటం నిరాశకలిగిస్తుంది. దానికి మచ్చుతునక "సద్ధర్మపుండరీకసూత్రం".

ఈ సూత్రం శాక్యమునిని నారీనాయక, నారాయణ పురుషోత్తమ, లోకపిత, పరమాత్మ అంటుంది. సర్వసత్త్వపరి నిర్వాణం కోసమే తథాగతుని జ్ఞాన బలవైశారద్యాలంటుంది. అదే బుద్ధుని అగ్రయానం, బుద్ధయానం, ఏకయాన మంటుంది. అది ఈ తారికయానాల కందని "సంధాభాస" (మార్మిక భాష)లో సాగుతుందంటుంది. దానిని అందరికీ అర్థమయ్యేవిధంగా అందించటానికి ఉపాయ కౌశల్యాలను వినియోగించాడంటుంది. కరుణాసాగరుడయిన లోకపితలోకంమీద కారుణ్యంతో తండ్రి బిడ్డల సంతోషం కోసం అందించే ఆటవస్తువులలాగా తమ మహావైపుల్య మయిన ధర్మపర్యాన్ని లేళ్లబండి (మృగరథం) రూపంలో, మేకపోతుల బండి (అజోరథ) రూపంలో, కోడెలబండి (గోరథం) రూపంలో అందించాడంటుంది. అవే శ్రావకయాన, ప్రత్యేక బుద్ధయాన, మహాయానాలంటుంది. బుద్ధుని బుద్ధయానం, ఏకయానం వాటి అన్నిటికీ మూలం, ఆధారం. అది సర్వజ్ఞతా పర్యవసానంగా లభిస్తుందంటుంది. ఆ విధంగా బౌద్ధ ధర్మం పేరుతో కొనసాగుతున్న యానాలన్నిటికీ అతీతమైన ఏకైక యానాన్ని సమైక్యయానాన్ని – సమైక్య ధర్మవినయాలను సంరక్షించటానికి ప్రయత్నిస్తుంది "సద్ధర్మ పుండరీకసూత్రం". ప్రపంచం, బౌద్ధులు దాని ప్రాధాన్యాన్ని గుర్తించకపోయినా అది ఈ నాటికీ జపాన్ దేశంలో పవిత్ర గంథ్రంగా ఆరాధనలందుకోవటం కొసమెరుపు.




# నా జీవితం ఈ ఉత్తరం ద్వారా బతికే ఉంటుంది

*- దాశరథి కృష్ణమాచార్యులు*

**దాశరథి కృష్ణమాచార్యులు, పొట్లపల్లి రామారావుకు మునుకాళ్ల నుంచి 6-8-1948న రాసినలేఖ**

*ప్రియమిత్రమా!*

**102** డిగ్రీల ఉష్ణోగ్రతతో, తీవ్రమైన విష జ్వరంతో నేను మీకు ఈ లేఖ వ్రాస్తున్నాను. 5 రోజుల నుండి లంఖణం చేస్తున్నాను. కలం వణికి పోతున్నది. లేనిది యింత పాడుగా వ్రాయను. ఈ స్థితిలో యెందుకో మీకు లేఖ వ్రాయమని తొందర చేసింది నా హృదయం. ముఖాముఖీ మీతో కలిగిన పరిచయ భాగ్యానికి నాలో నేను ఆనందించిన ఆ ఒక్కపూటా, ఆ పూటలోనూ కొన్ని ఘడియలు నా విషాద నేత్రాల్లోని కన్నీటి లోతుల్లోకి మిమ్మల్ని దింపి బాధించడం యిష్టం లేకనే వూరుకున్నాను. కొన్ని రోజులపాటు మనం కలిసి వుండే అవకాశమూ లేకపోయింది. పీడితలోకాన్ని అవగాహన చేసుకుంటూ గాయపడ్డ మీ హృదయాన్ని నా జీవితగాథతో ఇంకా కెలకడం మంచిది కాదనే వూరుకున్నాను.

ఔషధ సౌకర్యంలేని, పళ్ళూ, పాలు, దొరకని ఒక పల్లెటూరిలో ఇప్పుడు నేను పడివున్నాను. పట్నానికి రావడానికి బండియేమీ లేదు. ఈ జర్వం దయతలిచి యేనాటికైనా దానంతట అది నన్ను వదిలిపోతేనే నేను మళ్ళీ ఈ లోకానికి కనపడడం. నా జీవితం నాకు ప్రపంచజ్ఞానం కలిగిన నాటినుంచీ కన్నీళ్ళతోనే ప్రారంభమైంది. గతాన్ని యేకరువు పెడితే గుండె పగిలిపోయేలాగుంది. నా విద్యార్థి దశ ఒక విషాదాంత నాటకం. ఉపవాసాలతో, జబ్బులతో గడిచింది.

నాకు నాన్న, అమ్మ, తమ్ముడూ, ముగ్గురు చెల్లెళ్ళూ వున్నారు. మా నాన్న మమ్మల్ని వదిలేసి మళ్ళీ పెళ్లి చేసుకున్నాడు. నేనూ, మా అమ్మా, తమ్ముడూ, ముగ్గురు చెల్లెళ్ళూ ఇవాళ మా కుటుంబం. మా తమ్ముడి కడుపులో ఏదో భయంకరమైన గడ్డ ఆరు సంవత్సరాల నుంచి పెరుగుతోంది. ఇప్పటికీ చికిత్స చేయించే అవకాశం లభించదు. సంతతోపవాసాల వల్ల నా పేగుల్లో పుళ్లు ఏర్పడినై. వాటిని డాక్టర్లు (Duodenal Ulcers) అంటారు. ఈ పుళ్లు నన్ను రెండుసంవత్సరాలు తీవ్రంగా వేధించినై. చికిత్స చేయించుకోడానికి అవకాశం లేకా కుటుంబాన్ని భరించడంలోనే జబ్బు పెరిగిపోయింది. ఆ తరువాత ఒక మిత్రుడు డాక్టర్ రాజ్ నన్ను హైద్రాబాదు తీసుకువెళ్లి ఉస్మానియా హాస్పిటల్‌లో రెండు మాసాలుంచి చికిత్స చేయించాడు. పుళ్లు మానినై. పట్టుకుచ్చులాంటి మెత్తని పేగుల్లో ఈ భయంకరమైన కరుకు పుళ్లు రెండు సంవత్సరాలు కాపురం చేయడం వలన పేగులు దెబ్బతినిపోయినై. కారం, పులుసు, పప్పు పదార్థాలు, గడ్డలు మొదలైన వాటిని ఇప్పటికీ నా పేగులు భరించలేవు. ఈ భరించలేనితనం జీవితాంతం వుండేదే. విధిలేక దేశాన్ని వదిలేసి వెళ్లుతూ ఇంగ్లీషు వాడు శాశ్వతంగా ఇండియా, పాకిస్తాన్‌లకు సంఘర్షణావకాశాలు కలిగించి వెళ్లినట్లు, నా పేగుల్లోని పుండ్లు నన్ను అందరి మాదిరి ఆహారం తీసుకోనీకుండా చేసిపోయినై. ఈ పడని పదార్థాలు తీసుకుంటే మళ్ళీ పుళ్లు వస్తాయి అంటాడు డాక్టరు. పుండు వచ్చిందంటే మంచినీళ్లు కూడా జీర్ణం కావు. అపరిమితమైన శూల కలుగుతోంది. మెలికలు తిరుగుతూ, దొర్లుతూ, అరుస్తూ కాలం గడపాలి. అంత భయంకరమైన బాధ ఇంక యెందులోనూ వుండదు.

ప్రపంచంలో కొందరు తామై తాము కుటుంబాన్ని పెంచుకొని దారిద్ర్యంతో బాధపడతారు. ఇటు పిల్లలు పుడుతుంటారు. పెళ్లాం జబ్బున పడుతుంటుంది. తిండికి లభించదు. ఇది ఒక కుటింబీకుని బాధ. అట్టి బాధను

అనుభవించే వాణ్ణి కూడా కనికరించాలనుకోండి. కాని నేను సూటిగా అలా బాధపడేవాళ్లను ఒక ప్రశ్న వేస్తాను. "పెళ్లి చేసుకుని, పిల్లల్నికని యెందుకు బాధపడుతున్నావు? నీకై నీవు తద్దినం కొనితెచ్చు కుంటున్నావు. ఇవాళటి ఆర్థిక వ్యవస్థలో నీకు బ్రతకడం దుస్సాధ్యం. బ్రహ్మచారిలాగా వుండాల్సింది" అని కోపిస్తాను. కాని నాస్థితి చూడండి. నేను బ్రహ్మచారిని. నాకు పెళ్లాం, పిల్లలూలేరు, తల్లీ చెల్లెళ్లున్నారు. వీళ్లు నా తప్పు వల్ల వచ్చిన వాళ్లు కారు. కరకు గుండెతో ఇంత కుటుంబాన్ని ఆకలి దయ్యంపాలుచేసి మళ్లీ పెళ్లిచేసుకుని మమ్మల్ని తన నుండి దూరంగా గెంటివేసిన మా నాన్న తప్పు. భూమీ, పుట్రా, డబ్బూ, దశకం తనచేతిలో వుంచుకుని వట్టిచేతులతో మమ్మల్ని వదిలేశాడు. ఏ కోర్టులో ఈ కేసుకి న్యాయమైన తీర్పు లభిస్తుంది? అందులో నైజాం కోర్టులో? నేను రాజద్రోహినని చెప్పి మా నాన్న అధికారులకు అనుకూలు డైనాడు. నాకు మా నాన్నేకాదు శత్రువు. పోలీసులు, ప్రభుత్వం, వాళ్లతొత్తులు, షావుకార్లు, జమీందార్లు, ప్రజా ద్రోహులు.

'ట్యూషన్లు చెప్పాను, కమీషన్ దుకాణాల్లో గుమాస్తాగా పనిచేశాను, బడిపంతులుగా చేరాను. విప్లవకర పక్షాలతో నాకు సంబంధం వుందని పోలీసులు నన్ను ఆరెస్టు చేస్తే తప్పించుకుని సబ్‌జైలు నుంచి 50 మైళ్లు పరిగెత్తి ఒక మిత్రుడి ఇల్లు చేరుకున్నాను. అప్పటి నుండి అజ్ఞాతవాసం చేశాను. ఇంట్లో తిండికి చచ్చిపోతున్నారు అమ్మా పిల్లలు. యెట్లా! యేంచేసి బ్రతికించాలి. ప్రభుత్వం నన్ను వెతుకుతున్నది. బహిరంగంగా యే ఉద్యోగమో చేసి జీవించే వీలులేదు. యెట్లా! నిమిషం నిద్ర రాదు. అమ్మా పిల్లలు యేమైపోతున్నారో! తమ్ముడికి కడుపులో గడ్డ. దానికి ఆపరేషన్ తప్ప వేరే మార్గం లేదు. ఆపరేషన్! ఆరు వందలు కావాలి. ఆరు గవ్వలు లేవు. రహస్యంగా ప్రయాణాలు చేయడంతో మలేరియా నరాల్లోకి పాకింది నాకు. ఇవాళటికీ వదిలేయడం లేదు. అదే జ్వరం. నరాలు వజవజలాడి పోతాయి. గుండె గజగజలాడి పోతుంది. శవమై, శల్యమైపోతున్నాను.

"నా యింట్లో ఆరుగురు ఒక్క మాటు ప్రాణం విడుస్తారు. యేమన్నా సహాయం చేయండి!" అని అడిగాను బెజవాడలో ఒక మిత్రుణ్ణి. 30 రూపాయలు తీసి యిచ్చాడు. ఆ మిత్రుడు హయగ్రీవాచార్యులుగారే! మా అమ్మ, పిల్లలు గార్ల జాగీరులో వున్నారు. రాత్రి 11 గంటల బండి యెక్కాను. జ్వరం నన్ను ఊపి వేస్తున్నది. కప్పుకోవడానికి కండువాలేదు. నవంబరు 30. చలి చంపుకు తింటున్నది. మా ఊరికి పక్క స్టేషను డోర్నకల్లులో దిగాను. ఆ చీకటిలో, చలిలో, తూలిపోతున్న కాళ్లతో, నాలుగుమైళ్ళు నడిచి రహస్యంగా యిల్లు చేరుకున్నాను.

"అమ్మా!"

"నాయనా వచ్చావా!"

"మీరు బతికి వున్నారా! తల్లీ! యెట్లా వున్నారు?"

"నీ కోసం పోలీసులు వెదుకుతున్నారు నాయనా!"

"వెతకనీ! మిమ్మల్ని ప్రాణాల్తో చూచాను అదే చాలు"

"అయ్యో! ఇట్లా వణికిపోతున్నావేం?"

"జ్వరం! జ్వరం!! కప్పండి గొంగళీ కప్పు"

"యెవరన్నా నిన్ను చూచారా!"

"యెవ్వరికీ కనిపించకుండా చీకట్లో వచ్చాను."

"అపాయంగా వుంది యిక్కడ"

"నన్ను పడుకోనీ తల్లీ"

మలేరియా జ్వరాన్ని యెదిరిస్తూ కప్పుకో వస్తున్న నిద్రమైకంలో కళ్లు మూశాను.

"ఛలో... మెహతె మీకు సాహెబ్ బులాతే హై!" ఆం నన్నెవడో బండిలోనే కనిపెట్టాడు. ఇంకేం! జీవితం అయిపోయింది. "పదండి" అన్నాను. అమ్మ యేడుస్తున్నది. తమ్ముడు అరుస్తున్నాడు. వాళ్లని యెవళ్లు సాకడం? అప్పుడప్పుడేనా పదో పాతికో తెచ్చే నేను జైలుకు వెళు తున్నాను. అందులో చచ్చిపోతాను. "అమ్మా!"

అమ్మలేదు. జైలు డాక్టరు నా గుండెమీద స్టెథస్‌కోప్ పెట్టి గుండె నడక గమనిస్తున్నాడు. నా గుండెలో మా అమ్మ ఘూర్ణిల్లుతున్నది. మా తమ్ముడు అక్కుసాచి ''అన్నా'' అంటున్నాడు. నా గుండెలో నా తెలంగాణా ప్రజలాహాకారం చేస్తున్నది. నైజాం నవాబు విషంలో ముంచిన కత్తితో నన్ను పొడుస్తున్నాడు. "ఇదివరకు తప్పించుకుని పారిపోయింది నువ్వేనా? అన్నాడు సి.ఐ.వో సబ్‌యిన్స్‌పెక్టర్ శ్యామయ్యంగార్.

"ఊహు! నేను తప్పించుకోలేదు" అన్నాను. నాకు యింక యే మాటలూ వినపడలేదు. నన్ను వరంగల్లునుంచి నిజామాబాదు మార్చారు. నైజాం అండమాన్ అంటారు నిజామాబాదును.

దోమ కుడుతోంది, దోమ, దోమ, అమ్మో! అమ్మో! పరిగెత్తండి, అదుగో! అదుగో! ముక్కుమీద వాలింది, వాలింది, వెయ్, కొట్టు, చంపు! అరే! పడిపోతావేం! జ్వరం! జర్వం!!

యెంత దోమ! యెంత దోమ! అంతలో జ్వరం. కొండిదోమ. దాని కొండిలో నైజాం నవాబున్నాడు. కోటియాభైలక్షల మందిని కరుస్తున్నాడు. భారతదేశం డొక్కలో కరుస్తున్నాడు. డాక్టర్! డాక్టర్!! ఇండియన్ యూనియనా డాక్టర్? డాక్టరుకు టైఫాయిడ్. డాక్టరు జబ్బుకు యు.ఎన్.ఓ మందు పోస్తానంది. హు! మన మీ జైల్లో బతుకుతామా? బ్రతకం. 700 మందిమి. మనం యిక్కడ చస్తాం. మన కుటుంబాలు, అవమానింపబడి, యిళ్లు తగలడి, చచ్చి, మిగిలినాళ్లు యూనియన్ ప్రాంతాలకు పారిపోయి అక్కడ అన్నందొరక్క, ఇళ్ళుదొరక్క చస్తారు. అంతా చచ్చాక? స్వాతంత్ర్యం వచ్చినందుకు ప్రతిఫలమా? ఇది.

"నాకు కనీసం "మ్యాగ్నల్స్" డోస్ ఇవ్వండి.

"మ్యాగ్నల్స్! మీ ఇండియా ప్రభుత్వం ఆపేశింది. "వెధవ ఉప్పు కూడా లేకుంటే జబ్బు యెట్లా తగ్గదం?" "మీరు ఛస్తే 3 రూపాయలతో పాతేస్తాం."

"నా కాలికి పెద్దగడ్డ. అబ్బో! అలా కోస్తావేం? కొండ మంగలిలాగా! డాక్టర్, ఇంజక్షన్ యిచ్చి ఆపరేషన్ చేయి."

"ఇంజక్షన్ నై ...", "యెట్టా!"

"కొత్త డాక్టరు రేపు వస్తాడు అడుక్కో"

తెల్లారింది. కుంటుతూ హాస్పిటల్లోకి వెళ్లాను. "దాశరథీ"

"శర్మా!", "నెవ్వెట్టా వచ్చావ్", "మరి నువ్వు"

"నిన్ను–కవిని, డిటెయన్ చేశారా?"

"నిన్ను జైలు డాక్టరుగా యెలా వేశారు?"

"చెబుతా, నా వెంట యింటికిరా"

"నా పూచీ మీద నిన్ను నా కార్లో తీసుకొని వెళతా"

"నిన్ను నా కవితాధిదేవత పంపించిందా" "............."

"నీవు అశ్వినీ దేవతవు...." శర్మ మళ్లీ ఆపరేషన్ చేశాడు కాలు గెడ్డని. స్వంత డబ్బుతో ఇంజక్షన్‌లు యిచ్చాడు శర్మ. వెనకటి మిత్రుడు. సికింద్రాబాద్ plaza టాకీస్‌లో For whom the bell tolls అనే spanish civil war పిక్చర్ చూచాం యిద్దరం రెండేళ్ల కింద. సికింద్రాబాద్‌కు వచ్చిన బ్రిటిష్ ఇండియా మిలిటరీ బెటాలియన్ మెడికల్ ఆఫీసర్ captain శర్మ! "నన్ను war అయిపోయాక డిశ్చార్జ్ చేశారు. హైద్రాబాద్‌లో ప్రైవేట్ ప్రాక్టీసు పెట్టాను. ఈ జైళ్లకు డిప్యూటీ డైరెక్టర్ జనరల్ లేడూ! అతని బిడ్డకి తోటలో పాము కరిచింది. ఇమ్మిడియెట్‌గా చికిత్స చేశాను. బతికింది. వాళ్ల ఇంటి దగ్గరగా ఇల్లు తీసుకున్నాలే. నేను చేసిన చికిత్సకు ప్రతిఫలంగా నన్ను జైలు డాక్టరుగా వేశాడు. అతను చేయగలిగేది అంతే."

"మిత్రమా! నా అదృష్టమోయ్" అన్నాను. "నిన్ను హైద్రాబాద్ జైలుకు మారుస్తాం" అన్నాడు. ఈ అండమాన్సులో నుంచి బయటపడితే చూతాం, అనుకున్నాను. ఆ తరువాత పది రోజులకు నన్ను హైద్రాబాద్ జైలుకు మార్చారు. "నిన్ను వదిలేశాం, వెళ్లిపో, యే వూరికి టికట్టు?"

"నన్ను వదిలారా? యేం", "మీది గార్లా! ఇదిగో టికెట్టు"

నాకు ఆశ్చర్యం వేసింది. నాంపల్లి స్టేషన్‌లో బండెక్కాను. గార్ల టికెట్టు బెజవాడకు తీసుకు వచ్చింది.

''మీ అమ్మ పిల్లలూ, వాళ్ళొచ్చి కేసరపల్లిలో వుంటున్నారు. మీ అమ్మ యేడుస్తోంది అమితంగా!" అన్నాడు సారథి యెడిటరు.

"అమ్మా! బ్రతికి వున్నావూ?". "నాన్నా! వచ్చావా తండ్రీ!" "నువ్వెట్లా బతికి వున్నావు తల్లీ!", "ఉపవాసాలతో.."

జైలు గండం తప్పింది. ఈ యూనియన్‌లో యెవడు మనకు పనియిస్తాడు? యెక్కడా యేం లేదు. జైలు పెట్టిన కొత్తభిక్ష రక్త విరేచనాలు. కడుపులోనెప్పి, పాతపుళ్లు బయట పడ్డాయి. పాత జ్వరం మాత్రం వదులుతుందా? పాత మిత్రుల్ని డబ్బు అడిగి మందుతిను, కుటుంబాన్ని కాపాడు. నూజివీడు వద్ద కొర్లమండలో జోగారావు ఒక మిత్రుడే! యేమిస్తాడు? వెళ్లా! "మిత్రమా! అన్నాను. యేమీ అడగలేకపోయాను". "నిన్న మీ ఇంటికి నూరురూపాయలు పంపాను" అన్నాడు. "అలానా? నా కోసం బాధపడ్డావు" అని వూరుకున్నాను. జైలునుంచి వచ్చి రెండునెల్లు, నూరు అయిపోయి 15 రోజులు. 15 రోజుల్నుంచి ఇంట్లో గిద్దెడు గింజలు లేవు. ఇంకో మిత్రుడి వద్దకి వచ్చాను. తిరువూరి దగ్గర మునుకాళ్లకు. "గెలుపు మనదే" అనే కథల సంపుటిని రచించిన దుర్గా ప్రసాద్ ఇక్కడే వుంటున్నాడు. మా చెల్లెలికి ఇంట్లో జ్వరం. విషజ్వరం. మా తమ్ముడికి కడుపులో గెడ్డ. అపాయంగా వుంది. ఇక్కడ నా జ్వరం తగ్గితేనా! ఇంటికి వెళ్లడం? మీకైనా కనపడడం. ప్రియమిత్రమా! ఈ స్లో డెత్‌ని భరించడం కష్టం. త్వరగా చచ్చిపోయే ఉపాయం వెతుక్కోనా? నీకు ఉత్తరం రాస్తే నా గుండెలో బరువు కొంత దిగుతుందనే ఆశ! అంతే! మరేమీ అనుకోకు. నా కళ్లల్లోని విషాదపు లోతుల్లోకి మిమ్మల్ని దింపి బాధించాను. జ్వరంలో చాలా తప్పులు రాసి వుంటాను. మళ్లీ చదివి చూచుకునే శక్తిలేదు. ఇది ఒక కావ్యం. ఈ ఉత్తరాన్ని దాచి వుంచండి. నేను చచ్చిపోయినా నా జీవితం మీ దగ్గర బతికి వుంటుంది. ఈ క్రింది అడ్రసుకు ఉత్తరం రాయండి.

*(పంపినవారు : మువ్వల సుబ్బరామయ్య)* మి



# గుండెలో దీపాలు

ఈ శిథిలాలయమ్మున జనించిన చిక్కని శర్వరీ తమో
రాశి శిఖాగ్రసీమ పదరా! ఒక దీపము పెట్టివత్తమా
వేశము లేని ఈ బ్రతుకు వీధుల వెచ్చని దీపమాలికా
వేశల కాంతి నింపుదము, పిందుమురా! నవకాంతి దుగ్ధముల్.

ఈ దీపమ్ములచుట్టు చీకటులు పోనేలేదు దయ్యాలటుల్
పాదుల్ కట్టుక కూరుచున్నవి నిశాపక్షీంద్ర పక్షమ్ము లెం
తో దూరానకు గాలివీచినవి ముద్దుల్ గుల్కు దీపమ్ములం
దేదో చల్లదనమ్ముప్రాకినది, లెమ్మీ! వేడి పుట్టింపగన్

దూరదూరాల దీపాల తోరణాల
భరతవీరుల నెత్తుటి వరద కలదు,
అందులో విచ్చె బంగారు టంబుజములు
భరతమాతృ పదమ్ముల వ్రాలుకొఱకు

గుండెలను పిండి ప్రమిదలనింద స్నేహ
మొలికి ప్రేమాగ్ని కళికలు నిలుప రమ్ము!
చీకటులు త్రావి మత్తిల్లి జీర్ణ కుటిని
గుఱక వెట్టిడి జనుల మేల్కొలుప లెమ్ము.


ఇచట నిరుపేదవాడు కోపించినాడు
దివ్య దీపావళీ దీపదీధితులటు,
ప్రేయసీ హృదయాంతర వీధులందు
ప్రియుడు వెలిగించినాడు దీపికలు నేడు.

కోటిమందార పుష్పాల తోటవోలె
దీపి కాతోరణమ్ముల తేజరిల్లె,
యుగయుగమ్ముల చీకటిపొగల అరలు
తగులబడిపోయె దీపాల సెగలలోన.

అన్మదంగనా రుధిరాధరాంగణమున
మొలకనవ్వులవోలె దివ్వెలు లసించె,
నీల కాసారమున రమణీయ కమల
కళికలటు దీపమాల చీకటుల దోచె.

నవయువక రక్తనాళాల నడుమ పారు
నూత్న చైతన్యధారయే నూనెగాగ
చీకటులు నింపుకొన్న మృత్పాను కరండ
మీ ఇలాగోళకమ్ము వెల్గింతు నేను.

**- దాశరథి**



# చిత్తూరు జిల్లా స్వాతంత్ర్య పోరాటం

- దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

ఆగస్టు 15, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దీన్ని దీర్ఘకాల పోరాటం ద్వారా సంపాదించుట జరిగింది. ఈ పోరాటం రెండు ప్రధాన దశలుగా సాగింది. జాతీయతా భావం ఉద్భవించడానికి పూర్వం సాగిన పోరాటదశ. జాతీయతా భావం ఉద్భవించాక సాగిన పోరాటదశ. తొలి దశలో జరిగిన ఉద్యమాలు చాలవరకు ఒకదానికొకటి సంబంధం లేకుండా ప్రాంతీయంగా, ప్రాంతీయ నాయకత్వాన సాగాయి. అనగా, నాడు జాతీయతా భావం లేదు. రెండవ దశ కాలంలో జాతీయభావం క్రమంగా పరిపూర్ణ రూపాన్ని సంతరించుకొని భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వాన ముఖ్యంగా, గాంధీజీ రాజకీయ ప్రవేశం తరువాత స్వాతంత్రోద్యమం జాతీయోద్యమంగా, ప్రజా ఉద్యమంగా సాగింది.

బ్రిటిష్, వ్యతిరేక భారత స్వాతంత్ర్య పోరాటం ఒక్కసారిగా పందొమ్మిది, ఇరవయ్యో శతాబ్దాల్లో ఉద్భవించింది కాదు. ఆంగ్ల అధికార స్థాపన జరిగిన నాటినుండే బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటం ఆరంభమైంది. ఏదేశమందైనా వలస పాలనా స్థాపనతో బాటే వలస పాలకులకు వ్యతిరేకంగా పోరాటాలు ఉద్భవించుట సహజం. వలస పాలనా స్వభావమే అందుకు కారణం. ఇది తన సహజగుణంతో దేశాన్ని, సంఘాన్ని నాశనం చేస్తుంది. దేశాభివృద్ధిని తిరోగమన దిశవైపు తీసుకెళుతుంది. దేశాన్ని దోచుకొని పలురకాలైన బాధలను సృష్టిస్తుంది. కడకు తిరుగుబాటుకు కావలసిన పరిస్థితులను తానే సృష్టిస్తుంది. ఉదాహరణకు ఆంగ్లవలస పాలకులు భారత ఆర్థిక రంగంలో, పాలనా వ్యవస్థలో, భూసంబంధాలు, శిస్తు విధానం వంటి వాటిల్లో ప్రవేశపెట్టిన మార్పులు వ్యవసాయ రంగంలో పలు బాధలను సృష్టించాయి. దేశమంతటా మితిమీరిన శిస్తు వసూలు జరిగింది. పాలెగాళ్ళు, రాజులు, జమిందార్లు, ఇనాందార్లకు చెందిన భూహక్కులు తొలగించబడుట లేక అమ్మి వేయబడుట జరిగింది. వీరిపై మితిమీరిన పేష్కష్ (Tribute) విధించబడింది. రైతులపై 'రెంట్' అనబడే భూశిస్తు పెంచబడింది. శిస్తు చెల్లించని రైతులు భూమినుండి తొలగించబడ్డారు. శిస్తు చెల్లించలేని రైతులను, పేష్కష్ చెల్లించలేని పాలెగాళ్ళను హింసించుట, బంధించుట జరిగింది. ఇందుకు నూతనంగా స్థాపించబడ్డ న్యాయస్థానాలు, చట్టాలు, ఆంగ్ల అధికార్లకు అండగా నిలిచాయి. *ఆంగ్లేయ పాలనలో వ్యవసాయ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి ఎట్టి చర్యలు చేపట్టబడలేదు.* పోలీసు, రెవిన్యూ, న్యాయ, సాధారణ పాలనా వ్యవస్థల్లో అవినీతి తాండవిస్తుండేది. ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన స్వేచ్ఛావ్యాపార విధానం, బ్రిటన్‌లో భారత సరకులపై విధించబడే విచక్షణారహిత పన్నులు భారతీయ కుటీర పరిశ్రమలను దెబ్బతీసి వృత్తిపనివారు ఉపాధిని కోల్పోయేట్లు చేశాయి. వీరు ప్రవేశపెట్టిన సంస్కరణల మూలంగా తరతరాలుగా సాంప్రదాయంగా పాలకుల, ధనికుల నుండి పొందుచున్న ప్రత్యేక హక్కులను, లాభాలను మతాధిపతులు, మేధావి వర్గాలు కోల్పోయారు. అసలు విదేశీ భావంతో పాలించే ఆంగ్లేయుల పాలన ప్రతి భారతీయుని ఆత్మాభిమానాన్ని దెబ్బతీసింది. ఇట్టి పాలనా స్వరూపాన్ని గ్రహించిన భారతీయులు ఆంగ్ల పాలనను తొలగించు కోవాలని కంకణం కట్టుకొన్నారు. దీనితో దేశమంతటా పలుప్రాంతాల్లో ఆంగ్ల వ్యతిరేక తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. ఇందు రైతులు, వృత్తి పనులవారు, నిరుద్యోగ సైనికులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. రాజులు,

డా. దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఫోన్ 9849584324

జమీందార్లు, పాలెగాళ్ళు, ఇనాందార్లు, కడకు మతాధిపతులు, గిరిజన నాయకులు కూడా ఈ ఉద్యమాలకు నాయకత్వం వహించారు.

ఆంగ్ల వ్యతిరేక ఉద్యమాలు ఆంగ్ల అధికార స్థాపన దేశంలో జరిగిన నాటి నుండే ప్రారంభమైనాయని ఇదివరకే చదివాము. 18వ శతాబ్దిలో జరిగిన ఉద్యమాల్లో బెంగాల్‌లో సాగిన సన్యాసీ తిరుగుబాటు (1763-1800), చౌర్ తిరుగుబాటు (1766-72, 1795-1816), రంగపూర్, దినాజ్ పూర్ తిరుగుబాట్లు (1783) బిష్ణుపూర్, బీర్భం (1799), బెనారస్, ఔద్, ఉత్తర సర్కారుల (కోస్తాంధ్ర) తిరుగుబాట్లు ముఖ్యమైనవి. 19వ శతాబ్ది తొలి అర్థభాగంలో తూర్పున ఒరిస్సా (1804-17), సంబల్‌పూర్ (1827-40)ల లోను, పశ్చిమాన సౌరాష్ట్ర (1816-32), గుజరాత్ (కోలిస్) (1824-28, 1839-49), మహారాష్ట్ర (భిల్ తిరుగుబాటు), సతార (1841) లలోను, ఉత్తరాన బెనారస్, ఔద్, భిలాస్‌పూర్ (1805), అలిఘర్ (1814-17), పశ్చిమ ఉత్తరప్రదేశ్, హర్యానా (1824), జబల్‌పూర్ (1842), ఖాందేష్ (1852) లలోను, దక్షిణాన విజయనగరం (1794), పర్లాకిమిడి (1766-1857), గుంసూరు (1778, 1800, 1830-31, 1835), విశాఖపట్నం (1830-34), రాయలసీమలోని కడప (1801-5, 1846), కర్నూల్, చిత్తూరు (1801-1805) ల్లోను, తంజావూరు, మలబార్ (1800-1801), తిరువాన్కూర్, మైసూర్‌లలోను జరిగినవి ముఖ్యమైనవి. రంప (1879) వంటి ప్రాంతాల్లో గిరిజన తిరుగుబాట్లు కూడా జరిగాయి. నాటి పెద్దతిరుగుబాట్ల (1857-58) లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య పోరాటం అని పేరుగాంచిన ఉద్యమం ప్రధానమైందిగా చెప్పవచ్చు. ఇది బ్రిటిష్ భారత సామ్రాజ్యాన్నే కుదిపివేసింది. పై తిరుగుబాట్లన్నీ బ్రిటిష్ సామ్రాజ్యంలోని ఆంగ్ల వ్యతిరేక వాతావరణానికి కొన్ని సూచికలు మాత్రమే. కాని, ఇవి భారత సాంప్రదాయరీతి తిరుగుబాటు ధోరణిని, ప్రాంతీయ తిరుగుబాటు సాంప్రదాయాన్ని స్థాపించాయని చెప్పవచ్చు. భావితరాల భారత జాతీయోద్యమకారులు వీటినుండే స్ఫూర్తిని పొందారనుటలో సందేహం లేదు. కాని వీటన్నింటినీ ఆంగ్లేయులు కఠిన రీతిలో అణచివేశారు. ఐనా ప్రజల స్వాతంత్ర్య భావం అప్పుడప్పుడూ ఉద్యమాల రూపంలో చెలరేగుచునే యుండేది. కడకు ఇరవయ్యో శతాబ్దిలో ఇది భారత జాతీయోద్యమ రూపాన్ని ధరించి, ప్రజా ఉద్యమంగా మారి, ఆంగ్ల అధికారాన్ని కూల్చి, ఆంగ్లేయుల నుండి 1947లో దేశానికి విముక్తిని తెచ్చింది. దేశంలో సాగిన ఈ పోరాటాలన్నింటినీ ఐదు ప్రధాన ఉపభాగాలుగా విభజించవచ్చు. అవి: పాత వ్యవస్థ కొనసాగుటకు జరిగిన ఉద్యమాలు (restorative or nativisitic movements), మత స్వరూప ఉద్యమాలు (religious movements), సాంఘిక దోపిడీగాళ్ళ ఉద్యమాలు (social banditry), భయంకర వాదుల ఉద్యమాలు (terrorist movements), ప్రజా ఉద్యమాలు (mass movements). ఇవి జాతీయ భావోద్భవ పూర్వదశకు, జాతీయ భావం గల దశకు చెందిన స్వాతంత్ర్యోద్యమాలుగా చెప్పవచ్చు.


ఇక చిత్తూరు జిల్లాలో సాగిన తొలి స్వాతంత్ర్య పోరాట విషయానికి వచ్చినట్లయితే ఇది అత్యంత ముఖ్యమైన వలసపాలనా సంస్కరణల కాలంలో జరిగిందని చెప్పవచ్చు. జమిందారీ, రైత్వారీ, గ్రామవారీ, ఇనాందారీ సంస్కరణల ద్వారా వ్యావసాయిక ఉత్పత్తి సంబంధాల్లో నూతన పద్ధతులు ప్రవేశిస్తున్న రోజుల్లో, పరదేశీ సిద్ధాంతాల ద్వారా మొరటు రూపంలోని పెట్టుబడిదారీ వ్యవస్థ దేశీయ స్వయంపోషక గ్రామీణ వ్యవస్థలో చొచ్చుకొని వెళ్ళుటకు కావలసిన కృషి జరుగుతున్న కాలంలో, వీటి ప్రభావంతో ఏర్పడిందే ఈ చిత్తూరు స్వాతంత్ర్యోద్యమం. అంతేగాక ఆ నాటికే ఆంగ్లపాలనపై విసుగు చెందిన ఇతర దక్షిణ ప్రాంతీయులు చేపట్టిన ఉద్యమాలు కూడా ఈ ప్రాంతీయులపై ప్రభావాన్ని చూపి ఇచట కూడా ఉద్యమం ఏర్పడేటట్లు చేశాయి. ఈ ఉద్యమానికి నేటి చిత్తూరు జిల్లాలో (అనగా పూర్వపు మద్రాసు ప్రెసిడెన్సీలోని కర్నాటక ప్రాంతంలో యుండిన ఉత్తర ఆర్కాటు డివిజనల్‌లో) యుండిన *చిత్తూరు పాలెగాళ్ళని పేరుగాంచిన పదిమంది పాలెగాళ్ళలో తొమ్మిదిమంది నాయకత్వం వహించారు.* అనగా ఇది ఉమ్మడి నాయకత్వాన సాగిన ఉద్యమమని చెప్పవచ్చు. వారే పాకాల, మొగరాల, పుల్లూరు, కల్లూరు, పులిచెర్ల, ఎదురుకొండ (యాదరకొండ లేక యాదరగుంట), నర్గంతి, తుంబ, గుడిపాటి, బంగారు పాలెగాళ్ళు. వీరి ఉద్యమ ప్రారంభకాలానికి, అనగా 1801 నాటికి పాకాలను శేషమనాయుడు, పుల్లూరును కుమార రఘునాథనాయుడు, కల్లూరును రంగపతి రాజు, మొగరాలను చెన్నప్పనాయుడు, పులిచెర్లను తిమ్మానాయుడు, ఎదురుకొండను ముద్దరామప్పనాయుడు, నర్గంతిని అనంతప్ప నాయుడు, గుడిపాటిని శేషమనాయుడు, తుంబను


మల్లప్పనాయుడు, బంగారు పాళేన్ని చంద్రశేఖర నాయుడు పాలించేవారు. వీరిలో గుడిపాటి పాలెగాడు ఉద్యమంలో పాల్గొనలేదు. కాళహస్తి, కార్వేటినగర్ (బొమ్మరాజుపాలెం), వెంకటగిరి కరకంబాడి, కృష్ణాపురం వంటి పాలెగాళ్ళవలె ఆంగ్లేయులకు విధేయుడుగా ఉండేవాడు. తిరుగుబాటు చేసిన పాలెగాళ్ళకు అండగా పలువురు బంధువులు, అనుచరులు, కట్టుబడిదార్లు, ఇనాందార్లు, గ్రామాధికార్లు, మిరాశీదార్లు, కులపెద్దలు, బ్రాహ్మణులు, రైతులు, వృత్తిపనులవారు ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఆంగ్లేయుల నుండి స్వాతంత్ర్యాన్ని పొందుటకై కృషిచేశారు. ఈ ఉద్యమం క్రీ.శ. 1801 నుండి 1805 వరకు సాగింది.

చిత్తూరు ప్రాంతంలో జరిగిన తొలి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన పాలెగాళ్ళు తొలుత ప్రాంతీయ నాయకులుగా ఉండేవారు. ఇట్టి నాయకులను విజయనగర రాజులు క్రీ.శ. 15వ శతాబ్ది మధ్యలో గ్రామాలు, రహదార్లు, అడవి మార్గాల్లో ప్రజల ప్రాణ, ఆస్థి రక్షణలు, శాంతి భద్రతల పరిరక్షణలకై 'కావలిగాళ్ళు' అను హోదాలో (పోలీసు అధికార్లు) నిర్ణీత విస్తీర్ణంగల ప్రాంతాలకు నియమించారు. జీవనంకై వీరికి జీతానికి బదులు నామమాత్రపు శిస్తు చెల్లించు పద్ధతిపై 'కావలి ఇనాం' భూములను ఇచ్చారు. విధి నిర్వహణలో వీరికి అండగా ఉండే వారి (అమరం, కట్టుబడి, మెర్సినరీ ఫ్యూన్లు) ఖర్చుల చెల్లింపుకై 'ఊబ', 'నీత', అను సుంకాలను కూడా వీరు ప్రజలనుండి వసూలు చేసుకొనేవారు. తొలి దశలో వీరు పేష్కష్ (tribute) చెల్లించాల్సి ఉండేది కాదు. క్రీ.శ. 1565 లో జరిగిన తళ్ళికోట (రాక్షసతంగడి) యుద్ధం తరువాత నాటి రాజకీయ పరిస్థితిని అవకాశంగా తీసుకొని పాలెగాళ్ళు అను బిరుదును ధరించారు. తమ కావలి ఇనాంపై ప్రభుత్వానికి చెల్లించు చుండిన శిస్తును కూడా ఆపేశారు. క్రమంగా కేంద్రప్రభుత్వాల, సర్కారు భూములను ఆక్రమించుకొని పాళేలను విస్తరించుకొని బలపడసాగారు. ఇది విజయనగర రాజుల చివరి రోజుల కాలంలోను, కుతుబ్‌షాహి, మొగల్, అసఫ్‌జాహి, నెవాయత్ వలాజా నవాబుల (కర్నాటక) కాలంలోను, కడకు ఆంగ్లో-ఫ్రెంచ్ కర్నాటక యుద్ధాల కాలంలోను సాగింది. ఈ ఆక్రమిత ప్రాంతాల నుండే వీరు 'నీత' అనే పన్ను వసూలు చేసేవారు. నాటి రాజకీయ పరిస్థితిని అవకాశంగా తీసుకొని; బలపడి, స్వతంత్రంగా జీవించసాగారు. పేష్కష్ అనే కప్పాన్ని కూడా చెల్లించేవారు కాదు. 18వ శతాబ్ది తొలిదశలో నాటి కర్నాటక నవాబు సాదత్ ఉల్లాఖాన్ కాలంలో చిత్తూరులో ఫౌజ్‌దార్‌గా యుండిన తైర్ మహమ్మద్‌ఖాన్ యొక్క 'బక్షి' గులాం మహమ్మద్ చేతనే తొలిసారిగా వీరినుండి నలభైవేల 'పల్లిపట్టు పగోడా'ల పేష్కష్ వసూలు చేయుట జరిగింది. కాని వీరు పేష్కష్‌ను సక్రమంగా చెల్లించే వారు కాదు. కర్నాటక నవాబులు బలహీనంగా ఉండుటే ఇందుకు కారణం 18వ శతాబ్ది చివర్లో కర్నాటక నవాబైన మహమ్మదాలీ (వాలాజా) తన తమ్ముడైన వాహబ్‌ను చిత్తూరు పాళేలతో కూడిన ప్రాంతానికి జాగీర్దారుగా నియమించి పేష్కష్ వసూలు సక్రమంగా జరుగుటకై ప్రయత్నించాడు. కాని పూర్తిగా సఫలీకృతుడు కాలేదు. వాహబ్ ను తాత్కాలికంగా తొలగించిన హైదరాలీ మాత్రం పూర్తి పేష్కష్‌ను వసూలు చేశాడు. బందీనుండి తిరిగి వచ్చిన వాహబ్, ఆ తరువాత అతని కుమారుడు డీలర్‌లు పేష్కష్ వసూలుకై ప్రయత్నించగా వీలుపడలేదు. పాలెగాళ్ళ స్వాతంత్ర్య ప్రియత్వమే ఇందుకు కారణం. దీనికితోడు నవాబులు బలహీనులుగా ఉండేవారు. కడకు 1801లో చిత్తూరు ఆంగ్లేయుల స్వాధీనమైన తరువాత ఉత్తర ఆర్కాటు డివిజన్‌కు (అప్పట్లో దీన్ని జిల్లా అని పిలిచేవారుకాదు. ఈ డివిజన్‌లో పలు జిల్లాలుండేవి.) తొలి కలెక్టరైన జార్జి స్ట్రాంటన్, రెండవ కలెక్టరైన డేవిడ్ కాక్‌బర్న్‌లు, ఈ పాలెగాళ్ళ పేష్కష్‌ను విపరీతంగా పెంచి పూర్తిగా వసూలు చేశారు. కాని తిరుపతి సమీపానగల కరకంబాడి, కృష్ణాపురం పాలెగాళ్ళ నుండి మాత్రం పేష్కష్ వసూలు చేయబడలేదు. తిరుమలకు వెళ్ళే ప్రయాణీకుల రక్షణ, వారి ఆస్తినష్టాలు పూరించుట వీరి విధులుగాన వీరికి పేష్కష్ చెల్లింపు మినహాయింపు ఉండేది. నవాబుల కాలంలో నవాబులకు అవసరమైన సమయాల్లో సైనిక సహాయం చేసి, పేష్కష్ చెల్లించే నియమంపై చిత్తూరు పాలెగాళ్ళు తమ పాళేలను స్వేచ్ఛగా పాలించు కొనేవారు. పలు హక్కులను కలిగి యుండేవారు. రాజులవలె అన్ని హంగులను, దర్పాలను, దర్బార్లను, నగర్లను (రాజభవనాలు), అధికార్లను, సైనికులను (ప్యూన్లు) కలిగియుండేవారు. పటిష్టమైన రెవిన్యూ, పోలీసు, సైనిక వ్యవస్థలను కలిగియుండేవారు. ఇట్టి చిత్తూరు పాలెగాళ్ళు వేట ఆధారంగా జీవించే అటవికులైన (nomads) బోయ, ఏకరి కులాలకు చెందిన వారు. ఆటవిక నాయకులుగా యుండిన వీరు

సాంఘిక పరిణామంలో మార్పుచెంది బోయ, ఏకరి కులస్తులుగా సాంఘిక స్థానాన్ని పొందారు. బోయల్లో ముత్రాచ, వాడమంజి అను ఉపతెగలు ఉండేవి. ఏకర్లను చిత్తూరులో ఏకర్లని, యాకర్లని పిలుస్తారు. వీరినే నెల్లూరు, కడపల్లో బోయలని, కిరాటులని పిలచేవారు. కిరాటులు ఆటవిక నేర జాతులని కృష్ణదేవరాయలు కూడ ఆముక్తమాల్యదలో తెలిపియున్నాడు. ఆటవిక నాయకులు, ప్రముఖ గ్రామాధిపతులు, ఇతర నాయకులేగాక నేరవృత్తి ప్రధానంగాగల నాయకులు కూడా విజయనగర కాలంలో కావలివాళ్ళుగా (వీరే తరువాత పాలెగాళ్ళయ్యారు) నియమింపబడే సాంప్రదాయం ఉండేది. చిత్తూరు పాలెగాళ్ళను కావలిగాళ్ళు, పాలెగాళ్ళు, పాలయప్పట్టుదొరలు, దొరలు, నాయకులు, నాయళ్ళు (నాయుడుకాదు; నాయడు) నాయని వార్లని కూడా పిలుస్తారు. ఒక ప్రాంతానికి నాయకులుగావున విజయనగర కాలపు నాయంకర విధానంలో విశాలప్రాంతాలకు అధిపతులుగా యుండిన 'నాయక' అను అధిపతులవలె వీరినికూడా నాయక, నాయడు అని 'నాయకుడు' అనే అర్థంలో పిలిచేవారు. నాయడు అనే పదం నాయక అనే వృత్తి శబ్దం నుండి పుట్టింది. ఇది క్రమంగా పరిణామంచెంది నాయనివారు (అనగా నాయకుడు గారు) అను శబ్దంగా మారి కుల నామంగా స్థిరపడింది. అన్ని భారతీయ కులాలవలె 'నాయనివారు' అనుకులం కూడా వృత్తిరీత్యా ఉద్భవించింది మాత్రమే. కల్లూరు, తుంబ, పులిచెర్ల, బంగారి, గుడిపాటి పాలెగాళ్ళు, 'ఏకరి' కులస్తులు, వీరినే నాయనివార్లని కూడా నేడు పిలుస్తారు. చిత్తూరు పాలెగాళ్ళలో బంగారుపాళెం పాళయగాళ్ళ చరిత్ర ప్రాచీనమైందిగా తోస్తోంది. వీరి వంశ ప్రథముడుగా చెప్పదగిన అగ్గితిమ్మన క్రీ.శ. 14వ శతాబ్దిలోనే పాలయప్పట్టు దొరగా (కావల్గార్) నియమితుడైనట్లు తెలుస్తోంది. అనగా ఇతడు విజయనగర పాలకులైన ఒకటవ హరిహరరాయలు లేక ఒకటవ బుక్కరాయల కాలస్తుడు. క్రీ.శ.1343లో బుక్కరాయులు పెనుగొండలో రాజ ప్రతినిధిగా ఉండిన రోజుల్లో ఇతడు నియమించబడినట్లు తోస్తోంది. వారసులు లేనిచో దత్తపుత్రులు వారసులగుట చిత్తూరు పాలెగాళ్ళలో అగుపడును. అంతేగాక స్త్రీలు కూడా పాలకులయ్యేవారు. ఉదాహరణకు పాకాల, పులిచెర్ల, కరకంబాడి పాళేల్లో స్త్రీలు పాలకులుగా ఉండిన సందర్భాలు గలవు. రాజుల వలె చిత్తూరు పాలెగాళ్ళు నగర్లను (రాజాంతఃపురాలు), దర్బార్లను, పలురకాల సేవకులను అధికార్లను, అనధికార్లను కల్గియుండేవారు.

ఇట్టి ప్రాచీన చరిత్ర, స్వాతంత్ర్య భావాలు గల చిత్తూరు పాలెగాళ్ళపై 1801 లో ఆంగ్లేయులు తమ పెత్తనాన్ని ఏర్పరచుకొన్నారు. ఆ తరువాత వలసపాలనా స్వభావాలైన పీడన, దోపిడి వంటి వాటిని పలురకాలుగా బహిర్గతం చేశారు. పాలెగాళ్ళపై విపరీతంగా పేష్కష్ భారాన్ని విధించారు. ఇది తొలుత రెండింతలు చేయబడి 53%కి తీసుకు రాబడింది. ఆతరువాత 67%నికి పెంచబడ్డది. ఇదివరకు వాయిదాల్లో పేష్కష్ చెల్లించుచుండిన విధానం కూడా రద్దు చేయబడింది. క్రీ.శ.16వ శతాబ్దినుండి పాలెగాళ్ళు అనుభవించు చుండిన స్వాతంత్ర్యము కూడ హరించు ప్రయత్నం జరిగింది. వీరు అనుభవించు చుండిన పలు హక్కులు తొలగించబడ్డాయి. వీరి 'కావలి' అధికారం (పోలీసు) ప్రభుత్వపరం చేయబడింది. కావలిగాళ్ళ హోదాలో పాలెగాళ్ళ అధీనంలో యుండిన సర్కారు భూములు లాక్కోబడ్డవి. స్వసుంత్రం అనే పన్ను వసూలు హక్కు లేకుండా చేయబడింది. అంతేకాక వీరి అనుచరగణం అనుభవించు చుండిన అమరం, చిల్లూరు, కట్టుబడి, మాన్యం మొదలగు ఇనాంలు, మిరాశీలు,





వేరలు లేకుండా చేయబడ్డాయి. ఈ చర్య పాలెగాళ్ళను, వారి అనుచరగణాన్ని, రైతులను బాధించింది. అంతేగాక పాలెగాళ్ళ నుండి తక్కువ గడువులో పేష్కష్ వసూలు చేయసాగారు. బాకీ పడినచో బంధించే వారు. బాకీకి బదులు వీరి పాళేలను పూర్తిగాగాని, పాక్షికంగా గాని ఇవ్వమనేవారు. ఇవన్నీ గాక వీరి అనుచరులైన 'ప్యూన్' లనే సైనికులను తొలగించాల్సిందిగా కూడా ఆంగ్లేయులు ఆజ్ఞాపించారు. పాళేల్లోని కోటలు మొదలైన కట్టడాలను కూల్చమన్నారు. ఆంగ్ల సైన్యాలు నడవడానికి రోడ్లు నిర్మించాల్సిందిగా పాలెగాళ్ళను ఆజ్ఞాపించారు. ఆంగ్లాధికార్లు పాలెగాళ్ళతో అతి కరకుగా కూడా ప్రవర్తించే వారు. వీరి అనుచర సైనికులను (అమరం, కట్టుబడి, ప్యూన్లు) దొంగలని, దోపిడీదారులని, వారికి పాలెగాళ్ళ మద్దతు ఉందని భావించి వీరందరినీ నానావిధాల బాధించేవారు, అవమానపరచేవారు. ఇవన్నీ పాలెగాళ్ళ తిరుగుబాటుకు దారితీశాయి. మరో వైపు గ్రామవారీ, రైత్వారీ మొదలైన విధానాలు ప్రవేశపెట్టుట ద్వారా పన్ను భారం పెంచి, హింసా విధానాలతో కఠినంగా పన్ను వసూళ్ళు చేసి, రైతు వర్గాలను బాధించుట వలన ఆ వర్గాలు కూడా పాలెగాళ్ళతో బాటు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాట మార్గాన్ని ఎన్నుకొనేట్లు చేశారు. వలస పాలకులుగా, వ్యాపార్లుగా ఆంగ్లేయులు ధనం, రాజ్యవ్యాప్తులకే ప్రాధాన్యం ఇచ్చారు.

ఇట్టి అనేక కారణాలవలన కోపోద్రిక్తులైన పాలెగాళ్ళు తొలుత తమ పేష్కష్ చెల్లింపును ఆపేశారు. అనగా పన్నుల నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు. దీనితో ఆంగ్లేయులు వీరిని బంధించుట, హింసించుట ప్రారంభించగా పాలెగాళ్ళు పోరాటానికి సిద్ధమయ్యారు. తొలుత తమ ప్రాంతాల్లో పయనించే ఆంగ్లేయులను ముట్టడించి బాధించసాగారు. అట్టి బాధితుల్లో కెప్టెన్ నుథ్థాల్ ఒకడు. ఆ తరువాత ఆంగ్లేయుల ఆధీనంలోని అంబూర్ వంటి సర్కారు జిల్లాలను (ప్రాంతాలను) ముట్టడించసాగారు. దీనితో ఆంగ్లేయులు నర్గంతి పాలెగాణ్ణి బంధించారు. కాని తమవద్ద తగిన సైన్యం లేనందున (మరాఠా యుద్ధాల కారణంగా) అతన్ని విడుదల చేశారు. బంధించినందుకు ప్రతీకారంగా నర్గంతి పాలెగాడు, అతని మిత్రులు కలసి సర్కారు జిల్లాలను ధ్వంసం చేయసాగారు. కడకు చిత్తూరులోని సర్కారు ఖజానాను కొల్లగొట్ట ప్రయత్నించారు. సైన్యం లేనందున ఆంగ్లేయులు సామరస్య విధానాన్ని అనుసరించాల్సి వచ్చింది. కాని సైనిక కవాతులతో పాలెగాళ్ళను భయపెట్టుటకు ప్రయత్నించారు. దీనితో పాలెగాళ్ళు మరింత రెచ్చిపోయి సర్కారు జిల్లాలను మరలా ముట్టడించసాగారు. ఇంతలో లెఫ్టినెంట్ కల్నల్ డార్లీ పెద్ద సైన్యంతో చిత్తూరు పాళేల్లో ప్రవేశించాడు. ఇతడు కూడా తొలుత శాంతియుత పరిష్కారానికి ప్రయత్నించాడు. కాని ఇతని ప్రతిపాదనలు పాలెగాళ్ళను తృప్తి పరచలేదు. దీనితో డార్లీ పెనుమూరు వైపు సైన్యంతో పయనించి మొగరాలపై ముట్టడించి ఆ పాళేన్ని స్వాధీనపరచుకొన్నాడు. దీనితో భయపడి మొగరాల-పాకాల పాలెగాడయిన చెన్నప్పనాయుడు ఆంగ్లేయులకు లొంగిపోయాడు. వీటి పాలెగాళ్ళు తొలుత నెల్లూరులో, ఆ తరువాత చెంగల్పట్టులో బందీలుగా ఉంచబడ్డారు. ఆ తరువాత సముద్రం ద్వారాగాని, భూమి మీదనుండి గాని పాలెగాళ్ళకు సహాయం రాకుండా నిరోధించుటకు ఆంగ్లేయులు తగిన చర్యలు తీసుకొన్నారు. నెల్లూరు, ఒంగోలు, చెంగల్పట్టు సముద్రతీరాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆనాటికి ఫ్రెంచివారి భయం ఉన్నందున ఆంగ్లేయులు ఇట్టి చర్యలను తీసుకొన్నట్లు భావించవచ్చు. ఈ చర్యల తరువాత పాలెగాళ్ళతో ఒక అంగీకారం కుదుర్చుకొని ఉద్యమాన్ని బలహీన పరచుటకు

ఆంగ్లేయులు ప్రయత్నించారు. కాని పాలెగాళ్ళు సమ్మతించలేదు. దీనితో ఆంగ్ల సైన్యం కల్లూరు, పులిచర్ల కోటలను ముట్టడించింది. కాని చిత్తూరు పాలెగాళ్ళు సమైక్యంగా పుల్లూరుకోట వద్ద ఆంగ్ల సైన్యాన్ని ఎదుర్కొన్నారు. డార్లీ, ఆర్మ్‌స్ట్రాంగ్, బ్రూన్, మూర్‌లు వీరోచితంగా పోరాడినప్పటికీ కోటను స్వాధీనం చేసుకోలేక పోయారు. క్రమంగా కోట ఆంగ్లేయుల స్వాధీనమైందిగాని పాలెగాళ్ళు దొరకలేదు. ఈ విజయం తరువాత పాలెగాళ్ళు బంగారు పాళేన్ని రక్షించుకొనుటకై ప్రయత్నించారు. కాని విఫలమయ్యారు. కాని మొగరాలలోని ఆంగ్లసైన్యాన్ని ముట్టడించి ఆయుధాలు స్వాధీన పరచుకొన్నారు. గుడియాత్తంలోని కలెక్టర్ రక్షక భటులపై ముట్టడి చేశారు. ఇంతలో ఆంగ్లసైన్యం తుంబ పాళేన్ని ముట్టడించింది. దీనితో కోపోద్రిక్తులైన పాలెగాళ్లు తిరుమలకు వెళ్లే ప్రయాణీకులను ముట్టడించి, సుంకాలు వసూలుచేసి ప్రభుత్వానికి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నుండి వచ్చే ఆదాయం లేకుండా చేశారు. ఈ స్థితిలో ఆంగ్లేయులు మరలా సామరస్య పరిష్కారానికై ప్రయత్నించారు. గాని ఫలితం లేకపోయింది. దీనితో ఆంగ్ల సైన్యం బంగారుపాళెం కోటను ముట్టడించింది. ఆ తరువాత దీని పాలెగాడి కుమారుడికి చెందిన ఎదురు కొండ పాళేన్ని ఆక్రమించారు. తరువాత నర్గంతి పాళేన్ని స్వాధీనపరుచుకొన్నారు. ఆ తరువాత పాలెగాళ్ళను బంధించుటకై వెతక సాగారు. పాలెగాళ్ళకు రైతులనుండి మద్దతులేకుండా చేయుటకు కూడా ప్రయత్నించారు. ఈ దశలోనే నాగపేట వద్ద ఆంగ్ల సైనిక నాయకుడు కెప్టెన్ బ్రూన్‌కి కల్లూరు, పుల్లూరు, పులిచెర్ల పాలియగాళ్ళకు మధ్య తీవ్రపోరాటం సాగింది. కాని పాలెగాళ్ళు ఓడి పారిపోయారు. మరోవైపు కెప్టెన్ ఆర్మ్‌స్ట్రాంగ్ వరదరామి వద్దగల బంగారిపాలెగాడి అనుచరులను బంధించుటకు ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ తరువాత ఆంగ్లసైన్యం నందూరుకొండను (చందూరు కొండ) ముట్టడించింది. బంగారి పాలెగాడి అనుచరులను పట్టుకొనుటకు ప్రయత్నించిందిగాని విఫలమయింది. ఆ తరువాత ఆంగ్లసైన్యం పాలెగాళ్ళకై గాలించసాగింది. ఇదే తరుణంలో సర్కారు ప్రాంతాలైన వల్లికొండ, కీలేశ్వర్, కలకనూరు, కళత్తూరులను పాలెగాళ్లు ముట్టడించారు. ఇట్టి పరిస్థితుల్లో శాంతియుత మార్గాలద్వారా పాలెగాళ్ళ ఉద్యమాన్ని నిలుపుదల చేయుటకై మద్రాసు ప్రభుత్వం హార్డిన్ వెబ్, స్ట్రాటన్‌లతో కూడిన స్పెషల్ కమిషన్‌ను సెప్టెంబర్ 22, 1804లో నియమించింది. కాని, దీని కృషి కూడా ఫలించలేదు. పాలెగాళ్ళు గెరిల్లా పోరాటాన్ని ఆపలేదు. దీనితో ఆంగ్లేయులు కఠిన సైనిక చర్యల ద్వారా పాలెగాళ్ళ ఉద్యమాన్ని అణచి వేయుటకు నిర్ణయించు కొన్నారు. అందుకై సైనిక చట్టాన్ని ప్రకటించి, పెద్ద సైన్యాన్ని సమీకరించి దాని నాయకుడిగా మనీపెన్నీని నియమించారు. ఇతడు కూడా తొలుత శాంతియుతంగా సమస్య పరిష్కారానికి ప్రయత్నించాడుగాని తమకు తృప్తికరంగా లేనందున పాలెగాళ్ళు అంగీకరించలేదు. తిరుగుబాటు కొనసాగించుటకే నిర్ణయించు కొన్నారు. కాని సైనిక చట్టం ప్రకటించగానే నర్గంతి పాలెగాడు ఆంగ్లేయులకు లొంగిపోయాడు. ఇతర్లు లొంగలేదు. అందుచే అన్ని వైపులనుండి పాలెగాళ్లను ముట్టడించి అరణ్యాల్లో బంధించాలని భావించి మైసూరు నుండి కూడా మహారాజా సైన్యాలను, ఆంగ్ల సైన్యాలను బాలాజీరావ్, కెప్టెన్ లిటిల్‌ల నాయకత్వాన రప్పించుట జరిగింది. మైసూరు సైన్యానికి, ఎదురుకొండ, బంగారి పాలెగాళ్ళకు మధ్య మొగిలిఘాట్ వద్ద పెద్ద పోరాటం జరిగింది. దీనితో భయపడి బంగారిపాళయగాడు లొంగిపోయాడు. ఎదురుకొండ పాలెగాడు పారిపోయాడు. కాని గుడి యాత్తం వద్ద చిత్రదుర్గంనుండి వచ్చుచుండిన ఆంగ్లసైన్యాన్ని ఇతడు ఎదుర్కొని ముప్పుతిప్పలు పెట్టాడు. కాని ఫలితంలేక తప్పించుకొన్నాడు. ఈ లోపు మనీపెన్నీ కూడా పెనుమూరు వైపు సైన్యంతో బాటు పయనించసాగాడు. ఇంతలో మొగరాల-పాకాలకు చెందిన పెనుమూరు వద్దగల



జలియన్ వాలా బాగ్!

గానిగబండ రక్షణకై పాలెగాళ్ళు పెనుమూరు వద్ద ఆయుధాలతో సిద్ధమగుచున్నారని తెలిసి సైన్యంతో పెనుమూరు చేరాడు. ఇచట పెద్ద పోరాటం జరిగింది. అటు ఆంగ్లేయులకు, ఇటు పాలెగాళ్ళకు పెద్ద నష్టం జరిగింది. ఇది జరిగాక పాలెగాళ్లు అరణ్యాల్లోకి వెళ్ళి రక్షణ పొందారు. దీని తరువాత గానిగబండ, పులిచెర్ల, కొండల ఆక్రమణకై ఆంగ్ల సైన్యం ప్రయత్నించింది. ఆ తరువాత మనీపెన్నీ నాగబట్లకు వెళ్ళాడు. దీని దాపున చామకొండలో వుల్లూరు, మొగరాల, పాకాల పాలెగాళ్ళు ఉన్నారని తలచి చామకొండలో ప్రవేశించగా అచటి పాలెగాళ్ళు ఇతనితో పోరాటం సాగించారు. కాని విజయం పొందలేక పోయారు. ఈ లోపు పోరాటంతో విసుగు చెందిన కల్లూరు, పులిచెర్ల, తుంబ పాలెగాళ్ళు సీడెడ్ జిల్లాల కలెక్టర్ మన్రో వద్ద లొంగిపోయారు. దీని తరువాత మొగరాలకొండ వద్ద ఆంగ్లసైన్యానికి మొగరాల, పాకాల పాలెగాళ్ళకు మధ్య పోరాటం జరిగింది. ఆంగ్లేయుల ధాటికి తట్టుకోలేక ఈ పాలెగాళ్ళు తప్పించుకొని శెట్టిగుంట, తిరుపతి, కరకంబాడి, కాళహస్తి, కార్వేటినగర్ కొండల్లో పయనించి కడకు మన్రో వద్ద లొంగిపోయారు. తరువాత వుల్లూరు పాలెగాడు కూడ వీరిని అనుసరించాడు. చివరకు ఎదురుకొండ పాలెగాడు ముద్దురామప్పనాయుడు మాత్రం మిగిలాడు. ఇతడొక్కడే చివరి వరకు ఆంగ్లేయులతో పోరాడిన ఘనుడు, వీరుడు, ఆంగ్లేయులకు లొంగని వాడు. చార్గల్ పాలెగాడి సహాయంతో సాత్‌ఘర్ వద్ద మైసూరు సైన్యాన్ని కూడా దెబ్బతీశాడు. చివరకు మైసూరు సైన్యం చేతిలో కల్లెయ్యబండ అడవుల్లో బందీయై ఉరిశిక్షకు గురయ్యాడు. దీనితో ఫిబ్రవరి 20, 1805 నాటికి పాలెగాళ్ళ ఉద్యమం అణిచివేయబడింది.

కొందరు పాలెగాళ్ళు పాళేలు శాశ్వితంగా ఆంగ్లేయుల స్వాధీనం చేయబడగా, మరికొందరి పాళేలు తాత్కాలికంగా ప్రభుత్వ స్వాధీనం కాబడి ఆ తరువాత జమిందారీ శాశ్విత శిస్తు నిర్ణయ విధానం ప్రకారం సక్రమంగా శిస్తు చెల్లించు నియమంపై వీటి పాలెగాళ్ళు పునః అధికార స్థాపితులైరి. వీరి అప్పులు పరిష్కరించబడ్డాయి. తిరుగుబాటు ముగిశాక పాలెగాళ్ళు దూర ప్రాంతాల్లో బందీలుగా ఉంచబడ్డారు. వారి జీవనంకై భృతి చెల్లించబడింది. చిత్తూరు పాళేల్లోని ఆంగ్లసైన్యం చాల వరకు ఉపసంహరించబడింది. సైనిక చట్టం రద్దు చేయబడింది. సివిల్ అధికారం ఏర్పరచబడింది. పాలనాపరమైన మార్పులు చేయబడ్డాయి. కొందరు పాలెగాళ్ళు, వారి అనుచరులు సైనిక చట్ట ప్రకారం ఉరితీయబడ్డారు. కొందరు దేశబహిష్కరణ గావించబడ్డారు. మరికొందరు బందీలో ఉంచబడ్డారు. ఉరితీయబడ్డ వారిలో ఎదురుకొండ పాలెగాడు ముద్దురామప్పనాయుడు ముఖ్యుడు. ఈ ప్రాంత ప్రజలను శాంత పరచుటకై కొన్ని సంస్కరణలు చేపట్ట బడ్డాయి. గ్రామపెద్దలు, కట్టుబడి ప్యూన్లు, మిరాశీదార్ల భూములు చాలవరకు తిరిగి ఇచ్చివేయబడ్డాయి. నూతన భూసంస్కరణలు చేపట్టబడ్డాయి.

చిత్తూరు పాలెగాళ్ళు ప్రారంభించిన స్వాతంత్రోద్యమంలో చిత్తూరు పాళేల్లోని పలువర్గాల ప్రజలు కూడా పాల్గొనుట అగుపడుతుంది. ప్రాచీన కాలంనుండి స్వయంపోషకత్వంతో, సాంప్రదాయ పాలనా వ్యవస్థతో వెలసియుండిన గ్రామ వ్యవస్థలో ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన మార్పుల కారణంగా గ్రామ పెద్దలు లేక మిరాశీదార్లు, కుల పెద్దలు, ఆయగాళ్ళు లేక బారబల్లూటి అని పిలువబడుతున్న పన్నెండుమంది గ్రామాధికారుల విషయంలో తీవ్రమైన మార్పులు తెచ్చుట వలన ఒకవైపు వీరిప్రాముఖ్యం, అధికారం, మరోవైపు గ్రామవ్యవస్థ దెబ్బతినుటవలన ఈ వర్గాలన్నీ ఆంగ్లేయుల ఎడల తీవ్ర అసంతృప్తి చెందారు. అంతేగాక వంశపారంపర్యంగా అనుభవంలో యుండిన అమరం, చిల్లూరు ఇనాంలు, గ్రామమాన్యాలు, కట్టుబడి ఇనాంలు నాటి కలెక్టర్ కాక్‌బర్న్ చే రద్దుచేయబడ్డాయి. ఈ చర్య రాజకీయ, సాంఘిక వర్గాలను అసంతృప్తి పరచింది. గ్రామాధికారుల తారాపడి ఇనాంలు, దామాషే ఇనాంలు రద్దయ్యాయి. కరణాలు, మణేగార్లు పొందుచుండిన మేరలు, స్వసుంత్రం అనే సుంకాలు, ఇతర రుసుములు రద్దుకాబడ్డాయి. ఇతర గ్రామోద్యోగులకు చెందిన ఇట్టి హక్కులూ రద్దయ్యాయి. అలాగే గ్రామకట్టుబడి, పాళెంకట్టుబడి, ప్యూన్ల ఇనాంలు రద్దయి సాధారణ శిస్తు వసూలు చేయుట జరిగింది. ఇక ఆలయాలు, మఠాలనిర్వహణకు ఇవ్వబడ్డ దేవాదాయ ఇనాంలు, బ్రాహ్మణులకు ఇవ్వబడ్డ అగ్రహారాలు, బ్రాహ్మణాదాయాలు, షోత్రియాలు, భటవృత్తి, ఇనాంలు రద్దయి సాధారణ శిస్తు వసూళ్ళు జరిగాయి. పలు వర్గాలకు చెందిన మిరాశీ భూములు (కనియాట్చి భూములు) స్వాధీనం చేసుకోబడ్డాయి. సాధారణ శిస్తువసూళ్ళు చేయబడ్డాయి. సత్రాలు, పాఠశాలలు మొదలగు వాటి నిర్వహణకు ఇవ్వబడ్డ ధర్మాదాయ ఇనాంలు

రద్దయ్యాయి. చెరువుల నిర్మాణం, చెరువుల మరమ్మత్తు, నీటి కాలువల త్రవ్వకం, తటాకాల నిర్వహణ, ఆనకట్టల నిర్మాణం మొదలగు నీటి పారుదల ఏర్పాట్లకు, రోడ్ల నిర్మాణాలకు ఇవ్వబడ్డ ఇనాంలు రద్దయ్యాయి. అసలు నీటి పారుదలకు ప్రాధాన్యతే లేకుండింది. రోడ్ల నిర్మాణం కేవలం సైనిక అవసరాలకే జరిగేది. ఈ చర్యలన్నీ రైత్వారీ విధానాన్ని విశాల ప్రాంతాలకు వ్యాప్తి చేసి అధిక ఆదాయాన్ని పొందుటకే తీసుకోబడినాయి. కాని దీనివలన రైతు వర్గాలన్నీ తీవ్ర అసంతృప్తికి గురైనాయి. ఇంతేగాక వ్యాపార వాణిజ్యవర్గం కూడా అసంతృప్తి చెందింది. వీరిపై సయర్, మోతుర్ఫా పన్నులను అధికంగా విధించారు. సాలివారపై పన్ను విధించబడింది. ఇండిగోపై పన్ను వేయబడింది. పలు వృత్తి పన్నులు విధించబడ్డాయి. ఇదంతా ఈ వర్గాలను అసంతృప్తి పరచింది. ఆధునికత ముసుగులో దోపిడీ సాధనంగా ఉపయోగపడిన రైత్వారీ విధానం ద్వారా రైతులు పీల్చిపిప్పి చేయబడ్డారు. ఈ విధానంలో మానవత్వానికి స్థానంలేదు. ఇందు క్రమం తప్పకుండా శిస్తు వసూళ్ళు చేయబడ్డాయి. శారీరక హింస పెట్టికూడా పన్ను వసూలు చేయబడేవి. అంతేగాక డబ్బు రూపంలో మాత్రమే శిస్తు చెల్లింపు అంగీకరించబడేది. ఈ పద్ధతి రైతులకు నష్టాన్ని, కష్టాన్ని తెచ్చిపెట్టింది. దీనితో రైత్వారీ విధానానికి వ్యతిరేకంగా రైతులు తొలుత పన్నుల నిరాకణోద్యమాన్ని చేపట్టారు. ఏరి, పవొటవారి, కాణిపాకం, పట్నం, కట్టమంచి, కొత్తకోట గ్రామీణులు గ్రామాలు వదలి వలసవెళ్ళి తమ నిరసనను ప్రదర్శించారు. అట్టి వారే నేటి చిత్తూరు జిల్లాతో కూడి ఉండిన ఆర్కాట్ డివిజన్‌లోని ప్రాంతంలోని ఏరి, పవొటవేరి గ్రామాల రైతులు 34 మంది, చిత్తూరు ప్రాంతంలోని పట్నం గ్రామ రైతులు వెంకట రెడ్డి, నాచంరెడ్డి, చిన నారాయణరెడ్డి, కట్టమంచి రైతు, చిన్నప్ప రెడ్డి, ముదిగులంరైతు వెంకటరెడ్డి, కొత్తకోట రైతు వెంకటరెడ్డి ముఖ్యులు. ఇలా వెళ్లిన రైతుల్ని రప్పించి పొలాలు సాగు చేయించాలని, ప్రభుత్వానికి రెవిన్యూ నష్టం లేకుండా చేయాలని నాటి కలెక్టర్ కాక్‌బర్న్ ప్రయత్నించాడు. అందుకే పలు అభయాల్ని ఇచ్చాడు. కాని వారు రాలేదు. దీంతో వీరిపై చట్ట వ్యతిరేకంగా పొలాలసాగు ఆపేశారని, నేరం మోపాడు. అంతేగాక వీరిని బంధించడానికి గంగారాం, వెంకటరామయ్య, షేక్ సుత్తేద్‌లను నియమించాడు. కాని ఈ చర్య రైతుల ఉద్యమానికి దారితీసింది. వీరితో మిరాశీదార్లు, గ్రామపెద్దలు, పాలెగాళ్ళు, బ్రాహ్మణులు, రెడ్లు, కూడా చేరి రైత్వారీ విధాన రద్దుకై ప్రయత్నించారు.

**కొందరు పాలెగాళ్ళ పాళేలు శాశ్వితంగా ఆంగ్లేయుల స్వాధీనం చేయబడగా, మరికొందరి పాళేలు తాత్కాలికంగా ప్రభుత్వ స్వాధీనం కాబడి ఆ తరువాత జమిందారీ శాశ్విత శిస్తు నిర్ణయ విధానం ప్రకారం సక్రమంగా శిస్తు చెల్లించు నియమంపై వీటి పాలెగాళ్ళు పునః అధికార స్థాపితులైరి. వీరి అప్పులు పరిష్కరించబడ్డాయి. తిరుగుబాటు ముగిశాక పాలెగాళ్ళు దూర ప్రాంతాల్లో బందీలుగా ఉంచబడ్డారు. వారి జీవనంకై భృతి చెల్లించబడింది. చిత్తూరు పాళేల్లోని ఆంగ్లసైన్యం చాల వరకు ఉపసంహరించ బడింది. సైనిక చట్టం రద్దు చేయబడింది. సివిల్ అధికారం ఏర్పరచబడింది. పాలనాపరమైన మార్పులు చేయబడ్డాయి.**

ఇక చిత్తూరు డెన్‌కెంకోట రైతులు సుమారు 1500 మంది తిరుగుబాటుకై ధర్మపురిలో సమావేశమయ్యారు. కానీ వారి ప్రయత్నాన్ని ఆంగ్లేయుల సైన్యం వమ్ముచేసింది.

అంతేగాక రాయకోట దగ్గరి గ్రామాల్లో పెద్ద తిరుగుబాటు కూడా జరిగింది. ఇందులో సుమారు 800 నుంచి 900 మంది రైతులు పాల్గొన్నారు. వీరిని అణచడానికై శంకరి దుర్గం నుండి 80 మంది సిపాయిలు, ఆఫీసర్లు, వెల్లూరు, ఈరోడ్డు నుండి రెండు కంపెనీల సైన్యం వచ్చింది. ఆంగ్లేయులు సైన్యంతో దీన్ని అణచాల్సి వచ్చింది. తింగెరికోట, పాల్‌కోడు, కృష్ణగిరి, వీర బిడ్డల దుర్గం రైతులు సుమారు 1500 మంది కూడా ఇందులో చేరారు. బ్రాహ్మణులు, రెడ్లు, పాటిళ్ళు, ఇతరులు రైత్వారీ విధాన రద్దుకు కృషిచేశారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించిన పలు రైతువర్గాలు సాంఘికంగా, ఆర్థికంగా తమ అండలో యుండే పాయకార్లు, ఊల్‌కుడి, పరయార్, పల్లి వర్గాల అండను కూడా పొంది పాలెగాళ్ళతో బాటు ఆంగ్ల వ్యతిరేక పోరాటాన్ని సాగించారు.

*(మిగతాది 41వ పుటలో...)*

# కాంక్షా పరిమళం

అంతెత్తు
ఆకాశపు అగాధాల్లోకి
రివ్వున దూసుకుపోయిన
నిడుపాటి పొడుగాటి
కొండమల్లె చెట్టు
తన సన్నాయి కాడపూలను
అధోముఖంగా
నింగి నుండి నేలవైపు తలవాల్చింది ఎందుకు?

తన గమ్మత్తుమత్తు మోహ పరిమళంతో
చీకటి రాత్రులను
తేజోమయంగా వెలిగించే
నక్షత్ర పూల పారిజాతం
తెల్లారేసరికి తన పుష్ప సంతతిని
జలజలా నేలరాల్చుకుంది ఎందుకు?
ఎందుకా అని
ముక్కుపుటాలను
నేలకు ఆనించి వాసన చూద్దునుకదా
తలంటిన శిశువుకు
సన్ననిసెగమీద సాంబ్రాణి ధూపం వేసినట్టు
నేలనుండి కనబడని ఆవిరులు పైకెగజిమ్మినట్టు
ఇదీ అని చెప్పలేని వింత పరిమళం.

మట్టికంటే పేరుమోసిన సుగంధ ద్రవ్యం
ఈ భూప్రపంచంమీద లేదని తెలిసింది.
మూచ్చూడ్డం విశ్వాసంగల నాలుగు కాళ్ల జంతువులకే కాదు
అప్పుడప్పుడూ మనుషులకూ అవసరమే
లేకపోతే
పంటచేను గట్టు మీద
కాల్చిన కందికాయల కమ్మటి వాసన
కట్టచేపల గుండె కాయలను
చెక్కపూసల్లా వరసగా
కొబ్బరి ఈనె పుల్లగుచ్చి
పొయిలో కాల్చిన నిగారింపు వాసన
ఇంకా ఇంకా ఇలాంటి
అనేకానేక మనసుదోచే పరిమళాలు ఆస్వాదించాలంటే
ఒంటరివొర్టి ముక్కుతో కాక
శరీరసర్వం సహా వాసనలు పీల్చే

వాయులీన రాగం లాంటి
వాయు నాళం ఏదో
మర్రిచెట్టు తల్లి వేరులా
నీ లోలో విస్తరించి వుండాలికదా
ఒక అపరిచిత సురుచిర రుచిర సౌందర్యరాశి
కంటికొసలు నవ్విన నవ్వు నుండి
భూమి నుండి పైకొచ్చిన మొక్కలా
కొంగ్రొత్త జీవనోత్సాహ కాంక్షా పరిమళం
పొటమరించింది.

నేత్రాలు అరమోడ్చి
శ్వాస ఎగపీల్చి గుండెలనిండుగా ఆఘ్రానించగా

బిడ్డతుమ్మగానే తలమీద చెయ్యి పెట్టి
తల్లి చిరంజీవా! శతాయుష్మ అని దీవించినట్టు
బతుకు, పోరా! అని
నేను కూచున్న తమాలవృక్షం
రెండు పండుటాకులను
అక్షతలుగా నా శిరసుమీద రాల్చింది.
ఇదుగో
అప్పటి నిండి
యిలా...

- శిఖామణి
ఫోన్: 9848202526



# పద్మశాలి ఆశ్రిత కళారూపాల రహస్య భాష

- *బాసని సురేష్*

జానపద విజ్ఞానంలో ఆశ్రిత కళారూపాలకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆశ్రిత కళారూపాలు మౌఖికంగా తరతరాలుగా దాతృకులాన్ని కీర్తించటం లేదా ఆనందింప చేయటం వీని ప్రధాన వృత్తి. వీరినే ఆశ్రిత కులాలని, వృత్తిగాయకులని, భిక్షుక గాయకులని పిలుస్తున్నారు. జానపద కళారూపాల్లోని ఆయా ప్రక్రియలను అవలంభిస్తూ దాతృకులాన్ని ఆశ్రయిస్తూ జీవం పోసుకుంటున్నాయి. ఆశ్రిత కళారూపాలు లేదా ఆశ్రిత కులాల సాహిత్యం క్రీ.శ. 12వ శతాబ్దం నాటికే ఉందని చెప్పటం సుస్పష్టం. ఆశ్రిత కళారూపాలు ఆంధ్రదేశంలో 52కు పైగా ఉన్నాయి. ఒక్కొక దాతృకులానికి ఆశ్రిత కళారూపాలు ఒకటికి మించి ఉన్నాయి. పద్మశాలి కులానికి ఆశ్రిత కళారూపాలు రెండు ఉన్నాయి. ఒకటి సాధనా శూరులు, రెండు కూనపృవారు.

సాధనా శూరులు అంటే 'సాధనా' అనే పదానికి మల్ల విద్య అని, 'శూరుడు' అనే పదానికి ధైర్యం కలవాడు, బలం కలవాడు, పరాక్రమం కలవాడు అనే అర్థాలున్నాయి.

నిజానికి వీరి వంశం పుట్టుకకు సంబంధించిన మౌఖిక కథలో సాధనా శూరులు ధైర్యం కలవారు. ఎందుకంటే పద్మశాలి కులాన్ని రక్షించటంకోసం ధైర్యంతో సాహసం చేసి కృష్ణ గంధర్వుడు అనే రాజును సంహరించి సాధనా శూరులుగా కొలవబడ్డారు. ఆ రాజును సంహరించటానికి సాధనచేసి మంత్ర తంత్ర విద్యలు గొల్లకేతమ్మ దగ్గర నేర్చుకుంటారు. ఆ విద్యలనే ప్రయోగించి, కాళికామాతను ప్రసన్నం చేసుకొని రాజును సంహరిస్తారు. అప్పటినుండి పద్మశాలీలు కనుకట్టు విద్యలు ప్రదర్శిస్తూ ఆశ్రితులయ్యారు. వీరు ప్రదర్శనలో ఇంద్రజాలాంశాలను ఎంతో అద్భుతంగా ప్రదర్శించి దాతృకులమైన పద్మశాలి వారిని ఆనందింపచేస్తారు.

కూనపృవారు పద్మశాలికి సంబంధించిన మార్కండేయ పురాణాన్ని పటం ద్వారా చెపుతూ, పద్మశాలి వారిని ఆశ్రయిస్తారు. వీరినే పడిగ రాజులని, సమయంవారని, వరప్రసాదులని పిలుస్తారు. కూనపృ వారి పుట్టుకకు సంబంధించిన మౌఖిక కథలో మార్కండేయుని సంతతి పంచమాముని, భావనా ఋషి. ఇద్దరిలో భావనా ఋషి శ్రీ మహావిష్ణువు యొక్క ఆజ్ఞతో వస్త్ర నిర్మాణ విద్య చేపట్టి సకల మానవులకు, దేవతలకు వస్త్ర దానం చేస్తాడు. ఒక రోజున శివుని కోరిక తీర్చటానికి పులుల కోసం భావనా ఋషి వెళ్ళి భద్రావతి ఆధీనంలో ఉన్న పులులను తీసుకొని వస్తుండగా, కాలువాసురుడు అనే రాక్షసుడు ఎదురుపడి అతనితో యుద్ధం చేస్తాడు. ఆ యుద్ధంలో భావనా ఋషి అలసిపోయి తన చెమట నుండి పుట్టిన వారు నాకు యుద్ధంలో సహాయం చేయాలని కోరుతాడు. అప్పుడు తన శరీరంపై వచ్చిన చెమటను బండమీద వేయగా కొందరు పుడతారు. ఆ సమయంలో భావనా ఋషి దగ్గర నిండు గర్భంతో ఉన్న పులి ఉంటుంది. దాన్ని రక్షించమని 'కూన'గా చేసి అంటే చిన్నగా చేసి చెమటనుండి పుట్టిన వారికిస్తాడు. అప్పటి నుండి కూన పులిని రక్షించినవారు కాబట్టి 'కూన పులి'గా భావనా ఋషి నామకరణం చేస్తాడు.

సాధనా శూరులు, కూనపృవారు గ్రామాల్లో ప్రదర్శన నిమిత్తం వెళ్లినపుడు వీరికంటూ ఒక ప్రత్యేకమైన భాషను సృష్టించుకున్నారు. ఈ భాషను కళాకారుల్లో చిన్న పెద్ద అందరూ మాట్లాడుతారు. కాని, ఈ భాష ఇతరులు గుర్తు పట్టలేని విధంగా ఉంటుంది. ఎవరైనా వీరికి సంబంధించిన భాష గురించి అడిగినట్లైతే వారి సంఘం కట్టుబాటు ప్రకారం ఎవరికీ చెప్పకూడదని, ఈ భాష ఇతరులకు చెప్పినట్లైతే తమ ప్రదర్శనా నైపుణ్యం దెబ్బతింటుందని అంటారు.

బాసని సురేష్, ఫోన్ : 9989417299

ప్రదర్శనలో రహస్య భాష వ్యవహరించటం వల్ల బృందంలోని కళ, కళాకారులు ఎప్పటికప్పుడు ఒకరినొకరు హెచ్చరించుకుంటారు. అంటే ప్రదర్శనలో ఏదైనా తప్పు జరిగినా, సమయానికి సన్నివేశంలో అవసరమైన వస్తువు లేకపోయినా, గుర్తుచేయటానికి ఉపయోగపడుతుంది. అంతేగాకుండా ప్రదర్శనలో కథకుడు సన్నివేశాలను ఎదుటి కళాకారులకు గుర్తుచేయటానికి, కుల పెద్దల దగ్గర 'సంభాషణ' మాట్లాడేటప్పుడు, ఎగతాళి చేయటానికి, తట్టడానికి ఉపయోగిస్తారు. ఈ కళాకారులు ఉపయోగించే రహస్య భాషలో కొన్ని సంస్కృత పదాలే ఉన్నప్పటికీ వీరు ఉచ్ఛరించేటపుడు ఆ పదాల మూలాన్ని కాకుండా, ఒక క్రొత్త రూపంతో ఉచ్ఛరించటం జరుగుతుంది. కళాకారులు ప్రయోగించే రహస్యమైన భాషాపదాల్లో కులాలను సంబోధించే సమయంలో బీరం మంకలు-రెడ్లు, గొంటరిగాళ్లు-కోమట్లు, కడ్డి వంకలు-గ్లొండవారు, పోటంగాండ్లు-కంసాలి, కెందలోల్లు-చాకలివారు, ముంతుగాల్లో-కమ్మరివారు, జెల్లంగాడు-గొల్లోడు అని వ్యవహరిస్తారు. అట్లాగే స్త్రీ, పురుషలను, వస్తువులను ఈ క్రింది విధంగా సంబోధిస్తారు.

దారుకం-దారం; పచ్చ-పసుపు; పొల్లు-ఇటుకపొడి; పత్రులు, రాళ్లు; మిల్కుపెట్టే-అగ్గిపెట్టే; పుల్లేలు-కట్టెలు, పచ్చ కాగితం; పాండ్యాలు-నీళ్లు; సేమ-స్త్రీ; మంక్యాడ-పురుషుడు; సోర్-అన్నం; పచ్చ-తావిత్తు; మస్కాలు-విగ్రహాలు; మొకిరలు-పూపాలు; సోనో-ఇటురా; పత్రం-బండ; పొంత-పొయ్యి; నెవాలు-వెంట్రుకలు; తైరు-నూనె; నాసికం-ముక్కు; జైతం-కత్తి; పుంజి-గడియారం; కట్టె-మంచం; కాష్కం-దయ్యం; శిర్పగాళ్లు-పిల్లలు; వాయితు-పిల్లి; సాలిగాడు-సార; తెల్లరి-కల్లు; ఎర్రణ-బ్రాందీ; పాడ్యాలు-చెప్పులు; నైనాల్‌జేషుర-చూస్తాండు వెళ్ళుర; కడ్డిమంకడు-తాగుబోతు; మెంద్రం-గొర్రె, మీటం-సంభావన; కర్రోడు-శ్రీకృష్ణుడు; పీసులు-వెంట్రుకలు; గొరైంక-మగవారు; చిలుక-ఆడవారు; కేసిగాళ్ల పొరడు-పొడుగుజుట్టు కలిగినవాడు; మైలమతులు-స్త్రీలు; తెల్లోడు-సుద్ద; ఎర్రోడు-కుంకుమ; తోక,తేలు-మర్మాంగం మొదలైన పదాలను కళాకారులు ప్రదర్శనలు - అవసరమైనచోట సందర్భానుగుణంగా ఉపయోగిస్తారు.

పద్మశాలి ఆశ్రిత కళారూపాలు ప్రదర్శనలో తమ యొక్క ప్రదర్శనా నైపుణ్యానికి ఆటంకం కలిగినపుడు వారికి అవసరమైన సమయంలో రహస్య భాషను వ్యవహరిస్తారు. ఒకరకంగా ఇది వీరియొక్క ప్రత్యేకతను తెలుపుతుంది. తరతరాలుగా మౌఖికంగా ఒకతరం నుండి మరొక తరానికి సంక్రమిస్తూ వస్తున్న ఈ రహస్య భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. ఈ భాషను కళాకారులు మర్మంగానే ఉంచటంతో భాషా పదాలు మరుగున పడిపోయే అవకాశం ఉంది. ఇప్పటికే కళాకారులు రహస్యభాషకు సంబంధించిన పదాల వినిమయం తక్కువగా ప్రయోగించటం కనిపిస్తూ ఉంది. రహస్య భాషను ఇతర ఆశ్రిత కళారూపాలు కూడ ప్రయోగిస్తావనే మాట కూడా ఉంది. అయితే వాటిపై పరిశోధన చేయాల్సిన అవసరం ఉంది. ఒక జాతి సంస్కృతీ మూలాలు జానపద సాహిత్యంలోనే కనిపిస్తాయని పరిశోధనలు చేస్తున్న తరుణంలో ఆశ్రిత కళారూపాల రహస్య భాషపై కూడ విస్తృతమైన పరిశోధనలు చేసి వారి సాహిత్యాన్ని, వారి నైపుణ్యాన్ని భావితరాల వారికి అందించాల్సిన అవసరం ఉంది. తద్వారా ఆశ్రిత కళారూపాల ప్రాముఖ్యత, గొప్పదని తెలుస్తుంది. మి

## ఓదార్పు...

**ము**ద్దుకృష్ణగారి 'జ్వాల' పత్రికలో ఒక వర్ధమాన కవిగారిని ఘాటుగా విమర్శిస్తూ వ్యాసం వెలువడింది. ఖిన్నుడైపోయిన కవిగారు ఆవేశంగా ముద్దుకృష్ణ గారి దగ్గరకి వెళ్ళి, ఇలాంటివి ప్రచురించడం భావ్యం కాదని 'జ్వాల' మీద మండిపడ్డాడు. అందుకు ముద్దుకృష్ణ నవ్వుతూ "చూడండి కవిగారూ! పత్రిక కొనేవారిలో సగం మంది ఆ వ్యాసాన్ని చూడరు. చూచినవారిలో సగంమంది చదవరు. చదివిన వారిలో సగం మందికి అర్థం కాదు. అర్థం అయిన వారిలో సగం మందికి తమరెవరో తెలియదు. తెలిసినవారిలో సగంమంది నమ్మరు. నమ్మినవారిలో సగంమందిని మనం ఖాతరు చెయ్యాల్సిన పనిలేదు. ఇకపోతే మిగిలేది ఆ సగం మంది కనుక మీరు ఖాయలా పడకండి" అని ఓదార్చి పంపారు.

# దాసి సుదర్శన్

- ఎన్నార్కే



ఆరడుగుల పొడవు, దృఢమైన శరీరం, గిరజాల జుట్టు, చక్కటి ముఖాన్ని, ఇంత పెద్ద ఆకృతిని చిన్నబరుస్తూ వివేకం, వినయం ఉట్టిపడేలా స్నేహ పూర్వకమైన పలకరింత–ఇవన్నీ మనల్ని అతనికి మరింత దగ్గర చేస్తాయి. అతని పేరు సుదర్శన్. 'దాసి సుదర్శన్'గా ప్రసిద్ధుడు.

"దాసి" అతని ఇంటిపేరు కాదు. కళ కోసమే సినిమాలు తీసే బి. నరసింగరావు నిర్మాణ దర్శకత్వంలో వచ్చిన సినీ కళాఖండం 'దాసి'. ఈ చిత్రానికి సుదర్శన్ కాస్ట్యూమ్స్ డిజైన్ చేశాడు. దాసి చిత్రకథ నిజాంకాలం నాటిది. ఆనాటి జీవన పరిస్థితులు, సామాజిక అవగాహనతో కాస్ట్యూమ్ డిజైనర్‌గా తన కిచ్చిన పనిని సక్రమంగా నిర్వహించారు సుదర్శన్. అందుకే "ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్" గా జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్నాడు. అదొక ఆషామాషీ అవార్డుకాదు. సుదర్శన్‌కు ముందు ఏడు సంవత్సరాల వరకూ ఆ అవార్డ్ ఎవరికీ లభించ లేదు. ఈ విభాగంలో జాతీయస్థాయిలో అవార్డు నందుకొన్న మొదటి తెలుగువాడు కూడా ఇతనే. అప్పటి నుంచీ అతని పేరులో దాసి కలిసిపోయి దాసి సుదర్శన్ అయ్యాడు. *మావూరు, మట్టి మనుషులు, హరివిల్లు* లాంటి చిత్రాలకతను అసోసియేట్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశాడు. 1984లో వచ్చిన 'ఈ చరిత్ర చెరిపేద్దాం' లఘు చిత్రానికి (నంది అవార్డు విజేత) ఆర్ట్ డైరెక్టర్‌గా పేని చేశాడు.



వేషంలో...

అతడొక మంచి పాఠకుడు. గురజాడ రా.వి.శాస్త్రి, శ్రీశ్రీ, కాళోజి, కాళీపట్నం, కొడవగంటి, బాల గంగాధర్ తిలక్, రచనలంటే చాలా ఇష్టం. తెలుగు క్లాసికల్ సాహిత్యం పట్ల ఆసక్తి, అనురక్తి. దానికోసమే సాహిత్య సమాలోచనమనే చక్కని లైబ్రరీని నల్గొండలో స్థాపించారు. మంచి సాహిత్యాన్ని అందరికీ పంచి, అందరూ మెచ్చేలా చేసిన ప్రయత్నమిది. అతని కళా తపన అంతటితో ఆగలేదు. తనకు నచ్చిన సాహితీ మూర్తుల మూర్తి చిత్రాలను వేసి ఊరూర ప్రదర్శింప చేశాడు. అందులో అతను వేసిన 'చలం' చిత్రం ఎంతో పాపులర్, చలంపై వచ్చిన వ్యాసాల సంపుటికది ముఖచిత్రంగా శోభిల్లింది. చిత్రకళ అతని స్వార్జితం, తనంత తానుగా నేర్చుకుని తనకు తానే గురువై మెరుగులు దిద్దుకున్న నైపుణ్యం, అందులోని ప్రతిగీతలోనూ కనిపిస్తుంది. ఇతని చిత్రకళ రూప, నైరూప్య, ప్రయోగాత్మక చిత్రకళగా మూడు రూపాలలో దర్శనమిస్తుంది. మిర్యాలగూడలో ఒక సినిమా హాలు ఉంది, పేరు శ్రీనివాస్ టాకీస్. అందులో బాల్కనీలోకి వెళ్ళే మెట్ల మలుపులో నిలువెత్తు 'రాధాకృష్ణులు' మరో మలుపులో 'ఉమర్‌ఖయ్యాం మధుసేవ' అనే ఈ రెండు పెయింటింగ్‌లు వేసి సుదర్శన్ సినిమాహాలు లాంటి వినోదస్థలాన్ని సహితం కళాకేంద్రంగా మార్చాడు. పెయింటింగ్‌కు తోబుట్టువు

ఫోటోగ్రఫీ ఇందులోనూ అతనికి ప్రవేశమేకాదు ప్రతిభ కూడా ఉంది. నల్గొండలో జరిగే ప్రతీ సాహితీ సభకు అతనొక కంపల్సరీ ఫోటోగ్రాఫరు.

చిత్రకళపై నున్న ఆసక్తి అంతటితో ఆగలేదు. చిత్రకళ, సాహిత్యాలపై కుంచెలు-కలాలు అనే పేరుతో ఒక మంచి పుస్తకం వ్రాశాడు. ఇందులో రా.వి.శాస్త్రి, కాళోజీ లాంటి సాహిత్య ప్రముఖులతో బాటుగా ఎస్.వి.రామారావు, కొండుపర్తి లాంటి చిత్రకారుల ఇంటర్వ్యూలు, పరిచయాలు ఉన్నాయి. ఈ వ్యాస సంపుటిలోని వ్యాసాలు విస్తృతి పరంగా చిన్నవిగా వున్నా, విషయపరంగా పెద్దవి. కళాకారునిలోని సూక్ష్మ విషయాలను సహితం సమగ్రంగా చెప్పగలిగాడు. అలానే రచయితలతో సాగించిన ముఖాముఖీలో వారి అంతరంగ భావాలను స్పష్టంగా బయటకు రావించటంలో ఒక రచయితగా తులనాత్మక ప్రశ్నలను సంధించారు. ఇదే పుస్తకంలో దీనికి రెండవ భాగంగా వచ్చిన 'నట్టనడుమ నల్లగొండ' అన్న సుదీర్ఘ వ్యాసాల సంపుటిలో సాహిత్య, నాటక, చిత్రకళ, చలన చిత్ర రంగాలలో నల్గొండ జిల్లాలోని రచయితలు, కళాకారుల సేవలపై విహంగ వీక్షణం చేశారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఛబ్బీస్ జనవరిలో జరిగే రిపబ్లిక్ పండుగ సందర్భాలలో ఎన్నోసార్లతను విద్యాశాఖకు శకటాలను తయారుచేయించి తానొక శిల్పినని కూడా నిరూపించుకున్నాడు. ఒకసారి బహుమతి కూడా అందుకున్నాడు.


సుదర్శన్ పక్కా పల్లెటూరివాసి పిట్టంపల్లి మట్టయ్య, లక్ష్మమ్మ దపంతులకు 1952వ సం॥లో ద్వితీయ సంతానంగా జన్మించాడు. అక్షరాలు అంటే ఏమిటో తెలియని కుటుంబం నుంచి వచ్చినా తండ్రి నాటక రంగంలో మంచిపేరు తెచ్చు కోవటంతో పాటు, చిత్రకళ, సంగీతంపై ఆసక్తి కలవాడు కూడా. సుదర్శన్‌లోని కళాభినివేశానికి మూల కారకులు వారి తండ్రిగారే. బాల్యపు విద్యార్థి దశలో చిత్రకళలో ప్రథమస్థానంలో ఉంటూ వచ్చారు. కొంతకాలం బ్యానర్ వర్క్ చేసి అందులోని మెళుకువలు గ్రహించారు. బాపూకు ఏకలవ్య శిష్యరికం చేశారు. హుస్సేన్, వైకుంఠం అభిమాన చిత్రకారులు, పికాసోలోని మానవతా కోణం అతని కిష్టం.

ఎన్.సి.ఇ.ఆర్. నేతృత్వంలో, 1991లో ఒకటి నుండి పదవ తరగతి వరకూ సిలబస్ కమిటీలో సభ్యులుగా ఉండి డ్రాయింగ్ సిలబస్‌ను రూపొందించారు. 2000 సం॥లో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఉత్తమ చలన చిత్రాలకు సంబంధించిన నంది అవార్డుల కమిటీలో ఒక న్యాయ నిర్ణేతగా నియమించింది. 2005 సం॥ కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో ఉత్తమ చలన చిత్రాలకు అందజేసే అవార్డుల కమిటి జ్యూరీ సభ్యునిగా నియమించింది.

వీటన్నిటినీ మించి రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం అందుకున్నారు. మొదట్లో నల్గొండలో బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేశారు. ఆ తరువాత నాగార్జున సాగర్‌కు బదిలీ చేయబడ్డారు. అక్కడ సాహిత్య, సాంస్కృతిక కళావికాసాలకు ప్రధాన కారణభూతుడై నాగార్జున సాగర్‌ను ఒక కళాసాగర్‌గా మార్చారు.

కొన్ని నాటకాలలో నటించారు. కొన్నిటికి ప్రయోక్తగా వ్యవహరించారు. సుదర్శన్ మంచి గాయకుడు కూడా. 'జయహో' బాచ్‌లో ముఖ్యసభ్యులు. ఇన్ని కళలో ప్రవేశం, ప్రతిభ వున్న సుదర్శన్ వాటినెప్పుడు వ్యాపారాత్మకం చేసుకోలేదు. వాటిని సత్‌సంబంధాలకు, సమాజశ్రేయస్సుకు వినియోగించు కోవాలనుకున్నాడు. సాహిత్యం, కళలను 'సు-దర్శనం' చేశాడు. ప్రజలకోసమే కళలు-ప్రజల నుంచే కళలు అని నమ్మే వ్యక్తి అందరివాడైన దాసి సుదర్శన్.

2009వ సం॥నుంచీ అతనొక విశ్రాంత ఉపాధ్యాయుడు, అయినా కళల నుంచి, గురుత్వం నుంచి మాత్రం విశ్రాంతి తీసుకోలేదు. అది అనంతంగా ఇంకా కొన సాగుతూనే ఉంది.



ఈ నెల ముఖచిత్రం, నాలుగో అట్టపై చిత్రం సుదర్శన్ వేసిన 'ప్రకృతి-స్త్రీ' పరంపరలోనివి!




# మాక్సిమ్ గోర్కీ
## అమ్మ - కథ

*ఈ మధ్యన పెళ్ళిళ్లలో అతిథులకు, సాయి చరిత్ర, విష్ణు సహస్ర నామాలు, లక్ష్మి సహస్రనామాలు, హనుమాన్ చాలీసా పుస్తకాలు పంచిపెడుతున్నారు. ఆ మధ్య ఒక పెళ్ళిలో 'అమ్మ' పుస్తకం పంచిపెట్టారు. అప్పుడు 'అమ్మ' కథకోసం వెదికాము. అదే ఈ కథ.*

జీవితంలో చేదునిజాలను మాత్రమే ఆవిష్కరిస్తాననటానికి సంకేతంగానేమో మాక్సిమ్‌గోర్కీ (1868–1936) (గోర్కీ అంటే రష్యన్‌లో 'చేదు') అనే కలం పేరుతో రచనలు చేశాడు అలెక్సేయ్ మక్సీ మొవిచ్ పేష్కొవ్. పుట్టింది నిజ్నీ నొవ్‌గొరాడ్ లోని ఓ నిరుపేద కుటుంబంలో. మూడో ఏటనే కలరా సోకింది. అప్పుడే అదే జబ్బుతో తండ్రి పోయాడు. తల్లి పుట్టింటికి చేరడంతో మాతామహుల యింటనే అక్షరాభ్యాసం చేశాడు. తాతచెప్పిన కథలు విన్నప్పుడు కథల మీద ఆసక్తి కలిగింది. ఆ తర్వాత రెండేళ్ళు బడికెళ్ళాడు గాని, మశూచి సోకి మానేశాడు. పదేళ్ళప్పుడు హాన్స్ అండర్సన్ ఫెయిరీ టేల్స్ చదివి స్వప్న లోకాల్లో విహరించాడు. తల్లి మరో పెళ్ళి చేసుకుంది. ఒకనాడు పెంపుడు తండ్రి తల్లిని కొట్టటం చూసి సహించలేక, అతడితో పోట్లాడి తాత వద్దకు పారిపోయాడు. మరో ఏడాదికి తల్లి మరణించింది. చెప్పుల దుకాణంలో కొన్నాళ్ళు, మెసెంజర్ బాయ్‌గా, బేకరిలో కొన్నాళ్ళు పనిచేసి, చివరికి పాసెంజర్ షిప్‌లో చేరాడు. అక్కడ గొగోల్ కథలూ, హెన్రీ ఫీల్డింగ్ 'టామ్‌జోన్స్' చదివి సాహిత్యాభిరుచి పెంచుకున్నాడు.

తరచూ మారే ఉద్యోగాలతో తిండికిలేని దుస్థితి. తాత కూడా మరణించాడు. జీవితంపై విరక్తితో పిస్తోలు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆపరేషన్ చేసి బులెట్ తీశాక జీవిత దృక్పథం మారింది. రెండేళ్ళపాటు కాలినడకన రష్యామొత్తం పర్యటించి, పేదల స్థితిగతులను అధ్యయనం చేశాడు. 'ఎమ్ గోర్కీ' పేరుతో అచ్చయినది ఆయన తొలి కథ 'మకర్ చుద్రా' (1892). మధ్య తరగతి పతనాన్ని చిత్రించిన 'ఫోమా గార్డెయేవ్' 1899లో సీరియల్‌గా అచ్చయింది. చెల్కాష్, ఒక శిశిరపురాత్రి, ఇజర్‌గిల్ వృద్ధురాలు ఈ దశలో రాసిన ముఖ్య కథలు. తర్వాత రాసిన నాటకం లోయర్ డెప్త్ (1902). మరుసటి ఏడాదే సోషల్ డెమోక్రటిక్ పార్టీతో సంబంధాలు మొదలయ్యాయి. 1905లో తొలివిప్లవం విఫలమయ్యాక బోల్షివిక్కులను సమర్థించినందుకు నిర్బంధం తప్పలేదు. విడుదల తర్వాత పార్టీ సభ్యత్వం తీసుకున్నాడు. గోర్కీ ఆత్మకథ 'బాల్యం, మై అప్రెంటిస్ షిప్, మై యూనివర్సిటీస్', నవలలు 'లైఫ్ ఆఫ్ మాట్వెమ్ కోజెమ్యాకిన్', తదితరాలు ప్రపంచ ప్రసిద్ధాలు. లెనిన్ స్టాలిన్‌లకు సన్నిహితుడు గోర్కీ. తుదిదశలో పశ్చిమదేశాల వాళ్ళు అతనిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినా అవేవీ ఆయన రచనల సార్వజనీనతను తగ్గించలేదు.

### గోర్కీ గురించి మరికొంత...

నిజ్నీ నొవ్‌గొరాడ్ సమీపానవున్న సార్మొవోలో 1902 లో జరిగిన మేడే ప్రదర్శన, పోలీసు నిర్బంధకాండ, విప్లవ చైతన్యంతో కొనసాగిన కార్మికులు, కర్షకుల రహస్య కార్యకలాపాలు 'అమ్మ' నవలకు నేపథ్యం. 1904లోనే గోర్కీ దీనికి 'నోట్స్' తయారు చేసుకున్నాడు. బోల్షివిక్కులకు

అనుకూలంగా ప్రజాభిప్రాయాన్ని సాధించడానికి, ధనసహాయం అర్థించటానికి గోర్కీ 1906 ఏప్రిల్ 10న లెనిన్ సలహా మేరకు అమెరికాలో కాలుమోపాడు. అప్పటికే రచయితగా పేరున్న గోర్కీని ఆహ్వానించేందుకు మార్క్‌ట్వేన్ ఆధ్వర్యంలో ఆహ్వాన సంఘం ఏర్పడింది. దేశ అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ స్వాగత సన్నాహాలు చేశాడు. న్యూయార్క్ హొటల్‌లో బస ఏర్పాటు చేశారు. ఎన్నో నగరాల్లో గోర్కీ ఉపన్యాసాలు ఏర్పాటు చేశారు.

కాని ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమానికి, అందులోని సభ్యునికి ఇంత ప్రచారం, గౌరవం లభించటం జార్ చక్రవర్తి ప్రభుత్వం జీర్ణించుకోలేక పోయింది. సహించ లేకపోయింది. జార్ చక్రవర్తి ప్రభుత్వ న్యూయార్క్ ప్రతినిధి చేయవలసినదంతా చేశాడు. 'గోర్కీతో వచ్చినది ఆయన భార్యకాదు–ఎవరో రంగస్థల నటి', అని పత్రికలకు వార్త అందించాడు–గోర్కీ దిగిన మర్నాడే అది న్యూయార్క్ పత్రికల్లో అచ్చయింది. అంతే ఆహ్వాన సంఘానికి మార్క్‌ట్వేన్ రాజీనామా చేసినట్లు ప్రకటించాడు. ఆహ్వాన సంఘం రద్దయింది. అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ అధికార స్వాగతం కూడా రద్దు చేసినట్లు తెలిపాడు. హొటల్ గది ఖాళీ చేయించారు.

ఇంకేముంది గోర్కీ రోడ్డున పడ్డాడు. తెలిసినవారు, తెలీనివారు ఎవ్వరూ కనపడలేదు. అతని గురించిన వార్తే ప్రచురించటం ఆగిపోయింది. ఈ విధంగా ఆరునెలలు అజ్ఞాతంగా ఉండి పోయాడు. ఆకలికి మాడి పోయాడు. మెల్లగా ఒకరిద్దరు స్నేహితులు సహాయంతో 'ఆడి రాండాక్' పర్వత సానువుల్లో ఒక చిన్న ఇంటిని సుత్తి, మేకులతో కట్టుకుని ఆ గూటిలో చేరాడు – తన పరిస్థితిని అంచనావేసుకుని మెల్లిగా ఉపన్యాసాలు ఇవ్వడం మొదలుపెట్టాడు. ప్రజలు తమ హడావుడి జీవితంతో ఇతర విషయాలు త్వరగా మర్చిపోతారు కదా!

అలా కుదురుకుని – 'అమ్మ'ను రూపు దిద్దాడు. మొదటి భాగం అమెరికాలోనే పూర్తి చేశాడు. ఒకరకమైన నిరాశతో అమెరికానుంచి బైటపడి ఇటలీ చేరాడు. అక్కడ రెండో భాగం పూర్తి చేశాడు.



మాక్సిమ్ గోర్కీ (1868–1936)

'అమ్మ' రష్యన్ భాష నుంచి ఆంగ్ల అనువాదం (Mother) న్యూయార్క్ 'ఆపిల్‌టన్' పత్రిక సీరియల్‌గా వేసింది (1906–1907). తర్వాత 1907 లోనే పుస్తకంగా వచ్చింది.

బ్రిటిష్ ప్రచురణకర్తలు దీని పేరు మార్చి 'కామ్రేడ్స్'గా విడుదల చేశారు ('అమ్మ' ఆధారంగా తీసిన వుడోవ్‌కిన్ సినిమా, బెర్టోల్డ్‌బ్రెక్ నాటకం కూడా ప్రాచుర్యం పొందిన కళాఖండాలే).

'అమ్మ' రష్యా చేరటానికి చాలాకాలం పట్టింది. రష్యన్ విప్లవం తర్వాతే అది పాఠకులకు చేరింది రష్యాలో –

తర్వాత కథ – కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత – 'అమ్మ' పుస్తకాన్ని లెనిన్ సలహా మేరకు ప్రభుత్వం తరఫున లక్షల కాపీలు ముద్రించి పంచి పెట్టారు. దీనితో ఆలస్యంగా కమ్యూనిస్టులైనవారు 'అమ్మ' ద్వారానే విప్లవం వచ్చిందనే భ్రమలో పడిపోయారు.

**అమెరికా గురించి గోర్కీ**

"నువ్వు అమెరికాను అసహ్యించుకుంటావా?" అన్న ప్రశ్నకు "ప్రపంచ ప్రజలను అమెరికా ఎలా అణచివేస్తున్నదో, దోచుకుంటున్నదో అందరికీ తెలుసు; అంతమాత్రాన ఒక దేశంగా అమెరికాను అసహ్యించుకోరెవరూ. అక్కడి కార్మికుల్నీ, బిలియనీర్లనీ కూడా సమానంగా ద్వేషిస్తాను, తెల్లవాళ్లనూ, నల్లవాళ్లనూ, స్త్రీలనూ, పిల్లల్నీ, నదీనదాల్నీ, అడవుల్నీ, ఉద్యానవనాల్నీ, పశుపక్ష్యాదుల్నీ, టెక్నాలజీని, శాస్త్ర ప్రగతినీ, ఎడిసన్‌నూ, ఎడ్గర్ అలెన్ పోనూ, వాల్ట్ విట్‌మాన్‌నూ, జార్జి వాషింగ్‌టన్‌నూ, అబ్రహం లింకన్‌నూ, థియోడర్ డ్రీజర్‌నూ, యూజీనీఒనీల్, షెర్‌వుడ్ అండర్‌సన్‌నూ, సాహితీవేత్తల్నీ, బ్రెట్‌హార్ట్‌నూ, జాక్‌లండన్‌నూ, తొరోనూ, ఎమరసన్‌నూ అక్కడి తరతరాల జనాభా నంతటినీ నిర్ద్వంద్వంగా ద్వేషిస్తాను – అనేంతటి మూర్ఖుడెవరూ ఉండడు. అలాగే అక్కడి దోపిడీ వ్యవస్థను, శాకో, వాంజెట్టీ లాంటి నిరపరాధుల హత్యను, కూక్లక్స్ క్లాన్ లాంటి మతఛాందస తీవ్రవాద సంస్థల్ని, నీగ్రోలను జంతువులకన్నా హీనంగా చూడటాన్ని అసహ్యించుకోని వాళ్లు, ఖండించని వాళ్లు కూడా వుండరు" గోర్కీ జవాబది.

**...మిగతాది 58-59వ పుటలలో**



# ఫిడేల్ రాగాల పట్టాభి

**- నందన**

పుట్టి కళ్ళు తెరిచాక నేను చూసిన మొదటి వ్యక్తి మా నాన్న. అప్పుడాయన వయసు 33. మంచి అందగాడు. మృదుస్వభావి. ఆయన నా జీవిత దిగంతాలమీద వెలిగిన వెచ్చని వెలుగు. ఆయనది అవ్యాజమైన ప్రేమ. ప్రశాంతతకు, సంతృప్తికి వాగ్దానం. ఆయనతో నాది 54 ఏళ్ళ అనుబంధం. నా జీవితంలో అతిదగ్గరి సుదీర్ఘ అనుబంధం అది. అది మేధో సంబంధమైనదేకాక, భావసంబంధమూ, రాజకీయ సంబంధమూ కూడా. ఆయన నన్ను ఉత్తేజపరిచారు, మార్గదర్శనం చేశారు, పంచుకున్నారు, సౌఖ్యాన్నిచ్చారు, నా జీవితపు నిమ్నోన్నతాలను చూశారు, నన్ను తీర్చిదిద్దారు.

అందుకే పట్టాభిని కేవలం ఒక తండ్రిగా వివరించడం సాధ్యం కాదు. అంతకన్నా ఎంతో ఎక్కువ. ముఖ్యంగా ఆయన మా నిజమైన స్నేహితుడు. ఇబ్బందికరమైన రహస్యాలు, మాలోని లోపలి భయాలు, భావాలు, అనుభూతులు ఆయనతో చెప్పుకునే వాళ్ళం. ఆయన మా భయాల దయ్యాల్ని తోలేశారు. మాకు ఖగోళశాస్త్రం, చరిత్ర, గణితం, కవిత్వం, హాస్యం మొదలైన వాటికి మనోద్వారాలు తెరిచారు. ఆయన మా జీవితాల్లోకి ఇంద్రజాలాన్నీ, సాహసాన్నీ తీసుకొచ్చారు.

మా బాల్యజీవితం ప్రశాంతంగా గడవలేదు. డబ్బు లేదు. జీవితం గడవడం కష్టంగా వుండేది. వ్యాపారంలో మా నాన్న పరిశోధనలు, ఆయన మృదుస్వభావం, అందర్నీ నమ్మేగుణం వల్ల ఎంతో పోగొట్టుకున్నారు. అయినా మేమెప్పుడూ అభద్రతకు లోనుకాలేదు. రోజువారీ చిన్న చిన్న విషయాలను కూడా ఆనందమయం చేసుకునేవాళ్ళం. హఠాత్తుగా వసూలైన ఓ బాకీ డబ్బుతో మెరీనా బీచ్‌లో మద్రాసు బిలాల్ బిర్యానీతో పిక్‌నిక్ చేసుకునే వాళ్ళం, లేదా జింఖానా క్లబ్బులో ఓ రోజు గడిపేవాళ్ళం. వారంచివర్లో పాతన్యూస్‌పేపర్లమ్మి డ్రైవ్‌ఇన్ వుడ్ లాండ్స్‌నించి తెచ్చుకున్న మసాలాదోసెల్ని ఎంజాయ్ చేసేవాళ్ళం.

డబ్బులవసరంలేనివి ఎన్నో వున్నాయి. వేసవిలో నిర్మలాకాశపు చీకటి రాత్రుల నక్షత్రాలు, పడుకునేముందు తెనాలి రామలింగడి కథలు, అపురూపమైన గ్రహణాలు, పురాణగాథలు, అమ్మానాన్నల సాహసకృత్యాలు అలాంటివి.

'ఆయనలాగా ప్రశాంతంగా వుండే మనిషిని నెనెక్కడా చూడలేదు.' *అని లోహియా వ్రాశారు.* ఆయన బాహువుల మధ్య ఒళ్ళో కూచుంటే ఇంక మనకే ప్రమాదమూ లేదనిపించేది. ఎప్పుడన్నా కోపం తెప్పించేవాడు. ఎవర్నీ విమర్శించేవాడు కాదు. ప్రశ్నించేవారు, వాటికి మేం సమాధానాలు వెతుక్కోవాలి. ఒక్కోసారి తప్పు తరపున వకాల్తా తీసుకున్నట్టు మాట్లాడి, కోపం తెప్పించేవాడు. తెరిచిన మనసుతో చివరి కంటా సత్యాన్వేషణ చేశాడు.

ఆయనలో గొప్ప హాస్యప్రియత్వం, నవ్వేగుణం, తనను చూసి తాను నవ్వుకునే స్వభావం వున్నాయి. అందుకే ఆయన జీవితపు ప్రతిక్షణాన్నీ ఆనందించారు. ఆయన్ని మేం 'మిస్టర్ రెడ్డి' అని పిలిచేవాళ్ళం. ఆయన జీవనవిధానం ముఖ్యంగా, మూడు విషయాలమీద నడిచింది. అందులో మొదటిది

---

తెలుగు : బి.వి. రామిరెడ్డి, ఫోన్ : 9908856530

జిజ్ఞాస. ఆయన ప్రతి విషయాన్నీ కూలంకషంగా తెలుసుకునేందుకు ప్రయత్నించేవారు. ఆ విధానం ఆయనకు గణితశాస్త్రజ్ఞుడి కొచ్చిన ఆనందాన్నిచ్చేది.

డొంకతిరుగుడు ప్రయాణం ఆయనకిష్టం. అందువల్ల మద్రాసునించి బెంగుళూరుకు 12 గంటలు, పాండిచ్చేరినించి తిరువణ్ణామలైకి 10 గంటలు పట్టేది. ఏ రోడ్డున పోదాం? – అని మమ్మల్ని అడిగేవారు. మేం ఎటుచెబితే అటునించే ప్రయాణం సాగేది. దారిలో అందమైన చిన్నగ్రామాలు, మార్గమధ్యంలో పెద్ద చెట్టు నీడ క్రింద చేరి 'ఉప్పితు' ఒండుకునే వాళ్ళం. జంపఖానాలుపరిచి కునుకుతీసే వాళ్ళం. చింతకాయ లేరుకుని పళ్ళుపులిసేదాకా చీకే వాళ్ళం.

ప్రయాణంలోనేకాదు, జీవితంలోనూ–తాత్త్విక విషయాల్లో, రాజకీయ విషయాల్లో, భావావేశాల్లో – అన్నిటిలోనూ అదేపద్ధతి. ప్రేమ సాఫల్యత లోను ఆయన ఇదే విధానాన్నవలంబించారు. సుదూర ప్రయాణం ఎన్నో కొత్త దారుల్ని, విషయాలను ఆవిష్కరిస్తుంది; దగ్గరి పాతదారి విసుగేస్తుంది – అనేవారు.

మూడోది పాత సాంప్రదాయాన్ని ఛేదించడం, "పాత పద్ధతిలో ఆలోచించడం వల్ల సాంప్రదాయం ఏర్పడుతుంది, క్రొత్త తరహా ఆలోచనావిధానం క్రొత్త విషయాలను ఆవిష్కరిస్తుంది" అనే వారు. ఆయన తిరుగులేని సాంప్రదాయ వ్యతిరేకి. పంథొమ్మిదేళ్ళ వయసులో సాహితీ సాంప్రదాయాల్ని ఛేదించి, తెలుగులో ఆధునిక కవిత్వాన్ని రచించి తన మాతృభాషలో ఆధునిక తెలుగు కవితా పితామహుడిగా ఎన్నబడ్డారు. అరవయ్యేళ్ళ క్రితం తెలుగు కవిత్వం చారిత్రక మలుపులో వున్నప్పుడు పఠాభి "ఫిడేలు రాగాల డజన్" ప్రచురించబడింది. 1930లో శ్రీశ్రీ తెలుగు కవిత్వానికి క్రొత్త దిశానిర్దేశంచేశాడు. అయినా తెలుగు కవిత్వం ఛందో బంధాలను పూర్తిగా తెంచుకోలేదు. పఠాభి తెలుగు కవిత్వాన్ని ప్రయోగాత్మక వ్యక్తీకరణ వేపు నడిపించాడు. వచన కవితతో ప్రయోగం చేసిన మొదటికవి పఠాభి.



స్నేహలత

ఆయన సాంప్రదాయానికి ఎదురు తిరిగాడు. మా అమ్మతో ప్రేమలో పడ్డాడు. క్రైస్తవురాలైన అమ్మను వివాహం చేసుకున్నాడు. తండ్రిచేత బహిష్కరింపబడ్డాడు. ఆయన నిర్మించిన చలనచిత్రాలూ క్రొత్త దారిలోనే నడిచాయి. "సంస్కార" సినిమాని చేతి కెమెరాతో, డాక్యుమెంటరీ విధానంలో తీసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో 'టామీ కొలానీ' అనే ఇండియాలో పర్యటిస్తున్న ఆస్ట్రేలియన్ని కెమేరామన్‌గా తీసుకున్నాడు. "చండమారుత" 16 ఎమ్.ఎమ్.లు చేసిన ప్రయోగం. "శృంగారమాస" కేవలం రెండుపాత్రలే వున్న ప్రేమకథ.

"జీవితం పాఠం కాదు, అనుభవ పరంపర. ప్రతి అనుభవమూ ప్రత్యేకమైనదే. అనేకానేక ఆహ్వానాల ఆనందహేల. మనం హృదయంతో తెలుసుకునేదే జీవితం. మనం ఏవైనా పాఠాలు నేర్చుకుంటే అవి బట్టతలలొచ్చాక దువ్వెన సంపాయించడం లాంటిది. జీవితపు క్రికెట్ ఆటలో రెండు ఇన్నింగ్స్ వుంటాయి. జీవితం నేర్పే పాఠాలు రెండో ఇన్నింగ్స్‌లో ఉపయోగ పడతాయి. అయితే దురదృష్టవశాత్తు, అది అలా లేదు.

నా భర్త 'హరి' ముందు మా నాన్నతోనూ ఆ తరువాతనే నాతోను ప్రేమలో పడ్డాడంటే ఆశ్చర్యం లేదు.

"మనిషి సాధించవలసినవి రెండే. ఒకటి దేవుడు, రెండు స్త్రీ. ఈ రెండు అన్వేషణలనించే శాస్త్రాలు, కళలు, తాత్త్వికతలు రూపుదిద్దుకున్నాయి" అని డా॥ రామ్‌మనోహర్ లోహియా వ్రాశారు. లోహియా మార్వాడి కుటుంబానికి చెందినా, ఆయన ధనాన్వేషణను నిరసించడం ఆశ్చర్యమనిపిస్తుంది.

"నేను కవిత్వాన్ని, సినిమాని, గణితాన్ని, డబ్బుని, ప్రేమని అన్వేషించాను. ప్రేమ విషయంలో నేను అత్యున్నత విజయం సాధించాను. అయితే ఆ అన్వేషణ ఎన్నో కఠిన శ్రమలతో కూడినది. దానికోసం కుటుంబాన్ని, మతాన్ని, కులాన్ని అధిగమించవలసి వచ్చింది. అదృష్టంవల్ల అత్యంత సౌందర్యవతి అయిన గొప్ప స్త్రీని భార్యగా పొందగలిగాను" అని మా నాన్నగారు వ్రాశారు.

మా అమ్మను పఠాభి అనుసరించిన విధానంలో ఒక బాలీవుడ్ సినిమాలో వుండే అన్ని మసాలాలున్నాయి. ఆయన అత్యంత సౌందర్యవతియైన స్నేహలతను ఒక డాన్స్ ప్రోగ్రాంలో చూశాడు. ఆమె అభిమాని ఒకరు ఆయన్ని ఆ కార్యక్రమానికి తీసుకు పోయారు. ఆయనది "లవ్ ఎట్ ఫస్ట్‌సైట్!" ఆమెని పెళ్లి చేసుకునేదాకా గడ్డం గీసుకోననీ, క్రాపు చేయించుకోననీ ప్రతినపూనాడు. ఆమెను తనకు పరిచయం చెయ్యమని వేడుకున్నాడు. అలా ఆమెతో ప్రేమాయణం ప్రారంభించాడు. మా అమ్మ అప్పుడు క్వీను మెరీస్ కళాశాలలో చదువుతుండేది. ఆమె మేధావి, కళాత్మకుడు, జ్ఞానవంతుడు, అందగాడు అయిన ఆయన ఆకర్షణకు లోనయింది. తామిద్దరు సరిజోడి అని గ్రహించు కున్నారు. ఇద్దరి కుటుంబాలూ వ్యతిరేకించాయి. కొద్దిమంది స్నేహితుల సమక్షంలో ఆర్యసమాజ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. మా అమ్మ చిన్నతమ్ముడు మారిస్ సాక్షి సంతకం చేశాడు.

ఈ విషయాన్ని చెప్పడానికి మా నాన్న, వాళ్ళ నాన్న గారి దగ్గరికి నెల్లూరు వెళ్ళాడు. ఇల్లు శోకసముద్రంలో వుంది. అప్పటికే మా తాతగారు తన పెద్దకొడుకు చచ్చి పోయాడను కుంటానని తీర్మానించుకున్నారు. ఆయన పఠాభిని తన వారసత్వంనించి బహిష్కరించాడు.

అడయార్ బీచ్‌లో ఒక చిన్న షెడ్డులో యువజంట నివసించడం ప్రారంభించింది. అక్కడే వారి మిత్రులతో రాజకీయచర్చలు, నాటకం, కళలు గురించిన చర్చలు జరుగుతుండేవి. లేదని బాధపడక జీవితాన్ని ఉన్నంతలో ఆనందమయం చేసుకున్నారు.

ఏది ఏమైనప్పటికి మంచిరోజులు రాబోతున్నాయనే భావన తన కవితలో వ్రాసుకున్నాడు :

**కంటకావృత పథాలు అంతమయ్యాయి**
**అవిగో! ఆ పూవును చూడు!**
**సుదూర గమ్యాలన్నీ సన్నిహితులయ్యాయి**
**విజయం ఊరించే ప్రేయసి**

*ప్రగాఢ ప్రేమతో, స్నేహకు... పఠాభి.*

మా నాన్న రొమాంటిక్. ప్రతి పెళ్ళిరోజున అమ్మకు ఒక కవితో, బహుమతో – ఆర్థికపరిస్థితుల్నిబట్టి అర్పించుకునే వాడు. ఆ కవితలన్నీ దాచాం–కాని, ఇప్పుడవి కనిపించడం లేదు. బహుమతులూ మామూలువి కావు. ఒక సంవత్సరం ఆయన పాండిచ్చేరి వెళ్ళి ఒక ఫ్రెంచి షాంపేన్ బాటిల్ కొని తెచ్చాడు. మరో సంవత్సరం అతి ప్రాచీనమైన మంగళసూత్రం తెచ్చారు. ఒక్కోసారి ఎక్కడికైనా ఓ ట్రిప్.

మా అమ్మ కళాకారిణి – నర్తకి, నటి, కార్యకర్త, ప్రజల్ని ప్రేమించేది, అన్యాయాన్ని ద్వేషించేది, ఆమె మృదుస్వభావి. ఆయన మౌని. ఆయన తన ప్రేమతో అమ్మను అభిషేకించాడు. ఆమెకు స్థిరత్వాన్ని, అభయాన్ని యిచ్చాడు. అన్ని విషయాల్లోను ఆమెకు అండదండగా వున్నాడు. మా అంతరంగిక మిత్రురాలు లక్ష్మీకృష్ణమూర్తి అంది – "ఆయన తన నీడలో జ్వాలను రక్షించాడు."

పఠాభి తనపాత్రను గొప్పగా పోషించాడు. డెక్కన్ హెరాల్డ్ నవంబరు 13, 1993 సంచికలో ఆయన వ్యాసం "జీవితం నాకేం నేర్పింది?"లో ఆయన అన్నారు – "నేను ఇండియాకి తిరిగొచ్చాక ఎన్నోరకాల వ్యాపారాల్లో అడుగుపెట్టాను. అదృష్టవశాత్తూ అవన్నీ ఫెయిలయ్యాయి. నాకు గర్వంగా చెప్పుకోడానికి మిగిలిందల్లా మద్రాసు కళాకారులతో స్నేహలత ప్రారంభించిన అమెచూర్ డ్రామా కంపెనీ మాత్రమే. అది యిప్పటికీ సమకాలీన నాటక సమాజాలకన్నా ప్రదర్శనలలో అత్యున్నత స్థాయిని నెలకొల్పింది."

వారిద్దరూ ఒకరికొకరు ప్రేమతో, గౌరవంతో ఆదర్శవంతంగా జీవించారు. 'ప్రేమకు రాసిక్యం వుంటుంది. మనుషులు పంచుకునే ప్రేమకీ, జంతువుల కలయికకూ మధ్య చాలా తేడావుంది. శారీరక కలయికలోని కోరికకు, ప్రేమతోగాని, మానవతతోగాని ఎలాంటి సంబంధమూ లేదు. ప్రేమలో జీవితానికి కావలసిన సౌందర్యం, గాంభీర్యం ఆదర్శవాదం, వైచిత్రి వున్నాయి.'

స్నేహలత అస్తమించాక కూడా ఆమెతో ఆయన రొమాన్స్ అలాగే వర్ధిల్లింది. ప్రతిసంవత్సరమూ ఆమె జయంతి, వర్ధంతి రోజున ఉపవాసముండి, ఆమె పటానికి పూలదండవేసి, అగరొత్తులు వెలిగించేవాడు. 1952లో స్పానిష్ చిత్రకారుడు సెవిల్లి చిత్రించిన చిత్రం అది. అప్పుడు అమ్మ వయసు 27. అయినా ఆమె చిత్రం కాలాతీతం. ఏ వయసులోనైనా ఆమె అలాగే వుండేది. ఆమె వ్యక్తిత్వంలోని సందేహాలని, బాధని చిత్రకారుడు అందులో చిత్రించాడు. ఆమె భవిష్యత్తుని ఆ చిత్రం ముందే వ్యక్తపరిచింది.

మా నాన్న మాతో వున్నప్పటికి, రోజూ సెయింట్ మార్క్స్ రోడ్డుకు వెళ్ళి, అమ్మ చిత్రం వున్న గదిలో కూచుని ఆమెతో మౌనంగా సంభాషించే వాడు. జీవితాంతమూ ఆ ప్రేమ అలా వుండిపోయింది. ఆయన కవితలన్నీ ఆమెకోసం వ్రాసినవే. ఆయన చివరి స్క్రిప్ట 'సావిత్రి' అరవిందుల మహాకావ్యానికి సంబంధించినది. అందులో ఒక స్త్రీ మృత్యువుతో పోరాడి, తన వాదనతో యముణ్ణి జయించ డాన్ని వర్ణిస్తుంది. సావిత్రిలాగ స్నేహలతకూడ ఎమర్జెన్సీ కాలంలోని దుర్మార్గాన్ని, మరణాన్ని జయించిందని ఆయన చెప్పిన విధానం – ఆమెకూడా తనజీవితంలో ఎందరో యముల్ని జయించింది.

ఆయన రక్తంలోనే కవిత్వముంది. ఆయన కవి తాత్మక వచనంలో మాట్లాడేవాడు. ఆయన కవితలు, అమరుక్కులు పదునైనవి, విమర్శనాత్మకమైనవి, విప్లవపూరితమైనవి. ఆయన కవితలు కొన్నింటిని ఆంగ్లంలోకి అనువదించిన డా. వి. కొండలరావు వ్రాశారు. "ఆయన కవితలన్నీ హాస్యపూరితాలు. ఆర్.కె. నారాయణ్ రచనల్లాగ, వోడ్‌హౌస్ కారికేచర్లలాగ అవి సునితమూ, నిగూఢమైనవి కూడా."



**నందన**

*పఠాభి కవిత* ***'వసంతం'*** *ఈ విషయానికి ఉదాహరణగా నిలుస్తుంది.*

**ఎవరో అన్నారు–**
**వసంతం వొచ్చింది మద్రాసు నగరంలోకి**
**అదెక్కడ? కనిపించదేం?**
**నా కెక్కడా కోకిల కలకూజితం వినిపించలేదు.**
**బస్సుల రైళ్ళ రణగొణధ్వనులు తప్ప –**
**వొచ్చిందా వసంతం?**
**అవునవును! చూడు... అక్కడ!**
**చెల్లారామ్స్ ముందు ప్రకటన.**
**గొప్ప వసంతపు అమ్మకాలు... ఆకర్షణీయమైన ధరలు**
**ఎన్నడూ కనీవినీ యెరుగని డిస్కౌంట్ రేట్లు!**
**కళ్ళలో గుచ్చుకునే మాటలు..చెవుల్ని వొదలక వేలాడే మాటలు.**
**వసంతం నిజంగానే వొచ్చుండాలి"!**

తన మేనమామ, బావ శ్రీ బి. గోపాలరెడ్డి వల్ల, పఠాభి ప్రభావితుడయ్యాడు. ఆయన ఠాగోర్ బెంగాలీ కవిత్వాన్ని తెలుగులోకి అనువదించి పాడుతుండేవాడు. ఆయనే మా నాన్నను శాంతినికేతన్ తనతో తీసుకెళ్ళి ఠాగూర్ విశ్వవిద్యాలయంలో చదవడానికి కారకులయ్యారు.

పఠాభి మాటల్లో – "నేను శాంతినికేతన్ సౌందర్యానికి ముగ్ధుణ్ణయ్యాను. ఆ వాతావరణ మంతా రొమాంటిక్. ఆ ప్రదేశమంతా ఠాగూర్ బెంగాలీ పాటల సంగీతంలో రసభరి తమ యింది. ఠాగూర్ రొమాంటిక్ గేయ కవితలతో మార్మోగిన శాంతిని కేతన్‌లో రెండేళ్ళు గడిపాను. లిటరేచర్ ఎమ్.ఎ. చదవడానికి కలకత్తా విశ్వ విద్యాలయం లో చేరాను. లోవర్ చిత్పూర్ రోడ్‌లో చిన్న గది అద్దెకు తీసుకున్నాను. అక్కడి రణగొణధ్వనుల మధ్య మానవ విషాదం నన్ను విచలితుణ్ణి చేసింది. వ్యాపార కార్యకలాపాలు, వ్యభిచార గృహాలు, అమాయకత్వం దోపిడీ చేయ బడడం నన్ను అశాంతికి గురిచేశాయి. యూరోపుని కమ్ముకున్న యుద్ధ మేఘాలు ఠాగోర్ మంచువెన్నెల రాత్రుల్ని కవికావికలం చేశాయి. అది 1938, ఆ వాతావరణ ప్రభావమే నా మొదటి కవితాసంకలనం "ఫిడేలు రాగాల డజన్'' ఆవిర్భావానికి కారణమయింది. 19 ఏళ్ళ వయసులో నేనీ కవితా సంకలనాన్ని వెలువరించాను. రచనని మద్రాసు మాంబళంలోని గోపాలరెడ్డి మంత్రివర్యుల ఇంట్లో చేశాను."

ఆ రోజుల్లో తెలుగులో విశ్వేశ్వరరావు భావకవిత్వం, శ్రీశ్రీ విప్లవ కవిత్వం రాజ్యమేలుతున్నాయి. ఈ రెండింటిమధ్య పఠాభి తనదైన మార్గాన్ని అనుసరించవలసి వచ్చింది. అందుకే వచన కవితను తన మాధ్యమంగా ఎంచుకున్నాడు. అది ఓ ప్రక్క వాల్ట్ విట్మన్, మరో ప్రక్క ఆస్కార్‌వైల్డ్ ప్రభావంతో రూపుదిద్దుకుంది. "భావకవిత్వమంటే ఇష్టం లేక కాదు, నేను మార్పును కోరా''ను. ఆయన కవిత్వం సంచలనాన్ని సృష్టించింది. 19 ఏళ్ళ వయసులో వ్రాసిన ఆయన మొదటి సంకలనం ఆయన హృదయంలో ఎగిసిన భావాలకు వ్యక్తీకరణ. తన పాఠకులు కూచుని చదివి నోట్ చేసుకోవాలని ఆయన ఉద్దేశ్యం. అవసరమైతే అశ్లీల పదాలను వాడడానికీ ఆయన సిద్ధపడ్డాడు. అశ్లీల పదప్రయోగాలు నా అవసరానికి బాగా ఉపయోగపడతాయనిపించింది. నిరుత్సాహం చంపేస్తుంది, ఘర్షణవల్లే అభివృద్ధి సాధ్యమవుతుంది.

**...మిగతాది 39వ పుటలో**



# కవులు నిద్రపుచ్చిన ఊర్మిళ

- మహావీర్ ప్రసాద్ ద్వివేదీ

**ఈ వ్యాసం ప్రేరణతో ప్రసిద్ధ హిందీ కవి మైథిలీ శరణ గుప్త 1940లో 'సాకేత్' అనే గొప్ప కావ్యం వ్రాశాడు. ఇందులోని ప్రధాన పాత్ర ఊర్మిళ.**

కవులు సహజంగానే స్వేచ్ఛావర్తనులుగా ఉంటారు. వాళ్ళు ఏ వైపు మొగ్గితే ఇక ఆ వైపే మొగ్గుతూ పోతూ ఉంటారు. కావాలనుకుంటే ఇసుక రేణువును పర్వతంగానే చేసేస్తారు. లేకుంటే హిమాలయ పర్వతాలను కూడా కన్నెత్తి చూడరు. ఈ విశృంఖలత, లేక నిరాసక్తత సాధారణంగా కవుల్లో ఉండనే ఉంటుంది. ఆదికవి వాల్మీకి కూడా దీనినుంచి తప్పించుకోలేక పోయాడు. నిషాదుడు క్రౌంచ పక్షుల జంటలో ఒక దాన్ని చంపడం చూసి, ఏ కవి శిరోమణి హృదయం ద్రవించి పోయిందో, ఆ క్షణంలోనే ఎవరి నోటినుంచి 'మా నిషాద' అనే శ్లోకం అప్రయత్నంగా వెలువడిందో, ఆ దీనదయాళువైన ముని, రామాయణ రచన చేసినప్పుడు ఒక నవ వివాహిత, శోక సంతప్తురాలు అయిన రమణిని పూర్తిగా మరిచి పోయాడు. ఘోర విపత్తుపాలై ఆమె శోకిస్తున్నప్పుడు ఆమెపట్ల అణువులో అర్ధ కూడా సహానుభూతి కనపరచలేదు. ఆమె ఉనికినే గుర్తించలేదు.

వాల్మీకి రామాయణం చదివేవారికి, పారాయణం చేసే వారికి ఊర్మిళ మొట్టమొదటిసారిగా జనకపురిలో తన అక్కచెల్లెళ్ళు సీత, మాండవి, శృతకీర్తితో పాటు కనిపిస్తుంది. సీత విషయం అలా ఉంచేద్దాం. ఆమె జీవితేశ్వరుడైన రామచంద్రుని చరితాన్ని వర్ణించేందుకే రామాయణం రచించడం జరిగింది. భరతుని భార్య మాండవి, శత్రుఘ్నుని భార్య శృతకీర్తి విషయంలో విశేషమేమీ లేదు. ఎందుచేతనంటే, అగ్నికీలలకంటే కూడా ఎక్కువ సంతాపం కలిగించే భర్త వియోగం వాళ్ళు అనుభవించనే లేదు. ఇక మిగిలింది బాల వియోగిని ఊర్మిళాదేవి. ఆమె వృత్తాంతం అన్ని విధాలా కీర్తించదగిందీ, వర్ణించదగిందీ అయినప్పటికీ, కవి ఆమెపట్ల అన్యాయం చేశాడు. ఓ మునీ! ఈ దేవీ రూపిణిపట్ల ఇంత ఉపేక్షకు కారణం ఏమిటి? సర్వ సుఖాల నుంచి వంచితురాలైన ఆమె పట్ల జాలి చూపడంలో ఇంత నిర్లక్ష్యం ఎందుకు? ఆమె పేరు ఇంత వినసొంపుగా, శ్రావ్యంగా మధురంగా, మనోహరంగా ఉండడము, నిరంతరం శీతాతపాలు సహిస్తూ ఉండడం వల్ల తపస్వుల శరీరాలు, మనసులు కఠోరంగానూ, కర్కశంగానూ ఉండడమే ఇందుకు కారణమా? కాదు, కారణం అది కాదు. మీ కావ్యం చదివితే మీరు కాఠిన్యాన్ని మెచ్చేవారుగా కనపడరు. ఏది ఏమైనా నేను మాత్రం భగవతి ఊర్మిళ అదృష్టంలోని దోషమే ఈ ఉపేక్షకు ఏకైక కారణంగా భావిస్తాను. ఓ విధివంచితురాలైన దేవీ! పరమ కరుణాంతరంగుడైన ముని వాల్మీకి ద్వారా కూడా నీవు విస్మరించబడినావు కదా!

హిందీ నుంచి తెలుగు సేత : డా. జె. లక్ష్మిరెడ్డి, ఫోన్ : 09811589430

అయ్యో వాల్మీకీ! జనకపురంలో ఊర్మిళను నీవు ఒకే ఒకసారి, పెళ్ళికూతురు అలంకరణలతో చూపి ఊరకుండి పోయావు! అయోధ్యకు వచ్చిన తర్వాత అత్తగారింట్లో ఆమె నీకు గుర్తుకు రాకపోతే రాకపోయింది, లక్ష్మణుడు అరణ్యాలకు వెళ్ళే సమయంలో కూడా ఆమె దుఃఖాశ్రువులను కొంచెమైనా తుడవాలని నీకు తోచలేదా?

రామచంద్రుని పట్టాభిషేకానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలో రాజాంతఃపురమే ఎందుకు? నగరమంతా కూడా నందనవనంగా మారింది. అప్పుడు నవవధువు ఊర్మిళ ఆనందోల్లాసాల్లో ఎంతగా తేలియాడిందో అది నీవు చూడలేదా? తన భర్తకు పరమ ఆరాధ్యుడైన రాముడు రాజ్య సింహాసనంపైన కూర్చొని ఉండగా చూసి ఆమెకు ఎంత ఆనందం కలుగుతుంది, అనే దాన్ని నీవు ఊహించనే లేదా? అయ్యో! ఆ ఊర్మిళే ఒక గంట తర్వాత సీతారాములతో పాటు తన భర్తకూడా పధ్నాలుగు సంవత్సరాల అరణ్యవాసానికి వెళ్ళడం చూసి మొదలు నరికిన వృక్షంలా రాజభవనంలో ఒక ఏకాంత మందిరంలో నేలపైన పడి పొర్లాడుతూ, మీ కళ్ళకు కనిపించలేదా? అయినా ఆమెను గురించి రెండు మాటలు కూడా చెప్పటానికి వచనాలే దొరకలేదా మీకు? ఊర్మిళ వైదేహి చెల్లెలు. అందువల్ల ఆమె తన అక్క వియోగం అనుభవించవలసి వచ్చింది, ప్రాణాధారమైన భర్త దారుణ వియోగమూ సహించవలసి వచ్చింది.

ఇంత ఘోరమైన దుఃఖం ఆమె అనుభవిస్తున్నా, మీకు దయ కలగలేదు. వెళ్ళేప్పుడు కళ్ళారా తన భర్తను ఒకసారి చూడనివ్వను కూడా చూడనివ్వలేదు! ఏ రోజు రాముడు, లక్ష్మణుడు, సీత అరణ్యాలకు బయలుదేరారో, ఏ రోజు గృహత్యాగం చేసి వారు అయోధ్యా నగరాన్ని అంధకారంలోను, నగరవాసులను దుఃఖసాగరంలోను, తండ్రిని మృత్యువాతను పడేశారో, ఆరోజు కూడా నీకు ఊర్మిళ గుర్తుకు రాలేదు. ఆమె పరిస్థితి ఏమిటి? ఆమె ఏ మూలన దీనంగా పడి ఉంది? ఇదేమీ మీరు ఆలోచించలేదు. ఎంత ఉపేక్ష!

లక్ష్మణుడు నిర్మలమైన భ్రాతృప్రేమ వల్ల అన్నకు తోడుగా నిలిచాడు. రాజ్యసుఖాలను వదిలిపెట్టి తన జీవితాన్ని రామచంద్రునికి అప్పగించాడు. ఇది చాలా గొప్ప విషయం. కానీ, ఊర్మిళ అంతకంటే గొప్ప త్యాగం చేసింది. ఆమె తన ప్రాణాలకంటే కూడా ప్రియమైన భర్తను సీతారాములకు అర్పించింది. అంతేకాదు, ఈ విధంగా తన సమస్త సుఖాల త్యాగం ఆమె చేసిందెప్పుడు? వివాహం తర్వాత వచ్చి, బహు కొద్ది రోజులే గడిచిన తర్వాత! తన సంసార సుఖంలోని ఉత్తమోత్తమమైన భాగాన్ని ఆమె పోగొట్టుకుంది. ఏ సుఖమైతే వివాహం తర్వాత ఆమెకు లభించి ఉండేదో, దానికి 14 సంవత్సరాల భర్తృ వియోగం తర్వాత లభించిన సుఖం ఎన్నడూ సమానం కాలేదు. నవవధువు అయిన వెంటనే ఏ ఊర్మిళ ఐతే తన సర్వ సుఖాలను మంట కలుపుకుందో ఆమె విషయంలో అంతర్దర్శి ఆదికవి శబ్ద భాండాగారంలో ఇంత లోటా?

భర్త అనురాగానికి, పతిభక్తికి సంబంధించిన పాఠాలు సీతాదేవి ఎక్కడ నేర్చుకుందో, అక్కడే ఊర్మిళ కూడా నేర్చుకుంది. సీత భావన ఇలా ఉంది :

"స్నేహ సంబంధాలు, బాంధవ్యాలు అన్నీ భర్త లేనప్పుడు స్త్రీకి సూర్యునికంటే కూడా ఎక్కువ తపింపచేసేవిగా ఉంటాయి. శరీరం, ధనం, గృహం, భూమి, రాజ్యం, అన్నీ భర్తలేని స్త్రీకి దుఃఖపరంపరలు తెచ్చిపెడతాయి. భర్త లేనప్పుడు అన్ని భోగాలు రోగాలతో సమానంగాను, ఆభరణాలు భారంగానూ, ప్రపంచం యమధర్మరాజు పెట్టే యాతనలతో సమానంగానూ, అవుతాయి."

***– తులసీరామాయణం, అయోధ్యకాండ***

ఊర్మిళ భావన కూడా ఇలాంటిదే కాదా? అవును. సందేహం లేదు. ఇద్దరూ ఒకే ఇంట్లో పుట్టి పెరిగిన వారే కదా! ఊర్మిళ కూడా భార్యాభర్తల పరస్పర అనురాగ బంధాన్ని, కర్తవ్యాన్ని బాగా తెలుసుకున్నదే. అయితే ఆమె లక్ష్మణునితోపాటు అడవులకు వస్తానని బుద్ధిపూర్వ కంగానే మొండికెత్త లేదు. వెంట వెళ్ళడానికి ఆమె కూడా ఆయత్తపడి ఉంటే అన్నతోపాటు ఆమెను తీసుకెళ్ళడంలో లక్ష్మణుడు సంకోచించేవాడు. అంతేకాక ఊర్మిళ కారణంగా ఆయన తన ఆరాధ్య యుగళం సేవ కూడా సరిగా చేయగలిగే వాడు కాదు. ఇది ఆలోచించే ఊర్మిళ సీత వెంట వెళ్ళలేదు. ఇది ఆమె మహోన్నత వ్యక్తిత్వానికి



నిదర్శనం. ఇలాంటి ఉన్నతాదర్శాలు కలిగిన రమణిని వాల్మీకి విస్మరించడం చూసి కవితా మర్మం తెలిసిన వారెవరికైనా తీవ్రమైన మనోవేదన కలగదా?

తులసీదాసుకూడా ఊర్మిళ పట్ల అన్యాయమే చేశాడు. ఈ విషయంలో ఆయన కూడా ఆదికవినే అనుసరించాడు. 'నానా పురాణనిగమాగమాల' సారాన్ని గ్రహించి 'రామచరిత మానస్' రచన చేస్తున్నాని ప్రకటించుకున్నప్పుడు ఇక్కడ ఆదికావ్యంలోని మాటలనే ఆధారం చేసుకొని రాయవలసిన అవసరం ఏముంది? ఆయన కూడా అరణ్యాలకు వెళ్ళేటప్పుడు లక్ష్మణున్ని ఊర్మిళతో కలవనివ్వ లేదు. లక్ష్మణుడు తల్లివద్దకు వెళ్ళినట్లు రాసి వెంటనే ఇలా అన్నాడు –

**గయే లఖన జహఁ జానకి నాథా**

(లక్ష్మణుడు జానకీ నాథుడున్న చోటికి వెళ్ళాడు)

ఇష్టదైవానికి నిష్ఠాగరిష్ఠుడైన సేవకుడు లక్ష్మణుని పట్ల ఇంత కాఠిన్యం ఎందుకు? తన కమండలంలోని కరుణాజలంలోని ఒక్క బిందువును కూడా ఆయన ఊర్మిళకోసం వెచ్చించలేక పోయాడు. పూర్తి కమండలాన్ని ఉన్నదున్నట్లు సీతకే అర్పించేశాడు. కనీసం ఒక పద్యంలోనైనా ఊర్మిళ స్థితిని వర్ణించి ఉంటే ఎంత బాగుండేది? లేదా ఆమె నోటనే రెండు మాటలు చెప్పించి ఉంటే! సీతారాముల వనవాసానికి సంబంధించి, తన భర్తృవియోగానికి సంబంధించి ఎలాంటి – ఎలాంటి భావాలు ఆమె కోమల హృదయంలో పుట్టుకొచ్చాయో, పాఠకులు వినగలిగే వారు కదా! ఊర్మిళను జనకపురి నుంచి అయోధ్యకు చేర్చి ఆమెను ఇలా పూర్తిగా మరిచిపోవడం సమంజసంగా లేదు.

అయితే భవభూతి మాత్రం తన 'ఉత్తర రామచరితమ్' నాటకంలో, ఈ విషయంలో కొంత దయ చూపించాడు. సీతారాములు, లక్ష్మణుడు అరణ్యాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత భవభూతికి పాపం ఊర్మిళ గుర్తుకు వచ్చింది. చిత్రఫలకం పైన ఊర్మిళను చూపి, సీత లక్ష్మణుని ఇలా అడిగింది–"ఇయమపరా కా?" అంటే "ఈమె ఎవరు?" అని. ఈ విధంగా సీత మరిదిని అడగడంలో వినోదం, పరిహాసం లేకపోలేదు.

లక్ష్మణుడు ఈ విషయం తెలుసుకున్నాడు. ఆయన కొంచెం సిగ్గుపడి, మనసులో ఇలా అనుకున్నాడు–"వదినె ఊర్మిళ గురించి అడుగుతూందే! అని." సీత ప్రశ్నకు జవాబు చెప్పకుండా లక్ష్మణుడు ఊర్మిళ చిత్రం పైన చెయ్యి ఉంచాడు. ఆయన చేతి క్రింద ఊర్మిళ చిత్రం కప్పుకు పోయింది. ఇది భవభూతి తె చ్చిన ఊర్మిళ సందర్భం. ఉజ్వలమైన ఊర్మిళ వ్యక్తిత్వ చిత్రం ఇలాగే ఇతర కవుల ద్వారా కూడా ఇంత వరకు మూసివేయబడుతూ ఉండడం ఎంత బాధాకరం!

---

# పాండిత్యం

గొబ్బూరి వెంకటానంద రాఘవరావుగారు 'నక్షత్రాలు' అనే గ్రంథంలో అతి సంస్కృత పండితుల సంస్కృత గ్రాంథిక లౌక్యాన్ని గూర్చి హాస్యం చేశారు. ఒక గొప్ప పండితులవారు తమ ఇంట్లో రాత్రి చోరులు (దొంగలనకూడదు కదా!) తమకు పనికివచ్చే సామానులు పట్టుకుపోయే పరిశీలనలో ఉండగా, సేవకులను సంస్కృతలో ఉద్బోధించారనీ, ఆయనేవో మంత్రాలు చదువు కుంటున్నాడు మనకెందుకు లెమ్మని ఆ పనివాళ్లు వినిపించుకోలేదనీ, మర్రోజు పొద్దున్నే 'ఏమిటిరా? ఇంత మొద్దు నిద్రయితే నేనెట్టా చచ్చేది? మీ ఇద్దరన్నదమ్ములను కేకవేసినా ఒకరూ లేవలేదు" అని వాళ్ళను తప్పపట్టగా. "ఏమని పిలిచారో మాకు తెలవనే తెలవందే!? అన్నారట వాళ్లు. "హే తండులాంశః, హే తదంశః అని నా నోరు నొప్పి పుట్టేట్లు పిలిచాను కదరా" అన్నార్ట పంతులు వారు. "మీ సంసుకురుతం మాకెట్లా తెలుస్తది బాబు" అన్నారట ఆ పనివాళ్లు. ఇంతకూ ఆ పనివాళ్ళ పేర్లు పెదనూకడూ, చిననూకడూ అయితే, పంతులుగారు ఆ గ్రామ్యనామాన్ని ఉచ్చరించరు కదా! సొత్తు చోరీ అయినా ఫర్వాలేదు. ఇలా ఉంటుంది మన పండితుల సంస్కృతీకరణాభి మానం అని రాఘవరావు గారు పరిహాసం చేశారు.

*35వ పుట తరువాయి*

## ఫిడేల్ రాగాల పఠాభి

అందుచేతనే నా కవితలన్నింటిని ఉత్తమ పురుష ఏకవచనంలో వ్రాశాను. అహంకారం, హేళన, సెక్స్ నా ఆయుధాగారంలో అస్త్రాలయ్యాయి." నగరజీవనంలోని రకరకాల ధ్వనులద్వారా మానవజీవన వ్యధను ప్రతిధ్వనించేందుకు ఆయనకొక లయ కావాలి. అందుకే పాతకాలపు వచనాన్నీ, గేయకవిత్వాన్నీ ఆయన ప్రక్కన పెట్టాడు. విప్లవకవిత్వం పాఠకుడికి అలవాటైన జోలపాటగా మారి అంతా బాగుందనే తృప్తిని కలిగిస్తుంది.

బాహ్య ప్రపంచంలోని వినాశనానికి సరైన నిర్మాణం లేదు. క్రొత్తదారుల్ని నిర్మించాలంటే అప్పటికి అమలులో వున్న పాతవిలువల్ని మార్చి పునర్నిర్మించాలి. సంఘం ధరించిన ముసుగుల్ని తొలగించి చూడాలి. నేను నా మొదటి కవితల్ని వ్రాసేప్పుడు ఇలాంటి ఆలోచనలే కలిగాయి. తాను సృష్టించిన సంచలనాన్ని పట్టించుకోని పఠాభి అమెరికా వెళ్ళాడు. తెలుగు సాహితీ ప్రపంచం పఠాభి ప్రవేశపెట్టిన క్రొత్త ఆలోచనలు, వ్యక్తీకరణలు చూసి అవాక్కయింది. పఠాభి తీసుకున్న విప్లవ పంథాకు తట్టుకోలేక పోయింది. నగర జీవితంలోని జీవన విధానం పైకి అద్భుతంగా కనిపిస్తుంది. కాని, దాని క్రూరమైన నగ్నసత్యాలు భయానకమైనవి. ఆయన కవితల్ని మెచ్చుకున్న వారు, కవిత్వంలో క్రొత్త మార్గాల్ని నిర్మించడానికిష్టపడే శ్రీశ్రీ లాంటివారు ఆయన్ని మేధోకవి అన్నారు. ఇష్టంలేనివాళ్ళు ఆయన్ని మానసానందాన్నిచ్చే 'సెన్సువస్' అన్నారు. ఆయన కవిత్వంలో సచ్ఛీలత లోపించిందన్నారు. ఒక విధంగా చెప్పాలంటే పఠాభి ప్రాక్పశ్చిమ బంధానికి పురోహితుడు. కవిగా ఆయన స్థానాన్ని కవులూ, పాఠకులూ కూడా సరిగా అర్థం చేసుకోలేక పోయారు. ఆయన ఆలోచనలు, పదాల బాణవేగాన్ని వాళ్ళు అందుకోలేక పోయారు.

ఆయన జీవితాంతమూ కవిత్వం వ్రాస్తూనే వున్నాడు. సంఘ పునాదుల్ని కదిలిస్తూనే వున్నాడు. పఠాభి అన్ని ప్రాచీన కవితారీతుల్ని, మూఢనమ్మకాల్ని ఛేదించాడు. ప్రాక్పశ్చిమ మేధస్సులను కలిపి ఒక క్రొత్త, ఆరోగ్యకరమైన విధానాన్ని ప్రవేశపెట్టాడు. క్రొత్త క్రొత్త ఆంగ్లపదాలు దొంగిలించి, క్రొత్త అర్థాల్నిచ్చి కవితల్లో ప్రవేశపెడతానన్నాడు. ఆ విధంగా ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. ఆయన ఛందస్సుల నడ్డివిరగ్గొట్టాడు– పదాలను విచ్చలవిడిగా వాడి క్రొత్త నుడికారాన్ని నిర్మించాడు. ఆయన ఆంగ్లాన్ని తెలుగీకరించాడు. ఛందోబంధాలను ఛేదించి, ఆధునిక జీవనంలోని అట్టడుగు మురికికూపాల్ని బహిర్గతం చేశాడు. ఆయనకెంతో గుర్తింపు వచ్చింది, కాని ఆయనకు ప్రచారం గిట్టదు, మీటింగులు, సన్మానాలంటే అసహ్యం, ఉపన్యాసాలివ్వడం భరించలేడు, చర్చించడమంటే ఇష్టం. ఇన్‌లాండ్ కవర్లమీద ఉత్తరాలు వ్రాసేవాడు. ఇంటర్నెట్‌ను ఎప్పుడూ ఉపయోగించలేదు. తెల్లని ధోవతి, జుబ్బా ధరించి, డైనింగ్ టేబిల్ దగ్గర కూచుని, విప్లవానికీ, అభిప్రాయ భేదాలకీ సంబంధించిన ఎన్నో విషయాలమీద మాట్లాడేవాడు. "ఈ సంఘపు సంకెళ్లని గురించి నాకవితల్లో చెప్పిన విషయాలు ఏకొద్దిమందికైనా, ఏకొంచెమైనా అర్థమైతే నాప్రయత్నం నెరవేరినట్లే. ప్రజాజీవన చిత్రాన్ని గీయటంకాదు. వాళ్ళ వెనకపనిచేసే విలువలు, ప్రోద్బలాలు సిద్ధాంతాల గురించి చెప్పడమే నాఉద్దేశ్యం. వాటిలోని అసహ్యత, అసంబద్ధత, నగ్నతతోనే నాపేచీ అంతా. నేను వ్రాసేవి వ్యంగ్యం. దాన్ని ప్రజలు నిజంగా తీసుకున్నారు. ఆధునికత పేరుతో, సాంప్రదాయం పేరుతో వాళ్ళు ఆచరించే అబద్ధపు విలువలనే నేను హేళన చేశాను" – అనేవారు.

ఆధునికత అంటే ఏమిటని ఇప్పటికీ చర్చోపచర్చలు జరుగుతూనే వున్నాయి. పఠాభి 'అత్యాధునిక కవి' అని శ్రీపాదగోపాలకృష్ణమూర్తి 1963లోనే చెప్పారు. ఆయనకు ఎన్నో ఇజాలున్నాయి. ప్రతిరోజు కొన్నింటిని వివరించేవారు. పదాల పేర్లు మూలాల్ని వెదకడం, చరిత్రలో, పురాణగాథల్లో వాటి మూలాల్ని పట్టుకోవడం ఆయనకు చాలాయిష్టం. సంఘంమీద ఎప్పుడూ మాట్లాడుతుండేవారు. ఆయన మాటలు పదునైనవి. హాస్యం, దయ అనే మందుల్ని వాటికి పూసేవాడు. ఆయన తననూ వొదల్లేదు. తన మీద తనే వ్యాఖ్యానించుకునేవాడు. ద్వంద్వార్థాలంటే ఆయనకు ప్రేమ. "శ్లేష ఒకేసారి నాణేనికున్న రెండు పార్శ్వాలను చూసే అవకాశాన్ని కల్పిస్తుంది. దాన్ని నేను వరంగా భావిస్తాను" అనేవారు. ఛందోరహిత కవిత్వానికి ఆయన చిరునామా. కవిత్వాల తపన శాశ్వతమైనది. అది ఏకత్వంలో అనంతత్వం అనేవారు. ఆ విధంగానే ఆయన జీవించారు.

*మిగతాది వచ్చే సంచికలో*

# ముంగిట్లో గమ్యం

ఆరునూరైనా సరే
ఆశించిన గమ్యాన్ని అందుకోకుండా ఉండలేను.
ఎన్నాళ్లని మెడసాచి చూడను.
దూర దూరాల్లో వున్న శిఖరాలు
నా చూపులకు అందినట్టే అంది
తప్పించుకు పోతున్నాయి.
కళాఖండాలు కరిగిపోతున్నాయి.
ఆలోచనలు చక్రాకృతిలో తిరిగి తిరిగి
అరిగిపోతున్నాయి.
అసలు కీలకమేదో అంతుపట్టడం లేదు.
చలికాలం కాసే
నులివెచ్చని ఎండలాంటి అనుభూతి
కలిగేదెప్పుడో.
కాసింతసేపు విశ్రమిద్దామని అనుకుంటే
మనసునిండా పొగలు ముసిరినట్టవుతుంది.
అనుకున్న రాగాన్ని ఆలపించాలనుకుంటే
అది గొంతుదాకా వచ్చి
గిరి గిర తిరిగి
అంతలోనే నాభిలో ఇంకిపోతున్నది.
ఒళ్లంతా విదిలించి చూశాను.
ఏదైనా ఒక వ్యూహం
రేఖామాత్రంగా నైనా స్ఫురిస్తుందో అని.
ఎగిరి అందుకోవాలనుకున్న కొమ్మలు
నా అరిచేతుల్ని వెక్కిరిస్తున్నాయి.
ఎన్నాళ్ళీ నిష్ఫల మనో మథనమంటూ
విసుక్కుంటూ విసురుగా లేచి నిలబడ్డాను.
నా ఎదుట అజ్ఞాత కంఠమేదో ఇలా
వినిపించింది-
"నువ్వు చేపట్టాలనుకుంటున్న గమ్యం
నీకు చేరువలోనే ఉంది.
ఇంతసేపు నీలో సాగిన
అన్వేషణ ఆవేదన మథనం జ్వలనం
నీ ఆశయసిద్ధికి దిక్సూచికలు.
ఇవి ఇలాగే కొనసాగితే
గమ్యం నీ ముంగిట్లో వచ్చి వాలుతుంది.

- డా. సి. నారాయణ రెడ్డి



*24వ పుట తరువాయి...*

## స్వాతంత్ర్య పోరాటం

పాలెగాళ్ళ బంధువులు, మిత్రులు, గ్రామాధికార్ల బంధువులు, వ్యాపారులుకూడా ఇందులో పాల్గొన్నారు. తిరుగుబాటు కాలంలో ఆంగ్లేయులు గ్రామాలను తగులబెట్టుట, దోచుకొనుట, గ్రామీణులను బంధించుట వంటి చర్యలు చేపట్టుట కూడా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలంతా సమైక్యంగా పోరాడేట్లు చేసింది. తమిళ ప్రాంత పాలెగాళ్ళు, సీడెడ్ జిల్లాల (రాయలసీమ) పాలెగాళ్ళు, కడకు కోలార్ వంటి ప్రాంతపు మైసూరు పాలెగాళ్ళు కూడా ఈ తిరుగుబాటుకు మద్దతునిచ్చారు. ఈ ఉద్యమాన్ని పరిశీలిస్తే ప్రాంతీయ స్థాయిలో జరిగిన జాతీయోద్యమంగా అనిపిస్తుంది. కాని నాటికి జాతీయతా భావం భారతీయుల్లో ఏర్పడలేదు. స్వాతంత్ర్య లేక ప్రాంతీయ భావం మాత్రమే కాని ఆంగ్లవ్యతిరేక భావం అన్ని ప్రాంతాల ప్రజల్లోనూ, దేశమంతటా వ్యాపించి ఉండేది. స్వాతంత్ర్యంకై (స్వేచ్ఛ) చిత్తూరు పాలెగాళ్ళు జరిపిన ఉద్యమం ఆకాలపు ఇతర ఉద్యమాలవలె భావితరాలకు స్ఫూర్తినిచ్చి జాతీయోద్యమాన్ని చేపట్టి ఆంగ్లేయుల నుండి మొత్తం దేశాన్నే విముక్తి పరచి స్వాతంత్ర్యాన్ని సంపాదించునట్లు చేసిందనుటలో సందేహంలేదు.

**చిత్తూరు పాలెళ్లలో సాగిన పోరాటాన్ని స్వాతంత్ర్య (స్వేచ్ఛ) పోరాటమని, రైతు ఉద్యమమని, గిరిజనోద్యమమని పిలచుటలో తప్పులేదు. ఆంగ్లేయుల నుండి విముక్తికై జరిగిన ఉద్యమం గావున స్వాతంత్ర్య పోరాటమని, రైతు వర్గంగా పిలువదగిన రీతిలో తమ వ్యక్తిగత భూముల్లోని వ్యావసాయిక ఉత్పత్తి దశలన్నింట్లో పాలెగాళ్ళు శ్రద్ధ చూపేవారు. గావున వీరిని రైతులుగాను, వీరు చేపట్టిన ఉద్యమాన్ని రైతు ఉద్యమంగాను పిలువవచ్చు.**

చిత్తూరు పాళేళ్లలో సాగిన పోరాటాన్ని స్వాతంత్ర్య (స్వేచ్ఛ) పోరాటమని, రైతు ఉద్యమమని, గిరిజనోద్యమమని పిలచుటలో తప్పులేదు. ఆంగ్లేయుల నుండి విముక్తికై జరిగిన ఉద్యమం గావున స్వాతంత్ర్య పోరాటమని, రైతు వర్గంగా పిలువదగిన రీతిలో తమ వ్యక్తిగత భూముల్లోని వ్యావసాయిక ఉత్పత్తి దశలన్నింట్లో పాలెగాళ్ళు శ్రద్ధ చూపేవారు. గావున వీరిని రైతులుగాను, వీరు చేపట్టిన ఉద్యమాన్ని రైతు ఉద్యమంగాను పిలువవచ్చు. అంతేగాక ఈ ఉద్యమంలో రైతు వర్గంలో ఉన్నత వర్గంగా చెప్పదగిన పాలెగాళ్ళతో బాటు ఇతర రైతు వర్గాలన్నీ పాల్గొనుట వలన కూడా దీన్ని రైతు ఉద్యమంగా చెప్పుటలో తప్పులేదు.

ఈ ఉద్యమ నాయకులైన పాలెగాళ్ళు అటవిక లేక గిరిజన జాతులకు నాయకులుగా ఉండినవారు. గావున వారి సహాయం వీరి తిరుగుబాటులో ఉన్నందున దీన్ని గిరిజనుల తిరుగుబాటని కూడా పిలువ వచ్చు. కడప కోయిలకుంట్లలో 1846 లో జరిగిన పాలెగార్ నరసింహారెడ్డి తిరుగుబాటు కాలం, చిత్తూరు పాలెగాళ్ళు తిరుగుబాటు కాలాల్లోనే (ఆంగ్లవ్యతిరేక తిరుగుబాట్లలో) పలువురు రైతులు, ఇతర గ్రామ ప్రజలు పాల్గొనుట అగుపడును. అయినప్పటికీ ఈ రెండు ఉద్యమాలు విఫలమయ్యాయి. అందుకు పాలెగాళ్ళకు తగిన ఆర్థిక శక్తి, సైనిక శక్తి, ఆధునిక ఆయుధాలు, దేశ ప్రజలు, నాయకుల మద్దతు, సహాయసహకారాలు, లేకుండుటే ప్రధాన కారణాలు. అంతేగాక గుడిపాటి, కాళహస్తి, కార్వేటినగర్, వెంకటగిరిల పాలెగాళ్ళు ఆంగ్లేయులకు సహకరించారు. ఇవన్నీగాక నాటి ఆంగ్లేయులకు కావలసిన ఆర్థిక, సైనిక శక్తులు ఉండేవి. సమర్థులైన సైనికాధికారులు ఉండేవారు. వీటికి తోడు శైశవదశలోని రాజ్యాన్ని పరిరక్షించుకొని, పటిష్టపరచుకొని, వ్యాపారాభివృద్ధి, ఆర్థిక వనరుల సేకరణ చేసుకొనుటకు ఆంగ్లేయులు కంకణం కట్టుకొనియుండిరి. ఫ్రెంచివారిని సైతం వెడలగొట్టి దేశాన్నంతా ఆక్రమించాలని, తమ అవసరాలకు దేశాన్ని రాజకీయంగా, ఆర్థికంగా వాడుకోవాలని నిర్ణయించు కొనియుండిరి. ఇట్టి వాతావరణంలో సాంప్రదాయరీతి. ఆయుధాలతో పోరాడే పాలెగాళ్ళ స్వాతంత్ర్య పోరాటం విఫలం కాకతప్పదు. కాని వీరి తిరుగుబాటు, ఇతర తిరుగుబాట్లవలె భావితరాలకు స్ఫూర్తినిచ్చి, వారిని సమైక్య పరచి, జాతీయోద్యమంద్వారా ఆంగ్లేయులను తరిమికొట్టి దేశానికి విముక్తిని స్వాతంత్ర్యాన్ని సాధించునట్లు చేసింది. అనగా తాత్కాలికంగా వీరి ఉద్యమందెబ్బతిన్నా దీర్ఘకాలిక ప్రయోజనాన్ని చేకూర్చిందని చెప్పవచ్చు. మి

# ఎచటిదీ కర్ణాట భాష

- పలగాని గోపాలరెడ్డి

శ్రీనాథకవి తన భీమేశ్వర పురాణ కృత్యాదిలో తన రచనాశైలిని గురించి విశదీకరిస్తూ, అది ప్రౌఢ సంస్కృతమును తలపించినా, నుడికార మాంధ్ర భాషానుగుణ మనిపించినా, నిజమునకు తాను వాడినది కర్ణాట భాష అనెను. కన్నడమన లేదు. ఇంకా కాశీఖండ కృత్యాదిలో "కర్ణాటదేశ కటక పద్మవనహేళి" అనెడి పోలికను తగిలించుకొనెను. చాటు పద్యమొక దానిలో "కన్నడ రాజ్యలక్ష్మీ" అని పిలచి, కన్నడ సీమలో తాను పడిన అగచాట్లను ఏకరవు పెట్టి ఆక్రందనను వెలిబుచ్చెను. ఇంకా ఆయన రచనలందెడనెడ కన్నడ ఛాయలను చొప్పించెను చూడుడని కొందరాయనను "కన్నడిగు" డనగా అది సుదూర సత్యమని మరికొందరు త్రోసిరాజనిరి. ఇందుపై ఈ వ్యాసములో ఒక విభిన్నకోణము ప్రతిపాదింపబడినది.

ముందుగా శ్రీనాథయ్య పరమైన కొన్ని అంశములు (ప్రస్తుత వ్యాసావసరమునకు ఉపకరించెడివి) దిగువ పొందు పరచ బడినవి.

1) ఆనాటికే, అరియేటి అన్నయ, పిల్లలమర్రి పెద్దనలవలె కొందరు బ్రాహ్మణుల కింటిపేర్లు స్థిరపడగా శ్రీనాథయ్య తన ఇంటి పేరెక్కడా చెప్పలేదు. పౌరుషేయ విధానములో "మారయ శ్రీనాథుడు"గా కూడా చెప్పుకొనలేదు. అరియేటి వారికి "ప్రోలయ అన్నయ" వరకు అట్టి సంప్రదాయ ముండినది. ఇది ద్రవిడ దేశ సంప్రదాయముగా ఇంకనూ మిగిలి ఉన్నది.

2) కమలనాభయ్య, మారయ, శ్రీనాథయ్య - ఇవన్నీ విష్ణుపరమైన పేర్లు. కానీ శ్రీనాథయ్య శివారాధనాతత్పరుడు.

3) తాతగారైన కమలనాభయ్య "వారిధి తట సమీప మందలి కాల్పట్టణ ప్రభువు." ఆయన పద్మపురాణ సంగ్రహమన్న ప్రబంధమును రచించినవాడు. "వినమత్కాకతి సార్వభౌమ విద్యాధరుడు." తన "విద్యావిశారద"ను ప్రదర్శించి కాకతి సార్వభౌము (కాకతి ప్రతాపరుద్ర?)ని మెప్పించి కాల్పట్టణాధిపత్యము (అగ్రహారము కాదు) సంపాదించెననుట హేతుబద్ధమే కాగలదు. ఆ నియోగము పారంపర్యము కాదు, కాలేదుగా తోస్తున్నది. మారయ పేరుకు మాత్రమే మంత్రి కాగా, శ్రీనాథయ్య ఆ నియోగ సూచకమును కూడ తన పేరు నుంచి విదలించి వేసెను. కాకతీయ సామ్రాజ్యము కమలనాభయ్య జీవితకాలములోనే అంతరించినది. కాన ఆ రాచప్రోపు కమలనాభయ్యతోనే ముగిసినదనదగును.

4) కాకతీయ దత్తకాల్పట్టణము తూర్పు తీరమందలిదే కావలెను. ఏమంటే కాకతీయ సామ్రాజ్యపుటెల్ల పశ్చిమ తీరమును తాకలేదు.

5) కాల్పట్టణాధిపత్యము తొలగేనాటికి, శ్రీనాథయ్య చిన్నవాడు. అది కొనసాగి ఉంటే, కందుకూరు రెడ్డి దొరలు "దిన వెచ్చములు" పంపడము, తన అవసాన కాలము వరకూ దానిని మరిచిపోలేక, శ్రీనాథయ్య కృతజ్ఞతాపూర్వకముగ పలకవలసిన అవసరముండునా? శ్రీనాథయ్య కుటుంబము కాల్పట్టణము విడచి పాకనాటిలోని కందుకూరు (ప్రకాశం జిల్లా) పరిసరములకు జరిగి, ఆయన నవయౌవన కాలము వరకచ్చటనే ఉండి నారనుకొనవచ్చును.

6) హరవిలాస కృత్యాది ప్రకారము, అవచి తిప్పయసెట్టి శ్రీనాథయ్యకు బాల్యసఖుడు. అంటే భౌతికముగా చెట్టాపట్టాలు వేసుకొన్న వారనవచ్చును. అవచి తిప్పయసెట్టి విద్యాభ్యాసము పిల్లలమర్రి పినవీరభద్రయ్య తన శృంగార శాకుంతలములో, తనది సోమరాజు పల్లెగా చెప్పినందున, కందుకూరు సమీపములోని సోమరాజు పల్లెతో కూడ ఆ కుటుంబముండినది. అతి సమీపములో సాగర తీరస్థమైన "పాకల" గ్రామంలో

దొరికిన శాసనములందొక దానిలో నెల్లూరు పట్టణమునకు చెందిన "నగరము" (ద్రవిడ వైశ్య గణము) వారి ప్రసక్తి ఉన్నది. హరవిలాస పీఠికలో అవచి పావాణి సెట్టి "విక్రమ సింహపుర (నెల్లూరు) ప్రముఖ నగరము" వానిగా చెప్పబడడము దృష్ట్యా అవచి తిప్పయకు చదువు నేర్పిన పిల్లల మర్రి పెద్దన మంత్రిది కూడ పాకనాటిలోని సోమరాజుపల్లి కాదగును.

7) అరియేటి అన్నయమంత్రి శ్రీనాథుని "పాకనాటింటి వాడవు-బాంధవుడవు"గా చెప్పడము కూడ శ్రీనాథయ్య బాల్యము కందుకూరు ప్రాంతములో గడిచెననుటకొక సాక్ష్యము. కానీ అరియేటి వారితో శ్రీనాథునికుండిన బాంధవ్య వివరము తెలియరాదు.

పై పూర్వరంగమంతా మదిలో నుంచుకొని చూచిన శ్రీనాథయ్య చెప్పిన కర్ణాట భాష కన్నడమే అగుచో అది ఇంటి భాషేకాగలదు. తాము పెరిగి తిరిగిన ప్రాంతపు భాష మాత్రము కాజాలదు.

భీమేశ్వర పురాణములో అరియేటి అన్న శౌరియొక్క బహుభాషా ప్రజ్ఞ తెలిసిన సందర్భములో "గజకర్ణాటా"ది భాషాప్రసక్తి తగిలినది. "గజ" అన్న పదము భాషా సూచకము కాదు. అదొక విశేషణమే. గజదొంగ ఇత్యాదులందు వలె ఆ విశేషణము ఘనసూచకము. అలా "దొడ్డ కర్ణాట" అనినందున "చిన కర్ణాట" కొరకు వెతకవలసి వచ్చినది. ఈ సందర్భములో, గజకర్ణాటపు వివరాలీ విధముగా ఉన్నవి.

వాత్సాయన కామసూత్ర వ్యాఖ్యాత "జయమంగళుడు కర్ణాట దేశము దక్షిణాపథములోనిదనిన్నీ, దాని ఉత్తర, తూర్పు దక్షిణపు టెల్లలనంటి మహారాష్ట్ర, ఆంధ్ర, ద్రవిడ దేశములుండి నటుల తెలిపెను. కాశ్మీర రాజవంశ చరిత్రను తెలిపెడి "రాజతరంగిణి"లో కల్హణ కవి, కర్ణాట దేశవాసులను కర్ణాటా, కర్ణాటీ అని పిలచెను. విద్ధసాల భంజిక (సంస్కృత నాటకము) లో త్రిపురి పాలకుడైన యువరాజసేనునికి విదర్భ ప్రాంతములో జరిగిన ఒక యుద్ధములో కర్ణాట యోధులు (భటా ఏవ కర్ణాటా) విజయము చేకూర్చినటుల తెలియగలము. బాగల్పూరు (బీహారు)లో దొరికిన ఒక (పాలవంశ రాజుల) శాసనములో అంగవంగ కళింగరాజులు తమలో తాము పోటీపడ్డట్లుగా తమ సైన్యాలను యువ కర్ణాట పోటర్లతో నింపుకొన్నట్లున్నందున, కర్ణాట దేశస్థుల దూరపు వలసలు తెలియవస్తున్నవి. కానీ సంగకాల ద్రవిడ సాహిత్యము (సిలప్పది కారం)లో "త" వర్గానునాసికా యుక్తముగా ''కరునాటర్'' పేరుతో వారు కన్పించిరి. మరొక సందర్భములో, అదే కాలమునాటి, తమిళ కవయిత్రి "అవ్వైయారు" కూడ 'కరునాటర్'గా పిలచెను. మరాఠీ వాగ్గేయకారుడు ''నామదేవుడు'' పండరిపుర విఠలుని "కానడియా" (కన్నడ – కానడ పరిణామము)గా పిలచి ఆ దేవుని కన్నడ దేశ మూలమును తలపించెను.

''కరు'' అనెడి పదమునకు ''నల్లని''గా అర్థము స్వీకరించి, కర్ణాటమంటే నల్లని (రేగడి) నేలలుండే సీనుగా చెప్పిరి. అలాగే "కన" అంటే కూడ శ్యామలవర్ణముగా చెప్పి అదే అన్వయమును నిఘంటువులోని కెక్కించిరి. సంస్కృత భాషాభిమానులు "కర్ణ" మంటే "కొండగుహ" అంటూ బిలముత పర్వతభూమి కర్ణాటమనిరి. కానీ శకటరేఫయుతమైన "కఱు" అంటేనే "నల్లన"నెడి అర్థము చెల్లగలదు. సాధురేఫ యుక్తమైన "కరు" అంటే "చిన్న" అనెడి అర్థము గ్రహించవలసి ఉన్నది. కరసాన, కరగోడ, కరుగోల ఇత్యాది తెనుగు పదములందున్నదా విశేషణమే. కరు (తమి, కన్న), కరువు లేక కరుగు(తెను)లకు "గర్భస్థ సూక్ష్మ ప్రతిరూపమ"నెడి అర్థమున్నది. ప్రతిరూపములను పోత పోయుటకు ఉపయోగించే మూసకట్టును కూడ కరవు (తెను) అందురు. దక్షిణ భారతములో నేటికిన్నీ నిలచి ఉన్నపలు "కరూరు"లు ఒకనాటి టంకసాలలే.

నెల్లూరు జిల్లా; నాయుడుపేట శివారు గ్రామము తుమ్మూరు. అచ్చటే సువర్ణముఖీ తీరస్థమైన "పెరుమాళ్" దేవాలయమొకటున్నది. ఆ గుడి గోడలపై దొరికిన రెండు తమిళ శాసనములందా స్వామి "కరుమాణిక్కపెరుమాళ్"గా, మరొక దానిలో "కన మాణిక్క పెరుమాళ్"గా పిలువ బడెను. "మాణిక్క పెరుమాళ్'8గా పిలువబడెను. "మాణిక్యము" కెంపు ఛాయ జాతిరత్నము. నల్లని కెంపు అసంగతము స్థానికుల కథనము ప్రకారము ఆమూర్తి ఆరుగురు పెరుమాళుల తదుపరి చిన్నవాడు. ఈ చర్చానుసారమే తదుపరి కరునాటి కన్వయమునకాధారము.

గజ కర్ణాటమునకు భిన్నమైన కర్ణాటమునకై వెతుకగా శ్రీశైల పాదభూమి మొదలుకొని నందికొట్కూరు మీదుగా నంద్యాల పర్యంతము విస్తరించిన కర్నాటి సీమ ఒకటి, కొన్ని శ్రీశైల శాసనములందు తగిలినవి. అందొకటి విరూపాక్షరాయల దానశాసనము. దానిలో పలు సీమలందలి గ్రామముల ప్రసక్తి ఉన్నది. వానిలో కర్నాటిలోని కరువెన

ఒకటి. ఈ కర్నాడు, దొడ్డ కర్ణాటకకు చాలదూరమందుండుటే కాక రెండింటి మధ్య నిరికికొన్న ఐజనాటి ప్రసక్తి వలన, కర్నాడు గజ కార్ణటలో అంతర్భాగము కాదని, రెండూ విభిన్న ప్రాంతములని తెలియగలము. నేటి కర్నూలు కూడ ఈ కర్నాటిలోనిదిగా తోచును. కాని దానిని కందన లేక కందలవోలుగా మాత్రమే పిలచిన సందర్భములు కొన్ని ఉన్నవి. కన్దయ్యస్వామి వినాయకుని వెనుకటి చిన్నయ్య. అలాగే కన్నయ్య దేవకికి ఎనిమిదవ సంతు. కన్ద, కన్నలు కూడ "కరు" వలె "చిన్న"కు పర్యాయ పదములే. ఆ దాన శాసనములో కన్పించిన "కరువెన" గ్రామమింకా నిలచి ఉన్న బ్రాహ్మణాగ్రహారము. కరువెన బ్రాహ్మణులొక ప్రత్యేకమైన గుంపు. వారికై ప్రత్యేకమైన అన్నసత్రములు. నందికొట్కూరు, శ్రీశైలం, వారణాసిలందున్నవి. కరువెనతోపాటు బ్రాహ్మల అనంతపుర, బ్రాహ్మల పినపరతో పాటు, ఆరెగడి సీమ ప్రసక్తి కూడ కనిపిస్తుంది. అది అహోబల పర్వత పాదభూమి. బహుశా తదుపరి కర్ణాట పాలకులైన ఆరవీటి వారి పుట్టిల్లు కావచ్చును. శ్రీశైల పాదము వద్ద (దోర్నాల మండలము) "ఆరుట్ల" పేరుతో మరొక గ్రామమున్నది. ఆ శాసనోక్త కర్నాటి నానుకొని దిగువగా వోటవాడి సీమలో, కంబము మదుగుదరిపై, పెద్దారవీడు, అదరవీడన్న రెండు (రెండూ మండల కేంద్రములే) ఉన్నవి. ఆ పెద్దారవీడుకు జోడైన చిన్న ఆరవీడు, ఆ దరిదాపులందు లేదు. నెల్లూరు జిల్లా (జలదంకి మండలము)లో పెద్ద కాక, కడపజిల్లాలలో పెద్దముడియం గ్రామములకు బ్రాహ్మణక్రాక, బ్రాహ్మణ ముడియ మన్న ప్రతినామములుండబట్టి, ఆ పెద్దారవీడు కూడ బ్రాహ్మణాగ్రహారముగా భావించ వీలున్నది. కొలను ప్రతాపరుద్రుని మెప్పించి ప్రోలయ అన్నయ మంత్రి సాధించిన అగ్రహారమున కరియేడన్న పేరు స్మృత్యర్థకమా? స్పష్టత కొరకు ముందుగా ఇతరత్రా ఉన్న ఆరవీడు (నెల్లూరు జిల్లా), ఆరుట్ల (ప్రకాశం జిల్లా) వంటి పేర్లున్న గ్రామములు కూడ అగ్రహారములగునో పరిశీలించవలసి ఉన్నది.

శ్రీనాథయ్య అరియేటి, అరేటి అని మాత్రమే వాడగా, నేడా అగ్రహారము "ఆరేడు" 'దీర్ఘయుతము'గా పలుకబడి. ఛందోభంగము లేని ఉపజాతి పద్యములలో కూడ శ్రీనాథయ్య హ్రస్వరూపమెందుకు వాడెనో విచారణీయము. అర, ఆర రెండూ ఒకటేయగునా? పెద్దారవీటి చెంత అరద వీడున్నట్లు ముందే చెప్పబడినది. ఆ పేరులో కన్పించే "ద" ప్రత్యయము కన్నడభాషకు చెందినది. ప్రకాశం జిల్లా ఒంగోలు దిగువనున్న (ఆకుల) అల్లూరు, అచ్చట దొరికిన శాసనమొక దానిలో, "అరలూరు"గా పిలువబడినందున, అందులో బహువచన సూచకమైన "ల" కన్పించినందున, అదొక ఏక (అరపేరిట) జాతివారి ఆవాసంగా భావించ వీలగును. నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాలందు మరి నాల్గు అల్లూరులున్నాయి. అర్దవీడువలె అద్దంకి అరద+అంకి అయ్యే అవకాశమొకటున్నది.

(అరియేటి) ప్రోలయ అన్న శౌరి "కాకతిక్ష్మాపాల గంధ దంతావళ ధ్వజినీ మహాదురంధరుడు", "ఆంధ్రభూమండలా ధ్యక్షసింహాసన ప్రతిష్ఠాపనాచార్యుడు"తో పాటు "వీరరుద్రుని దక్షిణ భుజా పీతము'' వంటి వీరోచిత బిరుదులతో పైకెత్తపబడిన వాడు కాగా అందుకు తీసిపోని విధముగా ఆయన కొడుకునకు "సంగర సవ్యసాచి", "ధూర్జటి పోలిక", ఇత్యాదులు దక్కినవి. ప్రోలయ మంత్రి మరొక కొడుకైన అల్లాడ మంత్రికి "రిపుహృద్భల్లాడంబరుడగనూ, అతని ''భుజాటోపములు'' దిక్కుల నల్లాడ చేసెడివిగానూ వర్ణించబడెను. అన్నయమంత్రి "కంఠీరవ విక్రముడు", "జగజెట్టి", "అరట్టహయ ధట్ట సేనాఘట్టిత రిపు పట్టణోప కంఠక్షితి", "చెంచుమల చూరకార" ఇత్యాది ప్రశస్తులతో పొగడబడిన వాడు. ఇవన్నీ పరిగణించితే ఆ పరంపరంతా ప్రత్యక్షముగా ముఖాముఖి యుద్ధములందు పాల్గొని, ఎదుటి పోటరిని స్వయముగా సంహరించినవారని చెప్పగలము. ఇందుకూతముగా లింగయ మంత్రి పోరాటరీతిని వర్ణించిన ఈ క్రింది పద్యము చెప్పవచ్చును.

**నిష్ఠురాటోపవిస్ఫూర్తి నృహరి కరణి**
**సతి కఠోర కుఠార ధారా చలమున**
**వైరి వక్షస్థలంబు వ్రచ్చివైవ నేర్చు**
**సంగరార్జునుదరియేటి లింగ విభుడు.**

నరహరి పోలిక, వైరివక్షస్థల విదారము, కుఠారి ప్రహారము ఇత్యాదులు గమనించితే అరియేటి వారికి శత్రు ప్రత్యక్ష సంహారము వారికి పరిపాటైన కేళిగా తెలుస్తున్నది. సాధారణ నియోగికది సాధ్యము కాని పని. కుఠారధరుడైన పరశురాముని, ఖండ పరశుధారైన శివునితోగాక నరసింహునితో పోల్చి చెప్పుటలో కవి చెప్పక చెప్పెడిది, గుండె ఝల్లుమనిపించే హృదయవిదారక దృశ్యమే.

ఈ సందర్భములో (కర్ణాటక) గదుగలోని వీరనారాయణా లయమందలి ముఖ మంటప స్తంభమునకు

చేరబడి కూర్చుండి ఏక దీక్షతో ఏడాదిపాటు "కన్నడ భారత కథామంజరి"ని రచించిన, కుమార వ్యాసబిరుదాంకితుడైన, నారణప్ప, తత్కృత్యాదిలో, తన వంశీయుల "వీరద్విజ" స్వభావమును చెప్పిన పద్యభాగము గమనార్హము. ఆ నారణప్ప వీరనారాయణ దేవ పదపద్మారాధకుడు. ఆగదుగ, పొరుగు బట్టకెరెతో చేరి, ఒక జమిలి బ్రాహ్మణాగ్రహారముగా క్రీస్తు తదుపరి పదవనూరేడు నాటికే ప్రసిద్ధము. అనతి దూరములో "తిలవళ్ళి" పేరుతో మరొక వీరద్విజాగ్రహారమున్నది. ఆ అగ్రహారీకులు కూడ వీరనారాయణుని నమ్మి కొలిచినవారు. అచ్చటిదే ఒక శాసనమందా వీరద్విజులు "రిపుకుల కుముదినీ మార్తాండులు", "శరణాగత వజ్రపంజరులు" ఇత్యాది బిరుదాన్వితులు. కర్ణాట-మహారాష్ట్ర సరిహద్దులందలి బీదరు, బిజాపూరు, గదుగ జిల్లాలలో అట్టివే పెక్కు శాసనములున్నవి. అరియేటి ప్రోలయాదులు కొందరా వీరద్విజవాసన గలవారు. ఆ ప్రాంతము నుండి క్రమముగా శ్రీశైల పాదభూమి చేరి అచ్చటి నుండి కొలను, ద్రాక్షారామ ప్రాంతములకు జరిగినవారు కావచ్చును.

"అరము" అంటే చక్రాయుధము లేక కొడవలివలె వాడిగల ఆయుధము. "అరాళ" మంటే "వంపు తిరిగిన" అన్న అర్థమున్నది. పాము చుట్ట చుట్టుకొనెడిది కనుక తమిళ పరముగా దానిని "అరమ్"గా పిలచిరి. "ఆరె" అంటే "కొంకి" వంటి లోహసాధనము. ఏదో ఒక చెట్టు మ్రానుని పెనవేసుకొంటూ పై కెగబ్రాకెడి "ఆరెదొండ" తీగపొదవునా, పృథ్వీముఖమైన, కొంకెలవంటి ముళ్ళున్నందున, ఆ హరితమును పశువులాసించవు. "ఆరె" అన్నది చర్మకారుని కట్టుసాధనము కూడా. చర్మపు అట్టల గుండా ఆరెను దిగగ్రుచ్చి, దానితో దారపు మెలికెను పైకి లాగుతుంటే హిరణ్యకశిపుని పొట్ట మూలల నుండి కుళ్ళగించి పైకిలాగిన ప్రేగులు తలపునకు రాగలవు. బహుశా అరియేటి లింగయ్యను నరహరితో పోల్చడము వెనుక కారణమిదేనేమో? తదుపరి కాలములో మరాఠా సింహముగా పిలువబడిన శివాజి కృతకమైన ఇనుప పులి గోళ్ళతో శత్రువుని చీల్చి చంపిన ఉదంతము చరిత్ర విదితమే.

అర లేక ఆరె ధాతువుతో చేరిన పలుగ్రామ నామములు శ్రీశైల శాసనములో కనిపించిన కర్నాటి సీమ, దాని పరిసరములందు తగిలినవి. కర్నాటి ప్రాంతములో నేటికినీ నిలచి, వాడబడెడి "వేట కొడవలి" ప్రయోగమునకు, ప్రహారమునకు పనికి వచ్చెడివే. అవి చివరలందు "అరె"ని పోలినవే. క్షుణ్ణముగా విచారించి తేల్చవలసి ఉన్నా ఈ కర్ణాటములోనికి ఎగువ నుంచి వీరబ్రాహ్మణుల వలసలు సూచితము. గదుగకు కొంత ఉత్తరదిశలోని కరవీరపురము (కొల్హాపూరు)లో "కర", "వీర" పదములన్నవి. అది కరహాట ప్రాంతాంతర్గతమే.

ముందుకు జరిగే ముందు తీరాంధ్రముపై కర్ణాట ప్రభువుల ఆధిపత్యము గురించి కొంత తెలుపవలసి ఉన్నది. నెల్లూరు జిల్లా (అల్లూరు మండలము)లో తలమంచి వద్ద దొరికిన (పశ్చిమ) చాళుక్య (మొదటి) విక్రమాదిత్యుని తామ్రపత్ర శాసనము క్రీస్తు తదుపరి 668వ సంవత్సరము నాటిది. కర్ణాటక నుండి నడచిన వర్తకులు ములువాయి (నేటి ములుబాగిలు) ద్వారా ములికి నాటిలోకి వచ్చి, అందలి ములుము దారివెంట చిట్టడవులు దాటి, ములుమూడి వద్ద పెన్నానది తీరమును తాకి ఆ సమీపములోని ప్రభగిరి పట్టణము రేవులో తీర వ్యాపార లావాదేవీలు జరుపుకొన్నట్లు కొన్ని దాఖలాలున్నవి. బాదామి చాళుక్యులు తమ పూర్వీకులు పెద్ద ముడియములో ఉండిన రోజుల నుండి, పెన్నా తీరంలో జరిగిన వస్త్ర వ్యాపారముపై వారు అజమాయిషి చేసిన దాఖలాలున్నవి. తలమంచి తామ్రపత్ర శాసనములోని దానగ్రహీత ఏ ప్రాంతమునకు చెందినవాడో తెలియరాకున్నది. ఆయన సర్వశాస్త్ర పారంగతుడు.

నెల్లూరు పట్టణము, ఆ సమీపములోని కొడవలూరులందు దొరికిన మరికొన్ని శాసనములందు సాయన ఒడయులన్న (కర్ణాట) రాజప్రతినిధి దయచేయించిన దాన శాసనములు క్రీస్తు తదుపరి 14వ సూరేడులోని తదుపరి సగము నాటివి. (అంతకు క్రితమా నెల్లూరు ప్రాంతము కాకతీయ ప్రతాపరుద్రుని క్రింద ఉండినది). నెల్లూరు, కొడవలూరులందు రావలసిన వ్యాపార, సంతసుంకముల ప్రసక్తాశాసనము లందున్నది. సాయన ఒడయులు, పూర్వ పశ్చిమ సముద్రాధిపతిగా చెప్పుకొన్న కంపన ఒడయుని ప్రతినిధి. కంపని ఆ బిరుదును బట్టి, వారు పూర్వాంధ్రతీర వ్యాపారముపై పట్టు సంక్రమించు కొన్నట్లు తెలియగలము.

రెండవ హరిహరరాయలు బిట్రగుంట చేరువలోని (జలదంకి మండలము) బ్రాహ్మణక్రాక గ్రామము నగ్రహారము చేసి దానమిచ్చెను. జలదంకిలో దొరికిన కొన్ని శాసనముల ద్వారా, అదొక తీర వ్యాపార కేంద్రమని తెలియగలము.

రెండవ హరిహరరాయలు బిట్రగుంట చేరువలోని (జలదంకి మండలము) బ్రాహ్మణక్రాక గ్రామము నగ్రహారము

చేసి దానమిచ్చెను. జలదంకిలో దొరికిన కొన్ని శాసనముల ద్వారా, అదొక తీర వ్యాపార కేంద్రమని తెలియగలము. జలదంకి పేరులో కన్నడ ప్రత్యయము "ద" ప్రద్యోతము. ఉత్తరాంధ్రలోని చొల్లంగి, పోరంకి, పోణంగి ఇత్యాదులందీ ప్రత్యయము లేదు. ఇంకా జలదంకి కనతి దూరమందలి బట్టరకాలుగొల్లులో కూడ కన్నడ ఛాయ ఉన్నది. అది అలనాటి బ్రాహ్మణాగ్రహారము కాగలదు. బిట్టగుంట, బీరమగుంట వంటి పేర్లలో కూడ వ → బ మార్పు ఆ భాషానుసారమే.

సమీప నాగులవరపు తామ్రపత్ర దాన శాసనము కృష్ణదేవరాయలు దయచేయించినది.

కాళహస్తిలో దొరికిన రెండు కన్నడ శాసనములు అచ్యుతదేవరాయ లిప్పించినవి. అందులో దుగ్గరాజ పట్టణరేవును తాకెడి "కప్పలి" (పెద్దఓడ)లపై వచ్చెడి సుంక ప్రసక్తి కలదు. నెల్లూరు జిల్లా శాసన సంపుటిని పరికించితే అందు తగిలే తామ్రపత్ర శాసనములందు రాజభాగము కర్ణాట ప్రభువులు దయచేసిన అగ్రహార దానములే. తీరాంధ్ర వ్యాపారముపై పట్టుబిగించి బహుకాలము సాగిన ఆ వ్యాపార లావాదేవీలకై వారి నమ్మిన నియోగులు తీరాంధ్ర భూమికి వలస వచ్చినారనవచ్చును. వారంతా గుండ్లకమ్మ పర్యంతమైన పాకనాటిలో నెలకొన్నవారు.

ఇవి కేవలము ఊహలు మాత్రము కావు. అంతకంటే మెరుగైన చూచాయలు. నిగ్గుతేల్చలేని నిజములు.

ఈ పూర్వరంగమంతా మదిలో నుంచుకొని పరికించితే విరూపాక్షరాయల శాసనములో కన్పించిన కర్నాదు శ్రీనాథయ్య బాల్యము గడిపిన చోటు కాదు. ఏమంటే ఆ కర్నాదు పూర్వసముద్రపుటంచున లేదు. మధ్యలో మోటవాడి, పాకనాటి సీమలిరికినవి. కాల్పట్టణానుభవము తొలగిన తదుపరి మారయ్య మంత్రి ఈ కర్నాటి సీమకు వచ్చి చేరియుండ కూడదా అనుకొందామంటే, అవచి తిప్పయబాల్య సఖ్యత, కందుకూరి దొరల వదాన్యతపై నడచిన దినవెచ్చములు పొసగవు. కాన ఆయన కర్ణాట పలుకులు నేర్చిన సీమకై తీరాంధ్రభూమిలోనే వెతకవలసి ఉన్నది.

గుండ్లకమ్మ హద్దుగా ఉన్న పాకనాటిని దాటి ఉత్తరమున కెగబ్రాకితే, కర్మక్షితి, కర్మరాష్ట్రము, కమ్మనాడు ఇత్యాదిగా పిలువబడిన ఒక సీమ తగులుతున్నది. అందలి కండ్లకుంట (క్రీస్తు తదుపరి 1203) శాసనము (ఇంకనూ మరికొన్ని) ప్రకారము ఆ కమ్మనాటి సీమ బహుకాలము కాకతీయ పాలనలోనిదిగా తెలుపగలము. తదుపరి (క్రీస్తు తదుపరి 1425వ సంవత్సరము) నాటికా ప్రాంతము కర్ణాట పాలకులైన వీర విజయ బుక్కరాయలు, వీరదేవరాయల అజమాయిషీ క్రింద ఉండినట్లు కనుపర్తి (నాగులుప్పలపాడు మండలము) శాసనము ద్వారా తెలియగలము. కనుపర్తిలో దొరికిన శాసనములను బట్టి అదొక వెయ్యిలింగముల నెలవని, కోశాంబిక, కనకపురమన్న మారుపేర్లతో పిలువబడ్డ పట్టణమని తెలియగలము. అది గుండ్లకమ్మ ఎడమగట్టుపై, దాని ముఖద్వారమున కనతిదూరములో ఉన్నట్లు కూడ చెప్పబడినది. కోశాంబికాది నామములనుబట్టి అచట ధనాగారముండినదిగా కూడ విదితము. అంటే అచ్చటి తీరవ్యాపారముపై అజమాయిషి నెరపిన పాలనాకేంద్రముగా భావన. అచ్చట కర్ణాట ప్రభువుల ప్రతినిధి నెలవుండెను. అది అద్దంకి సమీపములోనిది.

మరికొంత దిగువలో సీమాకేంద్రమైన అమ్మన బ్రోలున్నది. దానికుత్తరముగా మోటుపల్లి రేవున్నది. అచ్చట కాకతీయ గణపతి దేవునిది, తదుపరి కాలమునాటి దేవరాయల శిలాస్తంభ శాసనములున్నవి. ఆ రేవునకెగ్గు కలిగించే సముద్రపు దొంగల కట్టడి కర్ణాట ప్రభువుల అనుయాయులైన కందుకూరు రెడ్డి దొరలదిగా ఎఱ్ఱాప్రెగడ వ్రాతలవల్ల తెలియగలము. అమ్మనబ్రోలు కెదురుగా గుండ్లకమ్మ కుడిగట్టు పైనున్న ''కరువది'' ఒక బ్రాహ్మణాగ్రహారము. క్రీస్తు తదుపరి 1310వ సంవత్సరము నాటి ఒక శాసనములో కాకతీయ ప్రతాపరుద్రుని పాలనాకాలము నుటంకించి, అచ్చటి టోకు వ్యాపారము, దానిపై దక్కెడి సుంకముల గురించి చెప్పబడినది. వీటన్నింటినిబట్టి కనపర్తి ప్రాధాన్యత విశదము కాగలదు.

కరువది ఒక బ్రాహ్మణాగ్రహారము. ఆ పేరు శ్రీశైల పాదభూమిలోని కర్నాటి సీమలో తగిలిన కరువెన అగ్రహారమును తలపుకు తేగలదు. కరువది బ్రాహ్మణులదొక ప్రత్యేకమైన తెగ. వారు ధృడోన్నతకాయులు. నిన్న మొన్నటివరకు వారిలో చాలమంది సువర్ణముఖి పర్యంతము దినమొక ఊరన్నట్లు పర్యటించి "ఉపనయనము నాటిమాట" పాటించి భిక్షాటనతో ప్రొద్దులు గడిపినవారు. ఇద్దరు శ్రమించెడి రైతు కూలీలు తినెడి భోజనము ఒకకరవది బ్రాహ్మనయ్య కుక్షి సామర్థ్యము. వారిచే ''తృప్తాస్మా''

అనిపించడము వీలుకాని పనిగనుక వారినెవరూ బ్రాహ్మణార్థమునకు పిలువరంటే సంగతి విశదమౌతుంది.

ఈ కర్మనాటి నుండి దొడ్డ కర్ణాటకకు కొన్ని ఎదురు వలసలు సంభవించినవి. ఆ కర్ణాటకలో నేటికిన్నీ "కమ్మె" బ్రాహ్మణులన్న గుంపొకటున్నది. కన్నడ కవిరత్నత్రయముగా విఖ్యాతిగాంచిన వారిలో పంప, పొన్నయ్యల తొలినేల కమ్మనాడే. పంపని ముత్తాత వంగిపర్రు (బాపట్ల ప్రాంతము) నుండి వలసపోయి కర్ణాటకలో స్థిరపడినట్లుగా, పంపని సోదరుడైన జినవల్లభుడు, తన సామంతములోని కుర్కియాల (కరీంనగరం జిల్లా) సమీపములో బొమ్మలగుట్టపై నిలిపిన శిలాస్తంభ (త్రిభాషా) శాసనములో చెప్పెను. ఆ శాసనములో సంస్కృత, కన్నడముల సరసన మూడు కంద పద్యములు తెనుగులో చెప్పబడినవి. అందులో కొన్ని అపురూపమైన తెనుగు పదములున్నవి. పొన్నకవి తన శాంతి పురాణములో తాను పుట్టినది ఉపమాతీతమైన కమ్మనాటి పుంగనూరనెను. తదుపరి కాలములో (బహుశా కందుకూరు దొరల మారి సత్తుతో) పిల్లల మర్రి పినవీరభద్రయ్య, కందుకూరు రుద్రయ్యలు కర్ణాటకాస్థానములకు చేరిరి.

కర్మ రాష్ట్రము పేరులో కనిపించే "కర్మ" సంస్కృత పదము కాదు. అదొక నాటు పదము. పెరు × కరు అన్న వ్యతిరేకార్థ పదములు వరుసగా పెద్ద, చిన్న అనెడి అర్థములనిచ్చును. పెరు →పెరుమ (పెరుమారెడ్డి, పెరుమ్, పుదూరు), →పెమ్మ (పెమ్మసాని)లుగా మారినటులే కరు →కరుమ (పలుకుబడిలో కర్మ)→ కమ్మగా మారినది అనవచ్చును. అంటే ఆ కమ్మనాడు పూర్వ సముద్రతీరమందలి మరొక కరునాడు కాగలదు. ఈ ప్రతిపాదనకు బలమునిస్తూ, ఆ సీమలోని కనపర్తి కరవది అన్న పేర్లతో "కర, కన అనెడి ధాతువులున్నవి. కోశాంబిక అన్న మారుపేరు కరూరును పోలినదే.

కమ్మనాటిలో కారముచేడన్న గ్రామమొకట్నుది. ఇది కరమచేడుగాకాక దీర్ఘయుతంగా పిలువబడుతున్నది. అరేడు ఆరేడయినట్లే కారముచేడు కూడ రూపాంతరమని భావించతగును.

పై ఏకరువంతా ముక్తాయించితే

1) కరుమనాటిలో ఆధిపత్యము పోయిన వెంటనే కర్ణాట పాలకులు కాలువెూపిరి. వారి కన్ను అందలి తీరవ్యాపారముపైనే సారించినది.

2) శ్రీనాథయ్య, ఆరేటి మంత్రులవలె వీరద్విజుడు కాదు. కలముపట్టిన నియోగి. బహుకాలము పాకనాటి నివాసి. ఆయన వాడినది గజకర్ణాట (కన్నడ) భాషగా చెప్పలేదు. ఆ భాషలో ఆరేటివారే నిష్ణాతులు. ఆయన కొండవీటి వారి కొలువులో ఉండి కరుమనాటి మాండలికములతో సంపన్నుడాయెను. రాజమండ్రి వారి ప్రాపుకై కరుమనాడు వీడిన క్రొత్తలలో ఆయన రచించిన కాశీఖండము, భీమేశ్వర పురాణములను బాగా పరికించి అందులో కరుమనాటి మాండలిక ఛాయలను తేల్చగలిగితే ఆయనవాడిన కరునాటి భాష స్వరూపము నిర్ణయింపవచ్చును. ఆయాచితముగా తాను రచించిన పల్నాటి భారతము కూడ పరిశీనార్హము. ఆ కథావస్తువునకు పూర్వ రంగము కరుమనాటితో ముడివడి ఉన్నది.

3) శ్రీనాథ కవి పలు ఉపజాతి పద్యములు రచించెను. కొద్దిపాటి జాతి కందములందు, కన్నడ భాషలో కనరాని, యతి నియమమును పాటించెనంటే అది గజ కర్ణాట భాష కాదు. కన్నడములో విశేష ప్రాచుర్యమున్న షట్పది (పెనుకంద పద్యము) నెచ్చటా వాడలేదు.

4) తనను కోరిన అన్నయ మంత్రి మెరమెచ్చుకై, అరేటి వారి తల్లిపలుకైన గజకర్ణాట భాషను స్మరించే ధ్యేయముతో తన కరుమనాటి శైలిని కర్ణాటభాషగా పిలచి కూడ ఉండవచ్చును.

మరొక ప్రతిపాదన. కనుపర్తి (తెనుగు → తెలుగువలె) కలపరితిగా పిలవబడవచ్చును. ఇంకా కారమచేడు, ఆరేడులందువలె దీర్ఘము సంతరించుకొని "కాలపరితి"గా కూడ వ్యవహృతము కాగలదు. ఛందోపయుక్తముగా అదే కాల్పట్టణముగా పిలువబడినదో కూడ పరిశీలనార్హము.

కనుపర్తిలో కాకతీయుల పతనానంతరము నెలకొన్న కర్ణాట రాజుల ఆధిపత్యమునుబట్టి, కాలపరితపై కమలనాభయ్య నియోగము తొలగి వేరొకరిది మొదలైనదిగా భావించుటకు వీలున్నది. పాకనాడు, కమ్మనాడులలో కర్ణాటక ప్రభువుల ప్రాతినిధ్యము సాగించి, మోటుపల్లి ప్రాంతములో సముద్రపు దొంగల నరికట్టిన కందుకూరు దొరలు శ్రీనాథయ్య కుటుంబమునకు దినవెచ్చము లిచ్చుటకిదే పూర్వరంగమో విచారించదగి ఉన్నది. మి

# పరుసవేది

## ఆరోహణ-6



జె. బ్రొనొస్కి

వేడిచేసి లోహాలను కరిగించిన తర్వాత, రెండు లేక అంతకన్నా ఎక్కువ లోహాలను కలిపి మిశ్రమధాతువులను సృష్టించే దిశగా ప్రయోగాలు జరిగాయి. ఇనుము, రాగి వంటి లోహాలను తొలిదశలో వేర్వేరుగానే ఉపయోగించారు. గ్రహశకలాల నుండి రాలిపడిన యినుము, నేలమీద సహజసిద్ధంగా లభిస్తుంది. బహుశా అందువల్లనే, సుమేరియన్లు దీన్ని "ఆకాశం ప్రసాదించిన లోహం" అన్నారు. ఉత్తర అమెరికాలోని ఇండియన్లు కూడా దీన్నే ఉపయోగించారు. ఇదంతా జరిగింది-లోహాలను కరిగించడం తెలియని తొలి రోజుల్లో.

ముడిఖనిజం నుండి ఇనుమును వేరు చెయ్యటం, రాగిని వెలికి తియ్యటంకన్నా క్లిష్టమైన ప్రక్రియ. ఇనుము ఆవిష్కరణ తరువాతి దశలో జరగటానికి యిదే కారణం. పిరమిడ్లలో తొలిసారిగా యినుప పనిముట్లు కనిపించాయి. అంటే కనీసం క్రీ.పూ 2500 నాడు అన్నమాట. అయితే, ఇనుము విస్తృతంగా వాడుకలోకొచ్చింది హిట్టైట్లకాలంలో (క్రీ.పూ. 1500 ప్రాంతం).

రాగి మిశ్రమధాతువు ఇత్తడి అయినట్లే, ఇనుము మిశ్రమధాతువు స్టీలు. క్రీ.పూ. 1000 నాడే ఇండియాలో దీన్ని వాడారు. ఆ నాటి అద్భుత నిర్మాణాలే దీనికి నిదర్శనం. అయినప్పటికీ, స్టీలు అందరికీ అందుబాటులోకొచ్చింది. యిటీవలే-200 సంవత్సరాల క్రితం మాత్రమే. షెఫీల్డులో ఒక చిన్న స్టీలు పరిశ్రమను ప్రారంభించాడు. గడియారం స్ప్రింగుకోసం లోహాన్ని నిర్ధారించే క్రమంలో క్వేకర్ బెంజిమన్ హంట్‌మాన్ స్టీలును కనుగొన్నాడు.

రాగి, సుమారు $1000^0$C ఉష్ణోగ్రత వద్ద కరిగితే, ఇనుమును కరిగంచటానికి అదనంగా మరో $500^0$C ఉష్ణోగ్రత అవసరమవుతుంది. కాని, 1% కన్నా తక్కువ కార్బన్‌తో కలిసి స్టీల్ తయారవుతుంది. క్రీ.శ. 800లోనే జపాను వాళ్లు, (సమురాయ్స్) స్టీల్ ఖడ్గం ధరించారు.

ప్రపంచ పురోగతికి భౌతికంగా, లోహాలే కీలకం. అయితే, అనేకదశలలో, రసవాదం (ALCHM\EMY) కూడా ముఖ్య భూమిక పోషించింది. దీని గురించి ఊహాపరంగానే విరివిగా ప్రచారంలో వున్నప్పటికీ, రసవాదులు (ALCHEMISTS) కృత్రిమంగా బంగారం తయారు చెయ్యటానికి చాలా ప్రయత్నించారు.

లోకంలోని, అన్నిదేశాలు, అన్ని నాగరికతలూ, అన్ని కాలాలలో బంగారాన్ని అపురూపంగా చూశారనటంలో సందేహంలేదు.

స్పానిష్ వాళ్ళు, బంగారం కోసమే పెరూను కొల్లగొట్టారు. ఇదొక్కటే అనేమిటి, అనేక దేశాలమీద శత్రువుల దండయాత్రల ప్రధాన ఉద్దేశం బంగారాన్ని దోచుకోవటమే.

సహజసిద్ధమైన బంగారాన్ని స్వంతం చేసుకోవటమేగాక, యితర లోహాలనుండి, బంగారాన్ని తయారు చేయటానికి కూడా ప్రయత్నాలు కొనసాగాయి. (ఇదే ఆల్కెమీపేర పరుసవేది లేక రసవాదం). రెండువేల సంవత్సరాలనాడే చైనాలో లోహకారులు ప్రయోగాలు ప్రారంభించారు. స్వర్ణ సేవనం వలన ఆయుర్దాయం పెరుగుతుందని కూడా వాళ్ల నమ్మకం. నిత్యయవ్వనానికిది అవసరం అని ఆనాటి 'శాస్త్రాలు' చెప్పాయి. "దీని వల్ల మనిషి మృత్యువును జయిస్తాడు."

తెలుగు : ముక్తవరం పార్థసారథి, ఫోన్ : 9177618708

'ఆల్కెమీ' కేవలం ట్రిక్కులు, మాజిక్కులు మాత్రమే అనుకోవటానికి లేదు. ప్రకృతి గురించి వాళ్లకున్న అవగాహన కూడా ఈ ప్రయోగాలను బలపర్చింది. వాళ్ల దృష్టిలో అగ్ని పర్వతమంటే బొబ్బలాంటిది. వర్షం అంటే కన్నీరు. ఈ పోలికలతో శరీరమే ప్రకృతికి ప్రతిరూపం అనే నమ్మకం కూడా బలపడింది. ప్రకృతి సూత్రాలన్నీ శరీరానికే వర్తిస్తాయి. భూమి మీద దొరికే పదార్ధాలు, ధాతువులన్నీ శరీరంలో వున్నాయి. (దేహం పాంచభౌతికం గద!) పాదరసం, గంధకం రెండే ప్రకృతి మూలధాతువులని మధ్యయుగాల నాటి నమ్మకం. మనిషి శరీరంలోనూ వున్నాయివి. ఇంతరలోహాలన్నీ, ఈ రెండు ధాతువుల సాయంతో భూమిలోపలి పొరల్లో ఏర్పడుతుంటాయని కూడా వారి నమ్మకం – (పిండం నుండి శరీరం ఎదిగినట్టుగా) ఒక రకంగా, ఈ పోలిక మనం కూడా అంగీకరిస్తున్నాం. అల్కెమీలో రాగి (మృదువైన లోహం)ని 'వీనస్'గా గుర్తిస్తారు. అంటే స్త్రీ. ధృఢమైన ఇనుముకు సంకేతం మార్స్. (మనకు వీనస్ అంటే శుక్రుడు. అంగారకుణ్ణి 'మార్స్' అంటాం.)

ఈ సిద్ధాంతాలన్నీ మనకిప్పుడు మూర్ఖప్రేలాపనలా కనిపిస్తాయి; కాని అన్ని సిద్ధాంతాల వెనకా కొన్ని విశ్వాసాలూ, కట్టుకథలూ వుంటాయి. అయిదు శతాబ్దాలక్రితం ఈ సిద్ధాంతం సమకాలీన సమస్యలను పరిష్కరించింది– కనీసం ఆ దిశగా వుపకరించింది. ఆ నాటి చికిత్సా విధానంలో మొక్కలు, మూలికలు, జంతువులదే ప్రధానపాత్ర.

ఆ దశలో, ఆల్కెమిస్టులు, ఖనిజాలను, తొలిసారి, చికిత్సావిధానంలో ప్రవేశపెట్టారు. 'ఉప్పు' గురించి తెలిసిన తర్వాత దాన్ని మూడవ ధాతువుగా నిర్ధారించారు. ఆ దశలోనే, ఒక భయంకరమైన సుఖవ్యాధి సిఫిలిస్‌కు 'పాదరసం' ఒక్కటే విరుగుడు అన్నారు వైద్యులు. ఆధునిక కెమిస్ట్రీని, అయాటో కెమిస్ట్రీని, బయోకెమిస్ట్రీల ప్రాగ్రూపమే ఆల్కెమీ. 1527లో ఈ శాస్త్రాధ్యాయానికి కేంద్రం స్విట్జర్లాండులోని బేసెల్. మార్మిక, వూహాజనిత జ్ఞానం నుండి, హేతుబద్ధమైన, శాస్త్రనిరూపణలపై ఆధారపడిన జ్ఞానం వైపు అడుగు వేసిన మహానుభావుని పేరు పారాసెల్సస్. (ఈయన అసలు పేరు చాంతాడంత పెద్దది: ఆరియోలస్ ఫిలిపస్ థియోఫ్యాస్టస్ బంబాస్టస్ వాన్ హొహెన్‌హీం.) 1493లో జూరిక్‌లో జన్మించి 1541లో మరణించాడు.

సరైన రోగనిర్ధారణ వల్లమాత్రమే సరైన చికిత్స జరుగుతుందన్నాడు పారాసెల్సస్. ఆనాటి మూఢనమ్మకాల వైద్యులు పెదవి విరిచిన అనేకమంది రోగులకు తన శాస్త్రజ్ఞానంతో ప్రాణభిక్ష పెట్టాడు. 1527లో, ఏవిసెన్నా (ఈయన అరబ్బు జాతీయుడు. అరిస్టాటిల్ అనుయాయి.) రాసిన వైద్యగ్రంథాన్నొకదాన్ని మంటల్లోకి విసిరేసి చరిత్ర సృష్టించాడు.

అగ్ని గురించి యిక్కడ ప్రస్తావించ వలసిన అవసరముంది. పదార్ధ స్వభావాన్ని అర్థం చేసుకోవటానికి అగ్నిపరీక్ష అవసరమని నమ్మాడు ఆల్కెమిస్టు. అయితే అగ్ని కూడా ఒక పదార్ధమా? ఈ వాదనను అంగీకరిస్తే, 'అగ్ని'కి అనేక లక్షణాలున్నాయని కూడా అంగీకరించాలి. ఉదాహరణకు అగ్నికి బరువుంటుందా? కొన్ని పదార్ధాలకు స్వయం జ్వలన శక్తి వుంటుందని నమ్మాడు, మధ్యయుగాల ఆల్కెమిస్టు. కాని, ఏ జీవికీ / పదార్ధానికీ స్వయంజ్వలన శక్తి వుండదు. ప్రాణంలాగే 'అగ్ని' కూడా పదార్థం కాదు. స్వయంజ్వలన శక్తి సిద్ధాంతాన్ని ('PHLOGISTON') అంటారు. అగ్ని అనేది ఒక పరిణామ ప్రక్రియ. దానివలన పదార్థ స్వభావం మారుతుంది. అగ్ని కూడా ఒక ప్రక్రియ అని గ్రహించిన తదనంతరమే రసాయనశాస్త్రం గురించిన శాస్త్రీయ అవగాహన పెరిగింది.



**Adoration of Magi Birth of Time**

"శాస్త్రీయ ఆలోచనా విధానానికి వెనుక చూపుండదు. గతంలో ఒకప్పుడు స్వర్ణయుగముండేదని నేను నమ్మను" అన్నాడు పారాసెల్సస్. మరో రెండువందల యాభై ఏళ్ల తర్వాతగాని, అగ్నికీ, ఆక్సిజన్‌కూ వున్న సంబంధాన్ని అర్థం చేసుకోగలిగారు. ఈ ఆవిష్కరణకు మూలం ఇంగ్లండులోని బర్మింగ్‌హాంకు చెందిన జోసెఫ్ ప్రీస్ట్లే, సూర్యకాంతిలో మొక్కలు ఆక్సిజన్ పీల్చు కుంటాయని కూడా ప్రకటించాడు. ఇది ఒక కీలకమైన సమాచారం. మొక్కలు లేకపోతే, అవి ఆహారంగా బతికే జంతువులు కూడా వుండవని 1770లలో ఎవరూ వూహించలేదు.

1803లో మాంచెస్టర్‌కు చెందిన జాన్‌డాల్టన్, అప్పటికే లవాసిమెర్ చేసిన రసాయన శాస్త్ర ప్రయోగాల ఆధారంగా, అణుసిద్ధాంతాన్ని (ATOMIC THEORY) ప్రతిపాదించాడు: ఆక్సిజన్, హైడ్రోజన్ కలిస్తే నీరు ఏర్పడుతుంది. కాని, ఈ రెండు వాయువులూ ఒకే స్థిరపరిమాణంలో ఎలా కలుస్తాయి? ఏ సూక్ష్మపరిమాణాలలో (ATOMS) ఈ సంయోగక్రియ జరుగుతుంది. వగైరా సంబంధిత అంశాల గురించి పరిశోధన కొనసాగించాడు. కాని శాస్త్ర ప్రయోగాలు సరళరేఖలో కొనసాగవు. యాభైఏడేళ్ళపాటు డాల్టన్ వర్షపాతం గురించి, శీతోష్ణపరిస్థితుల గురించి, వాతావరణ మార్పుల గురించి హేతుబద్ధమైన సమాధానాల కోసం అన్వేషించాడు. చివరికి, 'అణుపరిమాణం'లో వాటిని అర్థం చేసుకున్నాడు.

**'ఆరోహణ'లో గణిత శాస్త్రం:**

గణితశాస్త్రమంత మేధోపరమైన రంగం మరొకటిలేదు. ఊహాశక్తిలో, మార్మికానుభవంలో, హేతుబద్ధతలో వెరసి మానవప్రగతిలో దీని పాత్ర అత్యంత విలక్షణమైంది. ప్రకృతిని అర్థం చేసుకోవాలన్నా, విశ్లేషించాలన్నా యిది అవసరమే.

అత్యంత ప్రాచీన సమాజాలలో కూడా అంకెలు వాడుకలో వున్నట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. నాలుగుకన్నా ఎక్కువ లెక్కపెట్టలేని దశలో కూడా, రెండూ రెండూ కలిస్తే నాలుగన్న అవగాహన వుంది. ఆ ప్రాథమిక జ్ఞానం ఆధారంగానే అభివృద్ధి చెందింది సంఖ్యాశాస్త్రం. భాష, లిపిలాగా, గణితం కూడా అనేక పరిణామ దశలు అధిగమించింది. బాబిలోనియన్లు, మాయన్లు, ఇండియన్లు అత్యంత ప్రాచీన కాలంలోనే గణితంలో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించారు.

ఆదిమదశల గురించి మనం మాట్లాడు కొంటున్నపుడు 'గణితం యిక్కడ, ఈ దేశంలో, ఈ కాలంలో ప్రారంభమైందని' నిర్ధారించటం అసాధ్యం. మాటలతో పాటే లెక్క పెట్టటం కూడా నేర్చుకున్నాడు మనిషి. అత్యంత ప్రాచీన గాథలలో భాషతోపాటే గణితం కూడా మిళితమై వుంటుంది. ఒక రకంగా, అంకెల హేతుబద్ధ అవగాహనే గణితం.

గణితమూలాల గురించిన మన అన్వేషణ సామోస్ ద్వీపం మీద ప్రారంభిద్దాం.

స్వర్గాధిదేవత, జీయుస్ భార్య అయిన హెరా దేవాలయం ఈ ద్వీపంలోనే వుంది. క్రీ.పూ. ఆరవ శతాబ్దిలో ఈ మందిరాన్ని నిర్మించారు. ఈ ద్వీపం మీదే క్రీ.పూ. 580లో గ్రీకు గణిత శాస్త్ర పితామహుడైన పైతాగరస్ జన్మించాడు అంకెలే ప్రకృతిభాష.


అంకెలకూ, సంగీతానికీ అవినాభావ సంబంధ ముందన్నాడు పైతాగరస్. బిగదీసి పట్టుకున్న తీగను మీటితే ఒక శబ్దం వస్తుంది. దాని వివిధ భాగాలు, ధ్వనుల్ని సృష్టిస్తాయి.

ఉదాహరణకు, ఒక కొసలో మీటినపుడు వచ్చే శబ్దంవేరు మధ్యలో వచ్చే శబ్దం వేరు. (దీన్ని OCTAVE అంటారు.) ఆ తరువాత, మూడవ వంతు దూరం, అయిదవ వంతు దూరంలో ధ్వనించే స్వరం వేరు. ఆ తరువాత నాల్గవభాగంలో మరో OCTAVE పలుకుతుంది.

అత్యంత శ్రావ్యమైన ధ్వనులు-పశ్చిమదేశాల సంగీతప్రియులకు యిష్టమైన ధ్వనులు-తీగను సరి అంకెలతో (2,4,6,8,గా) విభజించిన చోట్ల మీటినపుడు మాత్రమే పలుకుతాయని పైతాగరస్ తెలుసుకున్నాడు. ఆ నాటి గణిత విద్యార్థులకు యిందులో ఒక మార్మికత గోచరించింది. ప్రకృతికీ, సంగీతానికీ యింత ఘనిష్ఠ సంబంధముందా? రోదసీలో కనిపించే గ్రహాలను, నక్షత్రాలను సంగీతపరంగా గణించవచ్చునని విశ్వసించారు పైతాగరస్ అనుయాయులు. వాళ్లకు విశ్వమే నాదమయం.

గణితమంటే అంకెల భాష అనుకున్నాం. కాని రోదసి అధ్యయనానికి రేఖాగణితం అవసరమవుతుంది. రూపమయమీ ప్రకృతి. ఒక అల ఒక స్ఫటికం. మానవ శరీరం, కాని వీటికీ అంకెలకూ ఏమి సంబంధం? అంకెలకూ, రేఖాగణితానికీ వున్న సాన్నిహిత్యాన్ని గుర్తించాడు పైతాగరస్.

శబ్ద ప్రపంచాన్ని నియంత్రించేది అంకెలే అని కూడా నిరూపించాడయన. గోచరమైన ప్రతి ఆకారానికీ ఈ సూత్రం వర్తిస్తుందన్నాడు. ఇది ఒక అద్భుత ఆవిష్కరణే. కనిపించిన దృశ్యానికి ఒక దృశ్యానికి ఒక దిగంత రేఖను వూహించుకుంటాం. ఆ తర్వాతే జ్ఞానం కుడి ఎడమల్ని నిర్ధారిస్తుంది. బాబిలోనియన్లు 'ది హేంగింగ్ గార్డెన్స్' నిర్మించిన నాటికీ, లేక ఈజిప్టియన్లు 'పిరమిడ్లు' కట్టేనాటికే నిర్మాణ కార్మికుల సెట్‌స్క్వేర్ (Builder's set square) రూపకల్పన జరిగింది.



గణితంతో చిత్రకళ

సామోస్‌గ్రీకు ద్వీపమే అయినా, పైతాగరస్ గణిత పరిజ్ఞానం పశ్చిమదేశాలకు చేరటానికి కొంత కాలంపట్టింది. అలెగ్జాండ్రియా (ఈజిప్టు) లోని యూక్లిడ్, క్రీ.పూ. 300 ప్రాంతంలో పైతాగరస్‌ను పరిష్కరించి మనకందించాడు.

తన గురువు పైతాగరస్‌లాగ, యూక్లిడ్‌ది కూడా జ్ఞానాన్వేషణే. ఒక నాడు, ఏదో గణిత సిద్ధాంతాన్ని వివరిస్తున్నపుడు, శ్రోత ఒకడు "దీనివల్ల ఏంలాభం?" అంటూ సందేహం వెలిబుచ్చాడు.

"ఈయన లాభనష్టాలు బేరీజు వేస్తున్నారు. ఎవరైనా ధర్మం చెయ్యండి." అంటూ అసహనం ప్రదర్శించాడట. యూక్లిడ్ "శాస్త్ర పరమైన ఆలోచన అంటే ఒక ముందడుగు, ఒక బంగారు నాణెంకాదు." అన్న పైతాగరస్ వ్యాఖ్యకు మరో రూపం యూక్లిడ్ సమాధానం.

ఈయన రచన రేఖాగణిత మూల సూత్రాలు (Elements of Gemoetry) ప్రపంచంలోని (యించుమించు) అన్ని భాషల్లోకీ అనువాదమైంది.

రెండువేల సంవత్సరాలనాడు అలెగ్జాండ్రియాలో ప్రాచుర్యం పొందిన మరొక సైన్సు-ఖగోళశాస్త్రం. బైబిల్లో, కథారూపంగానైనా ఖగోళప్రస్తావన లేదని అనగలమా? క్రీస్తుపుట్టినప్పుడు ముగ్గురు జ్ఞానులు ఒక నక్షత్రాన్ని అనుసరించి బెత్లెహేం చేరుకున్నారు. అంటే వాళ్ళు రోదసీ పరిశీలకులన్న మాట.

క్రీ.శ. 150లోనే గ్రీకు ఖగోళ పరిశోధకుడు క్లాడియస్ (PTOLEMY) టాలెమీ గ్రహ, నక్షత్రాల వునికిని నిర్ధారిస్తూ ఒక చిత్రపటం తయారు చేశాడు. చంద్రుడు, భూమి చుట్టూ పరిభ్రమిస్తున్నాడని కూడా ఆయనకు తెలుసు. కాకపోతే, చంద్రుడి చుట్టూలాగే, సూర్యుడూ, యితర గ్రహాలు కూడా (భూమి చుట్టూ) పరిభ్రమిస్తున్నా యనుకున్నాడు. వృత్తాకారంలో యివన్నీ తిరుగుతున్నాయని గ్రీకుల విశ్వాసం. టాలెమీ కూడా తన చిత్రపటంలో గ్రహ గమనాన్ని యిలాగే సూచించాడు. నాలుగు వందల ఏళ్లపాటు ఈ నమ్మకం యిలాగే కొనసాగింది.

అంత ప్రాచీన కాలంలోనే ఖగోళ పరిశోధన ఎందుకు కొనసాగిందో, ఆలోచించవలసిన విషయమే. గ్రహాలూ, నక్షత్రాలూ, మనుషుల్లో ఎందుకంత జిజ్ఞాస రేకెత్తించాయి? మానవ శరీరం గురించీ, రోగాల గురించీ పరిశోధన అర్థం చేసుకోవచ్చు. వైద్యశాస్త్రం కన్నా ఎక్కువగా ఖగోళశాస్త్రం ఎందుకు అభివృద్ధి చెందింది? గ్రహ, నక్షత్రాలకూ, మానవ జీవితానికీ, శరీర ధర్మాలకూ సంబంధముందని భావించారు వాళ్లు. గణితంలో సాధించిన పరిణతి మూలంగానే వాళ్లు ఖగోళ పరిశోధనలో కూడా గణనీయమైన కృషి చేశారు.

ఆలోచనలు కొత్తపుంతలు తొక్కటానికి సామాజిక ప్రేరణ కూడా దోహదం చేస్తుంది. అలాంటి ఒక సంఘటన. క్రీ.స్తు తర్వాత ఆరువందల సంవత్సరాలకు ఆవిర్భవించిన ఇస్లాం. క్రీ.శ. 630లో మహమ్మద్, మక్కా మీద విజయం సాధించిన తర్వాత ఈ మతం బాగా విస్తరించింది. వందేళ్లలో అలెగ్జాండ్రియా, బాగ్దాద్, పర్షియా, స్పెయిన్, దక్షిణ ఫ్రాన్స్, దాటి తూర్పున చైనా, ఇండియాల దాకా వ్యాప్తి చెందింది. యూరోప్ అంధయుగాలలో మగ్గిపోతున్నప్పుడు, ఇస్లామిక్ దేశాల కీర్తి నలుదెసలా ప్రకాశించింది. మత మార్పిడులకు ఎక్కువ ప్రాధాన్యత యిచ్చిన ఇస్లాం, ఆయా దేశాల శాస్త్ర,

సాంకేతిక విషయాలను కూడా తనలో యిముడ్చుకుంది. మహాత్యాలు, అద్భుతాలకు ఇస్లాంలో తావులేదు. (క్రిస్టియానిటీలో రెడ్‌లైన్, బ్రెడ్ క్రీస్తు నెత్తురు– మాంసానికి ప్రతీకలు) ఇటువంటి విశ్వాసం ఇస్లాంలో లేవు.

గ్రీకుల ఆవిష్కరణ అయిన ఆస్ట్రోలేబ్ విస్తృతంగా వాడుకలోకి వచ్చింది ఇస్లాం ఆవిర్భావం తర్వాతే. సూర్యుని, యితర నక్షత్రాల స్థానాన్ని తెలుసుకోవటానికి ఉపయోగిస్తారీ పరికరాన్ని. ఫలితంగా, అక్షాంశ, రేఖాంశల్నీ, సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్నీ (అంటే నమాజు వేళల్నీ), యాత్రికుల సౌకర్యార్థం మక్కా దిశనూ నిర్ధారిస్తారు. చాలా కాలం ఈ ఆస్ట్రోలేబ్‌ను జేబు గడియారంలా, స్లైడ్ రూల్‌లా వాడారు. ప్రముఖ బ్రిటిష్ మహాకవి జాఫ్రీ ఛాసర్, ఆస్ట్రోలేబ్ ఎలా ఉపయోగించటమో అని ఒక ప్రైమర్ రాశాడు. (తన కుమారుడి కోసం.) ఎనిమిదవ శతాబ్దానికి చెందిన ఒక అరబ్బు ఖగోళశాస్త్రజ్ఞుని గ్రంథం ఆధారంగా రాసినదే ఈ ప్రైమర్.

అరబ్బులకు గణితమంటే మహా ఆసక్తి. వూహలలో సమస్యలను సృష్టించటం, వాటిని పరిషారం చెయ్యటం వాళ్ల హాబీ. ఆస్ట్రోలేబ్ కన్నా మెరుగైనది పదమూడవ శతాబ్ది బాగ్దాదు ఖలీఫాల కాలం నాటి ఆటోమేటిక్ కాలెండర్. వాళ్ల మెకానికల్ నైపుణ్యానికి గీటురాయి యిది.

అయితే, అరబ్బు గణిత శాస్త్రజ్ఞుల అతిముఖ్యమైన ఆవిష్కరణ అంకెలు. ఇవి రాయటంలో వాళ్లు తెచ్చిన మార్పు నిజంగా విప్లవాత్మకం.

యూరోపులో రోమన్ పద్ధతిలో, మాత్రమే అంకెలు రాయటం అలవాటున్న రోజులవి. అంటే ఉదాహరణకు 1825ను MDCCCXXV గా రాసేవాళ్లు. (M=1000, D=500, C+C+C=100+100+100, XX=10+10, V=5. వీటిని ఆధునిక పద్ధతిలో, అంటే యింత సులభంగా (1825) రాసి అంకెల రూపాన్నే మార్చివేశారు అరబ్బులు. వీటిని అరబిక్ అంకెలనే అంటాం.





# మిసిమి

మాసపత్రిక

## చందాదారులుగా చేర్పించండి
# బహుమతి
## పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹200** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే – మంచి సారస్వతంతో...

ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 3. | VEMANA - Through Western Eyes - *V.R. Narla* | 50.00 |
| 4. | THE FIRST POETICAL READER (Walter Joyes and N.C. Sashacharloo) | 50.00 |
| 5. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 6. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 7. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 8. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 9. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 10. | నాలో నేను (కవితలు) " " | 60.00 |
| 11. | సిద్ధార్థ " " | 50.00 |

మీ చందా **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపండి

**మిసిమి** మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine: www.kinige.com

# వెలుగు చూడని

# తెలంగాణ సాహిత్య నిధులు

మానవత్వమే సంస్కృతి. సాహిత్య లేఖలే పవిత్రాశయాలు. భాష సమతా ప్రవాహము. జాతికి దివ్య చిహ్నం కవిత్వం. కవులు దేశానికి జీవ గఢ్ఢలు. జానపదకవిత తెలుగు భాషకు రంగరింపు.

తెలంగాణాలో ప్రాచీన రచయితలు దారుశిలా ఫలకాలపై కవిత్వాన్ని చిత్రించారు. ఈ కవితావతరణ చాలా కష్టనష్టములకు గురి అయ్యింది. తరువాత తాటాకులపై గంటములతో కవులు రచనలు సాగించారు. ఈ ప్రాచీన కవులు తమ ఉత్తమ రచనల ద్వారా అప్పటి పాలకులపై గొప్ప ప్రభావములను వేయుచుండెడివారు.

శ్రీ 10వ శతాబ్దంలో కాకతి వంశీయుడు ప్రోలరాజు కాకతివంశంలో మొదటి ఆంధ్ర ప్రభువు. కాకత ప్రోలరాజు అనేక శాసనాలు వ్రాయించాడు. ప్రోలరాజు పుత్రుడు ప్రతాప రుద్రుడు తండ్రిని మించిన కీర్తి సంపాదించాడు. పాల్కురికి సోమనాథకవి వలన ప్రతాపరుద్రుడు శైవుడయ్యాడు. రాయచూరు మండలమున ఆలంపుర క్షేత్రవాసియగు మంధాన భైరవుడను కవి 10వ శతాబ్దంలో సంస్కృతమున "భైరవ తంత్రమును" రచించాడు.

సోమనాథుడు అష్టభాషా పండితుడు, ప్రతాపరుద్రునికి మంత్రిగా ఉండి సలహాలిచ్చేవాడు. నాటి మత విద్వేష బీజాలను నిర్మూలించి ధర్మసంరక్షకుడుగా సోమనాథుడు రుద్రోపాసకుడయ్యాడు. హనుమకొండలోని సహస్ర స్తంభ దేవాలయము, ఓరుగల్లు దుర్గము, పాకాల చెఱువు మొదలైన వాటిని ప్రతాపరుద్ర చక్రవర్తి నిర్మించడానికి అతని ప్రోత్సాహమే హేతువు. పాల్కురికి సోమనాథుడు మహా మేధావి. ప్రతాపరుద్రుని ఆస్థానంలో కవులను, పండితులను గౌరవింపచేసి శాశ్వతకీర్తిని సముపార్జించి పెట్టిన త్యాగజీవి. సోమనాథుని గ్రంథాలు క్రీ.శ. 11వ శతాబ్దంలో రచింపబడినాయి. మల్లికార్జున పండితారాధ్యులు "శివతత్వ సారము" వ్రాశారు. పాల్కురికి, ''బసవపురాణమును'', ''పండితారాధ్య చరిత్ర''ను రచించాడు. ''చెన్నమల్లు సీసములు", "వృషాధిపశతకము", "సోమనాథ భాష్యము", "అనుభవసారము", "బసవోదాహరణము", "అష్టకాలు" కూడా ఆయన విరచితములే. సోమనాథుని కాలములోనే ప్రతాపరుద్రునికి విద్యానాథుడు అనేకవి సంస్కృతంలో "ప్రతాపరుద్ర యశోభూషణము" అనే అలంకార శాస్త్ర గ్రంథమును అంకితం చేశాడు. నల్లగొండజిల్లా శుభ్రవీడులో (హుజూరు నగరు తాలూకా) నలంతిఘలు అప్పలాచార్యులు 11వ శతాబ్దంలో "ధరాసాగరేశ చరిత్ర" రచించినాడు.

ప్రతాపరుద్ర పుత్రుడయిన గణపతిదేవ చక్రవర్తి కాలంలో కవిబ్రహ్మ తిక్కన సోమయాజి ఓరుగల్లు విచ్చేసి రాజసభలో తన మహాభారతమును కావ్యపఠనం చేశాడు. ఓరుగల్లులో గణపతిదేవుని కాలములో భాస్కరకవి "రామాయణమును" రచించాడు. ఈ 12వ శతాబ్దంలో కరీంనగరం జిల్లాలోని వేములవాడయందున్న భీమకవి తన 'కవిజనాశ్రయమును" రచించాడు. గణపతిదేవుని సామంతరాజుగా వున్న నన్నెచోడుడు తన ''కుమార సంభవమును'' రచన యొనర్చినాడు. సోమనాథుడు గణపతిదేవునికి గురువుగా ఉండేవాడు. క్రీ.శ. 12వ శతాబ్దిలో నల్లగొండ మండలమున భువనగిరిలో సరస్వతీ తీర్థులు ''స్మృతి దర్పణము'', "తర్కరత్నము" మున్నగునవి రచించాడు.

గణపతిదేవ చక్రవర్తి పుత్రిక రుద్రమదేవి. ఈమె సామ్రాజ్యాన్ని పరిపాలించిన వీరనారియేకాక ఉత్తమ కవయిత్రి. ఈమెనే రుద్రమదేవ చక్రవర్తి అని ప్రజలు పిలిచేవారు. శివదేవయ్య ఈమె వద్ద అమాత్యుడుగాను, జాయనాయకుడు సేనాపతిగాను ఉండేవారు. పై ముప్వురు కూడా 13వ శతాబ్దిలో గ్రంథ రచన చేశారు. రుద్రమదేవి "నీతిసారమును", శివదేవయ్య ''పురుషార్థసారమును'', జాయసేనాపతి "నృత్తరత్నావళిని" రచించారు. ఓరుగల్లునందు కొలను రుద్రకవి ''రాజరుద్రీయమును,'' విశ్వేశ్వర

సేకరణ : కుర్రా జితేంద్రబాబు

శివదేశికులు ''శివతత్వ రసాయనమును'', చక్రపాణి రంగనాథుడు ''నయసగతిరగడమును'', మారనకవి ''మార్కండేయ పురాణమును'', నాగనాథకవి ''మదన విలాసబానమును" రచించి తెలంగాణములో కయితకన్నెకు క్రొమ్మెరుగులు తీర్చిదిద్దినారు. రాయచూరు మండలమున కౌచవిభుడు, విఠలరాజు అను తెలుగు రాజసోదరులు ''ఉత్తర రామాయణమును'' రచించినారు. బూదవూరు శాసనములో వీరిని గూర్చిన వివరములు తెలుపబడినవి. "కపర్థి" అను కవి మెదకు జిల్లాలోని 'కొలిచలమ' అనే గ్రామంలో అనేక భాష్యములను సంస్కృత భాషలో రచించిన మహావిద్వాంసుడు.

ఓరుగల్లులో కుమార రుద్రదేవుడను కవి "భాస్కర రామాయణమును'' రచించినాడు. మహా మండలా ధీశ్వరులయిన కాకతీయ చక్రవర్తుల పరిపాలనము అనేక కారణాంతరములచేత రుద్రమదేవి అనంతరము ఎక్కువ కాలము సాగలేదు. తెలంగాణకు అన్ని విధాల వైభవాన్ని సమకూర్చిన కాకతీయ వంశం కాలగర్భంలో మరుగున పడింది.

కాగా 14వ శతాబ్దంలో అక్కడక్కడ తెలుగు రాజులు చిన్న రాజ్యాలను పరిపాలిస్తున్నను తెలంగాణంలో సారస్వతకళాభివృద్ధిని ప్రోత్సహిస్తూనే వచ్చారు.

మడికి సింగన్న రామగిరి నివాసి *సకల నీతి సమ్మతము, భాగవతము, నీతి తారావళి* అనే గ్రంథాలను రచించాడు. ఈ కాలంలో బొమ్మకంటి హరిహరుడు ''అనర్ఘ రాఘవవ్యాఖ్యను" రచించినాడు. రాయచూరు మండలాన్ని పరిపాలించే ఆంధ్రరాజు గోనబుద్ధారెడ్డి తెలుగు భాషలో "రంగనాథ రామాయణము"ను రచించినాడు.

ఓరుగల్లులో శాకవల్లి మల్లిఖార్జునుడు ''భాస్కర రామాయణమును" తెలుగులోను, "అభిషిక్త రాఘవమును" సంస్కృతంలోను రచించినాడు. మెదకుజిల్లా కొలిచలమ నివాసియగు మల్లీనాథపండితుడు "పంచకావ్యములు" అను సంస్కృత గ్రంథములకు వ్యాఖ్య చేసినాడు. ఇతడు షట్శాస్త్ర పండితుడు. ఇతని కుమారుడు కుమారస్వామి "ప్రతాప రుద్రీయము'' అను సంస్కృతాలంకార గ్రంథమునకు "రత్నాపణమను" వ్యాఖ్యను రచించినాడు.

ఓరుగల్లునందు కాసె సర్వప్ప అనుకవి "ప్రతాప చరిత్ర", "సిద్దేశ్వర చరిత్ర"లను రచించినాడు. వావిపాటి త్రిపురాంతక కవి యీ శతాబ్దమున వనపర్తిలో మహబూబ్‌నగర మండలమున నివసించి ''త్రిపురోదాహరణము'', "ప్రేమాభిరామం", "చంద్రతారావళి", "అంబికాశతకము", ''మదనవిజయము'' అను గ్రంథములను రచించినాడు. మహబూబునగర మండలమండలి వర్ధమాన పురమును పాలించిన ఆంధ్రరాజు గోకర్ణుడు "గోకర్ణ ఛందస్సును" రచించినాడు. నలగొండలమందలి రాచకొండలో గౌరవమంత్రి "లక్షణదీపిక" అను సంస్కృత గ్రంథమును, ''హరిశ్చంద్ర చరిత్రమును'', ''నవనాధ చరిత్రమును'' రచించినాడు. రాయచూరులో అనంతమాత్యుడు కవి 1400లో "అనంతుని ఛందస్సు", "భోజరాజీయము", ''రసాభరణము'' అను గ్రంథములను రచించినాడు. మహబూబునగర మండలమందు వర్ధమానపుర ప్రభువు ఉదయాదిత్యుడను తెలుగురాజు "ఉదయాదిత్యాలంకారము" అను గ్రంథమును రచించాడు. మామిళ్ళపల్లి శాసనమున వీరిని గూర్చి వివరములు కలవు. గోకర్ణ కవి ఉదయాదిత్య ప్రభువు కుమారుడని ఆ శాసనమున కలదు. 1400లో భువన గిరియందు నాగేంద్రకవి ''రమాధీశ్వర'' శతకమును రచించినాడు. కరీంనగరం జిల్లా వెలిగందలలో నారయ్య అనే ఉత్తమకవి 1450లో "భాగవతం" రచించినాడు. బమ్మెర పోతనామాత్య దిత్యాలంకారము అను గ్రంథములు రచించినాడు. మామిళ్లపల్లి శాసనమున వీరిని గూర్చి వివరములు కలవు. గోకర్ణ కవి ఉదయాదిత్య ప్రభువు కుమారుడిని ఆ శాసనమున కలదు. 1400లో భువన గిరియందు నాగేంద్రకవి ''రమాధీశ్వర'' శతకమును రచించినాడు. కరీంనగరం జిల్లా వెలిగందలలో నారయ్య అనే ఉత్తమకవి 1450లో ''భాగవతం'' రచించినాడు. బమ్మెరపోతనామాత్యునికి ప్రియశిష్యుడు.

15వ శతాబ్దము ఆంధ్ర కవితారంగంలో మహోజ్వలస్థానాన్ని అలంకరించింది. ప్రభువులను సైతము తిరస్కరించి, వారు పాదదాసులైనా కూడా లొంగిపోక కలమొకచేత, హలమొక చేతబట్టి దీక్షతో వ్యవసాయ, కవితా రంగాల్లో కృషి సల్పి తేనెలొలుకు భాగవతము రచించిన కవి చక్రవర్తి శ్రీ బమ్మెరపోతనామాత్యుడు ఈ శతాబ్దంలో తెలంగాణా గడ్డపై ఉద్భవించాడు. ఏకశిలాపురి వాసియగు పోతన్న అమృత రసవాహినియు భక్తి సాగరమునైన "భాగవత మహాకావ్యాన్ని" ఆంధ్రజాతి కందించాడు. ఈ కాలంలో పోతన

కొడుకు మల్లన "దాక్షాయణీ పరిణయణమును" రచించినాడు. పోతన శిష్యుడు కేసన "విష్ణు భజనానందము" రచించినాడు. పోతన రాచకొండ ప్రభువైన సర్వజ్ఞ సింగమయ్యను ధిక్కరించినాడు. అతనికి కృతి సంకేతము సేయనన్నాడు.

15వ శతాబ్దమున నల్లగొండ జిల్లాలోని సూర్యాపేట తాలూకాయందు పిల్లలమర్రి అను ప్రసిద్ధ క్షేత్రమున్నది. అచ్చట మహత్తర శిల్పములు, శాసనములు కూడా కలవు. 1450లో "జైమినీ భారతము" అనే ఉద్గ్రంధమును వీరభద్రకవి పిల్లలమర్రిలో రచించియున్నాడు. పిల్లలమర్రి పినవీరభద్రు డనటానికి యితని అన్నగారి పేరును వీరభద్రుడే. ఇతడే "వాణి నారాణి" అన్నాడు. నల్లగొండ మండలమందు రాచకొండ ప్రభువైన సర్వజ్ఞ సింగమ భూపాలుడు 1420లో "రసార్ణవ సుధాకరమును" రచించి కవి పండితులను పోషించాడు. కవిసార్వభౌముడు శ్రీనాథుడీయనవద్ద అనేక సత్కారములందినాడు. నల్లగొండ మండలమున రాచకొండలో బొమ్మకంటి అప్పలాచార్యులు 1450లో "రామలింగాను శాసన" వ్యాఖ్య రచించినాడు. మాధవరావు రాచకొండ ప్రభువు "రాఘవీయమును" రచించినాడు. 1450లో లేమావిళ్లయందు తిరుమల భట్టారకుడు "కాలామృతమును" రచించినాడు. 1480లో ఓరుగల్లునందు పిడుపర్తి బసవకవి "వీరశైవ దీక్షాబోధను", "బ్రహ్మోత్తర ఖండమును" ఇంకను 23 గ్రంథములు రచించినాడు.

1550 ప్రాంతంలో మహబూబునగర మండలమున నాగర కర్నూలు తాలూకాలో లేమావిళ్ల గ్రామనివాసి అయిన కాకునూరి అప్పకవి అను విద్వాంసుడు "అప్పకవీయము" అను ఛందశ్శాస్త్రమును పద్య కావ్యముగా రచించినాడు. అతని యితర కృతులు "సాధ్వీధర్మము", "శ్రీశైలేశ్వర శతకము", "కాలబాలార్ణవము" అను జ్యోతిశ్శాస్త్రం 1512లో అద్దంకి గంగాధర కవి తన "తపతీ సంవరణోపాఖ్యానమును" గోలుకొండ నవాబు మల్కిభరామునకు అంకితమిచ్చినాడు. 1550లో పిడుపర్తి బసవప్ప "ప్రభులింగ లీలలు" వ్రాసినాడు. 1550లో గోలుకొండయందు సారంగు తమ్మయ్య "విప్రనారాయణ చరిత్రమును" రచించినాడు. 1525లో గోలుకొండయందు పొన్నిగంటె తెలగన్న "యయాతి చరిత్ర"ను అచ్చ తెలుగులో రచించి మల్కిభరాము మంత్రి అఈనుఖాను కంకితమిచ్చినాడు. 1550లో మల్లారెడ్డి మెదకు నివాసి "షట్చక్రవర్తి చరిత్ర" వ్రాసినాడు. పిడుపర్తి సోమనాథుని తమ్ముడు పాలయార్యుని కుమారుడు బసవప్పకవి, సోమనాథుని తండ్రి బసవప్పకవి. వీరందరు కవులే.

కరీంనగరం జిల్లా ధర్మపురి వాసియగు చరికొండ ధర్మకవి 1600లో "చిత్రభారతము" వ్రాసినాడు. నెల్లుట్ల నారాయణకవి బవ్మెర గ్రామమున 1600లో "వజ్రాభ్యుదయము" రచించినాడు. చరికొండ నరసింహకవి మహబూబునగరాన 1600లో "శశిబిందు చరిత్ర" రచించినాడు.

1650లో మెదకుజిల్లా కొలిచలమయందు "చంపూరామాయణ" వ్యాఖ్య రచించిన శ్రీ నారాయణ పండితుడు మల్లినాథ వంశీయుడు. ఎలకూచి పిన్నయ ప్రభాకరుడు 1650 ప్రాంతాన జటప్రోలు సంస్థానమున "ఆదిత్య పురాణము" రచించిన ఆస్థాన పండితకవి. 1650 ప్రాంతమున అష్టభాషా విశారదుడైన వనపర్తి ప్రభువు రాజా బాహిరీ గోపాలరావు సంస్కృతంలో "రామచంద్రోదయ కావ్యము," "శృంగార మంజరీ భాణమును," "ఆంధ్ర పద్య కావ్యమును," "అనర్ఘ రాఘవమును" రచించినాడు. అనర్ఘ రాఘవ ప్రబంధ కర్తయు ప్రాగుటూరు సంస్థానాధిపతి అయిన బిజ్జుల తిమ్మభూపతి గోపాలరావు ప్రభువుకు మేనల్లుడు. గోపాలరావు అనేక కవి పండితులను పోషించినాడు.

1650–1700లోపున మహబూబునగర మండల మందు గద్వాల సంస్థాన నివాసులగు కవులలో నరసింగమయ్య "నృసింహ విలాసమును" రచించినాడు. సోమభూపాలుడు "రతిరహస్య"మును గ్రంథము సంస్కృతమునందు రచించినాడు. చింతలపల్లి గోపాలమంత్రి "ఆర్యాశతకము"ను రచించినాడు. కొత్తపల్లి రామాచార్యులు "యథాశ్లోక తాత్పర్య రామాయణము"ను రచించినాడు. కాణాదము పెద్దన సోమయాజి "ఆధ్యాత్మ రామాయణమును" రచించెను. కొటికలపూడి వీరరాఘవాచార్యులు "యథాశ్లోక తాత్పర్య భారతమును" రచించెను. క్రీ.శ. 1700 ప్రాంతములో జటప్రోలు సంస్థానమున కవితార్కిక సింహ వేదాంతా చార్యులును, కవితార్కిక శ్రీ వానాచార్యులును, సురభి చినమాధవరావు (శూద్రస్మృతి కర్త)ను అనేక గ్రంథములను రచించినారు.

ఈ కాలంలో గద్వాలయందు తిరుమల బుక్క పట్టణ వంశీయులగు అనేకులు కవులును సురపుర సంస్థానంలో తిరుమల బుక్క పట్టణము వంశీయులు ఆనేకులును వివిధ గ్రంథములను రచించినారు. 1700–1900 క్రీ.శ. మధ్య

ప్రాంతమున తిరుమల బుక్క పట్టణము బుచ్చి వెంకటాచార్యులు మొదలైనవారు బహుళ గ్రంథకర్తలైన కవులు క్రీ.శ. 1700-1300 శతాబ్ది మధ్య వేములవాడ సోమనాథ కవి "వసుచరిత్ర వ్యాఖ్యను" దేవరకొండ నివాసి మరింగంటి సింగరాచార్యులు "శ్రీకృష్ణ శతా సందీయమును," "కృష్ణ తులాభారం" మొదలయిన గ్రంథములను రచించిరి. ఈ కాలమునందే మహబూబునగరం జిల్లాలో చరిగొండ హన్మయ్య "జ్యోతిషరత్నాకరమును", ఈ శతాబ్దముల మధ్య ప్రాంతము అనగా 1700-1800 కలవకొలనులో బోరవెల్లి శేషాచార్యులు "యథాశ్లోక తాత్పర్య రామాయణమును" రచించినాడు. ధర్మపురి శేషప్ప కవి ''ధర్మపురి రామాయణము"ను గంగాపురంలో చింతలపల్లి సంజీవ రాయకవి "చంద్రాంగదోపాఖ్యానమును" రచించినాడు. 1700-1800 మధ్య ప్రాంతమునందు కరీంనగరం జిల్లా వర్కాల నివాసి రాపాక శ్రీరామకవి ''ఆధ్యాత్మ రామాయణమును" రచించినాడు. వాసుగోటి జగన్నాధరావు "కుముదవతీ విలాసము" వ్రాసెను. ఆత్మకూరు సంస్థానమున వెంకటాధ్వరికవి "లక్ష్మీ సహస్రవ్యాఖ్యను" రచించినాడు. ఈ ప్రాంతములో నిజామాబాదు జిల్లా బొల్లెం గ్రామమునందు మరం వ్యాళయ్య శారద రామాయణమును, హనుమంతమ్మ తమ కవయిత్రి "స్తవములను" రచించాడు. ఈ ప్రాంతమందు ఆదిలాబాదు జిల్లాయందు ఆరుట్ల రామాచార్యులు జగన్నాధ చంపువు"ను రచించినాడు. గార్ల గోపీ మంత్రి "సింధుమతీ విలాసము'' రచించెను. కరీంనగరు జిల్లాలో రావాక వెంకటదాసు పర్కాలలో ''శివరహస్య ఖండము''ను రచించినాడు. ఈ కాలమునందు నల్లగొండ మండలము కనగలు నివాసులగు వెంకట మరిగంటి వెంకటప్ప నృసింహాచారి "అనిరుద్ధ విలాసమును," మరింగంటి వెంకట నరసింహాచార్యులు "తాలాంకనందినీ పరిణయమును", ''ఇందిరాభాగవతమును'' మరింగంటి నరసింహాచారి "చిలువపడిరేని హేరణమును" రచించినారు. 1750-1850 మధ్య ప్రాంతమునందు ఓరుగల్లు నివాసి పరశు రామలింగమూర్తి "సీతారామాంజనేయమును", అలంపురి క్షేత్ర నివాసి తక్కసీల వెంకన్న "పార్వతీ శతకమును," "సీతారామదండకము"ను, కొలనుపాక క్షేత్రమున తిరువాయి పాటి వెంకటకవి "యాదగిరీంద్ర శతకమును," దేవరకొండ అనూరిమరిగంటి వెంకటనరసింహాచారి "రతిమన్మథాభ్యు దయమును," మధిర తాలూకా నివాసులయిన మాటూరి వెంకటప్పయ్య "భూరిగుణజాల శతకమును," మాలూరి వెంకటేశకవి ''బుద్ధ మనోవిలాసమును'', కృష్ణగిరి వెంకటరమణయ్య "గయోపాఖ్యానమును," యాముజాల శేషాచలపతి "వసిష్ఠ జనక సంవాదము," రచించినాడు. నల్లగొండ జిల్లాలో కొలనుపాక సంజీవకవి ''రుక్మిణి పరిణయమును," "వీరనారాయణ శతకము," త్రివిక్రమ విలాసమును,'' ''వసుదేవ నందన శతకమును,'' "భాగవతమును" రచించెను. బూరుగు గడ్డయందు వాత్స్య శ్రీరంగాచార్యులు "శాల్మలీ కదన విలాసమును" రచించినాడు. రాపాక శ్రీరామకవి "ఆధ్యాత్మ రామాయణము" రచించెను. 18-19 మధ్య ప్రాంతమున బద్దె భూపతి "సుమతీశతకమును," నేలకొండపల్లె కంచెర్ల గోపన్న "ఆధ్యాత్మ రామాయణకీర్తనలను'' వాడాల శేషాచార్యులు "మైథిలీపరిణయమును" వనపర్తి వీరరాఘవాచార్యులు ''వీరరాఘవీయమును,'' మహబూబునగరం ముడుల వేంకటాచార్యులు "దేవహూతి విలాసమును," "రసదీపికయును," చరిగొండ నరసింహకవి "శశిబిందు చరిత్రమును," దోమకొండ పట్టుమట్టు సోమనాథకవి "మాసూతసంహిత," బ్రహ్మోత్తర ఖండమును'' గార్గేయపురం సుబ్బాశాస్త్రి, గద్వాలలో "యథాశ్లోక తాత్పర్య రామాయణమును" రచించినారు. మహబూబునగరం జిల్లా యాపర్ల నివాసులు అక్షంతల సుబ్బశాస్త్రులు రచించిన "ప్రహసనము" వెల్లాల వెంకటశాస్త్రి గారి వద్ద ఉన్నది. హనుమకొండ సింగరాచార్యులు "అర్చిరాది ప్రబంధము''ను రచించెను. నల్లగొండజిల్లా పిరుమర్తి సింగయ్య "ఆంధ్రభారతం" రచించెను. పర్గి తాలూకా పెద్ద వుమ్మెంతాల నివాసి రాకమచర్ల వెంకటదాసు "కీర్తనలను" రచించినాడు. 500 కీర్తనలు మాత్రమే ముద్రితములు.

ఆశ్వారావు పేట శ్రీనాథుని వేంకటరామకవి "ఆశ్వారాయచరిత్ర," అను నాటకమును రచించెను. సిద్దిపేట తాలూకా రామాయణం పేట నివాసి పందరి రామానుజరావు "గాంగేయచరిత్రను'' ఇతని కుమారుడు వితలరాయకవి ''కౌసల్యా పరిణయమును,'' ''శ్రీరామవిజయములను'' రచించిరి. మహబూబునగరం జిల్లా పసుపులనివాసి కోవూరి వల్లభరాయకవి ''ఉత్సవ మహాత్మ్యమును'' రచించెను. నేలకొండపల్లి లక్ష్మణసింగు "కేశవ శతకం" రచించెను. ఓరుగల్లులో అచ్చి లక్ష్మణాచార్యులు ''ముముక్షుజన కల్పమును" రచించెను. పిల్లలమఱ్ఱిలో బంగారు రంగప్పచే

"తాపచరిత్రను," దమ్మారావుపేటలో చేడ రాఘవరెడ్డి "ద్విపద రామాయణమును," గోలుకొండలో తెనాలి రామలింగకవి "ధీరజన మనోవిరాజితమును" (కవివిశ్వ బ్రాహ్మణుడు) చెన్నూరు రామన్న "ఆంధ్ర రామాయణమును," వరదన్న పేట అచ్చి రామానుజాచార్యులు ''తత్వార్ధదర్పణమును,'' ధర్మవరము రామకవి గద్వాలలో "ముకుందవిలాసమును," మంథెనలో ముద్ధయకవి ''మంధెనరామాయణమును'' కొలనుపాకలో మల్లికార్జున సిద్ధయోగి గౌడపురాణమును, కరీంనగరం జిల్లా కోరుట్లలో గోవిందల నింబగిరిశాస్త్రి ''ప్రహసన గ్రంథమును,'' వాతపావయ శాస్త్రి "విక్రమార్కీయమును" వాగినిగిరి వామనాయకుడు "భార్గవ పురాణమును," కొల్లాపుర ప్రభువు నరసింగ రావు "నక్షత్ర ఖేలనమును'', వనపర్తి చెన్న కృష్ణకవి ''యాదవ భారతీయుమును'' రచించి మధ్యయుగ కవితను అభివృద్ధిపరిచినారు. 18-19 మధ్య ప్రాంతమున మహబూబునగరం జిల్లా మక్తలలో కృష్ణమ్మ అను కవయిత్రి వ్రాసిన వివరాలు దొరకలేదు. ఆమె వ్రాసిన రచనలు ఉదాహరణలో నున్నవి.

జటప్రోలు సంస్థానమున ఎపవెల్లి కృష్ణమాచార్యులును, గద్వాల సంస్థానమున తిరుమల కృష్ణమాచార్యులును అనేక గ్రంథములీ కాలమున వ్రాసిరి. నల్లగొండజిల్లా చర్లపల్లి నివాసి చిత్తారు గంగాధరయ్య అనేక గ్రంథములను రచించినాడు. సురవురం కేశవయ్య ఆత్మకూరులో ''నిరోష్ఠ్య రామాయణమును" రచించినాడు.

ప్రాచీనకాలంలో తెలంగాణాగడ్డపై జన్మించి తెలుగు సాహిత్య వీథుల్లో కవితావిన్యాసాలొనర్చిన కవీశ్వరులందరి గూర్చి వారి రచనలతో సహా ఈ వ్యాసంలో పొందుపర్చడానికై ప్రయత్నించడం జరిగింది. ⓜ

## గోదావరి

గోద, శబరి నదుల కలయిక వలన, అలా ఆ రెండు పదాల కలయికలో గోదావరి అనే పేరు సిద్ధించిందని గిడుగు రామమూర్తి పంతులుగారి ప్రతిపాదన. కాని అది సరికాదు. ఆంధ్రులు క్రీస్తు పూర్వం 4వ శతాబ్దం నుండి దక్షిణాదికి వలస రావటం ప్రారంభించారు. దానికి కారణాలు మతపరమైనవి. దానినలా వుంచితే వారితో పాటు వారి సంస్కృతి, మతం అక్కడి పేర్లు ఇక్కడకు వచ్చాయి. అలాంటి వాటిల్లో గోదావరి, కృష్ణనదుల పేర్లు కూడా వచ్చాయి. గోదావరి కాశిలో ప్రవహించి గంగానదిలో కలిసేది. కృష్ణ నేపాల్లో ఉంది. యమునకు కూడ కృష్ణ అని పేరు. అనంతర కాలంలో గోదావరి మేటవేసింది. ఇప్పుడు అక్కడ నదిలేదు. కాని కాశీలో గోదావరి నది పేరుతో గంగానది తీరానికి (ఘాట్‌కు) దారి తీసే ఒక బజారు వుంది. గోద అంటే ఆవులు, ఎద్లు, వరి అంటే నీరు. అంటే ప్రవాహం. ఆవులు, ఎద్లు, ఆ ప్రవాహాన్ని దాటి వెళ్ళే రేవు అని గోదావరి శబ్దానికి అర్థం. వరి అంటే నీరు. దాని వినియోగం అధికంగా వుండే పంట గనుక వరి పంటకు ఆ పేరు. వరి అంటే నీరు అంటే కొంత ఆశ్చర్యంగా వుండవచ్చు. కాని 'హైడ్రోసిల్' అనే వ్యాధిని వరిబీజం అనే కదా అంటాము. అన్నట్లు తుంగభద్ర నదిపేరు కూడా ఉత్తరాది నుండే వచ్చింది. భాగవతం చూడండి. ప్రసిద్ధి పొందిన గోదావరి మాత్రమేగాక మరి రెండు గోదావరులున్నాయి ఆంధ్రప్రదేశ్‌లో. ఒకటి రాయఘడ్‌ను చుట్టి ప్రవహిస్తోంది. రెండవది సీతానగరం (విజయవాడకు ఆవలివైపున గుంటూరు జిల్లా) వద్ద కృష్ణ నుండి చీలి మల్లెంపూడి వద్ద మరి రెండు పాయలైంది. అందులో ఒక పాయ నూతక్కిమీదుగా ప్రవహించి, తిరిగి కృష్ణలో కలిసేది. రెండవపాయ తుంగభద్ర పేరులో తుమ్మపూడి, చుండూరు, పొన్నూరుల మీదుగా ప్రవహించి ములుకుదురు వద్ద మరో ప్రవాహాన్ని కలుపుకుని, సముద్రంలో కలుస్తోంది. కాగా కర్నూలు జిల్లా శాసనాల్లో కృష్ణ కూడా గోదావరిగా సంభావింపబడింది. వారణాసి, బృందావనం, శ్రీరంగం అనేవి ఇంటిపేర్లుగా ముఖ్యంగా, బ్రాహ్మణుల్లో, వైష్ణవుల్లో, కనిపిస్తాయి. ఇందులో మొదటి మూడూ ఉత్తరాదిలో వున్నాయి. అవే ఇక్కడకు వచ్చాయి. శ్రీరంగం దక్షిణాదిలో వుంది. అయితే తెలుగువారి ఇంటిపేర్లలో కనుపించటానికి అవి కారణం కాదు. ఇక్కడి గ్రామాల పేర్లే ఇంటిపేర్లు అయినాయి. సింహాచలానికి వారణాసి కటకమని పేరు. బృందావనం, ప్రయాగ, శ్రీరంగం అనేవి శ్రీకాకుళం, గంజాం జిల్లాల్లో వున్నాయి. దక్షిణాదిలో శ్రీరంగం ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం. తమిళులు దీనిని 'తిరు' చేర్చి 'తిరువరంగం' అంటారు. రంగం అంటే నది మధ్యలోని లంక భూమి. 'శ్రీ' గౌరవార్థం చేరింది. రంగంలో వెలిసిన దైవం గనుక రంగనాథుడు, రంగనాయకులు, రంగాశుడు అని పేర్లు వచ్చాయి. నెల్లూరులోని రంగనాథునికి కూడ ఆపేరు అలా వచ్చిందే. మనవారిలో పల్లికొండ అనేది పేరుగాను, ఇంటిపేరుగాను కనుపిస్తున్నది. రంగభూమికే పల్లికొండ అనిపేరు. అంటే శ్రీరంగమే పల్లికొండ అన్నమాట.

- యార్లగడ్డ బాల గంగాధర రావు

*31వ పుట తరువాయి...*

# అమ్మ - కథ

"పెట్టుబడిదారీ వ్యవస్థ యితర యూరోపియన్ దేశాల్లో కూడా ఉంది కాని ఈ దోపిడీ విధానానికి ఆయువు పట్టు అమెరికా. *'కేవలం ధనార్జనే జీవిత లక్ష్యం అని చాటిచెప్పిన సామాజిక వ్యవస్థ మరెక్కడా లేదు'.* డబ్బుతో పాటే నిరాశ పెరుగుతుంది. ఆ వెనకే అసూయ, దురాశ, శరీర రుగ్మతల్ని నయం చేసుకోవటానికి పత్రికలూ అలాగే. కాని ఇక్కడి పత్రికల నిండా ఉండేవి హత్యలు-దోపిడీలు, రేప్‌లు, అలాగే మోసాలు, రంకు పురాణాలు. పత్రికల కావల్సింది సెన్సేషన్. ఎవడో పందెం కాచి పన్నెండు నిమిషాల్లో డెభై రెండు సాసేజెస్ తిన్నాడని ఒక రాష్ట్రంలో ఒక సంవత్సరంలో రెండు వేల అయిదు వందల మంది యువతుల్ని వేశ్యాగృహాల కమ్మివేశారట. వీటిని చదివి పాఠకులేం తెలుసుకోవాలి?"

**అమెరికన్ పారిశ్రామిక ప్రభువుల గురించి**

**1906లో గోర్కీ రాసిన వ్యాసం నుండి. . .**

ఇక్కడి స్టీలు ఆయిల్ పారిశ్రామికవేత్తల గురించి ఇలా ఆలోచించాను. ఇంతటి కుబేరులు కూడా మామూలు మనుషుల్లాగే బతుకుతారా! వీళ్లకు మూడు పొట్టలూ, నోటిలో నూటయాభై పళ్ళూ వుంటాయనుకున్నాను. కోటీశ్వరు లందరూ, తెల్లారి లేచిందగ్గర్నుండి అర్ధరాత్రి దాకా కోళ్లు, బాతులు, పందులు, పిండివంటలు, వెన్న, కేకులు, మిఠాయిలు విరామమెరుగక భోంచేస్తూ వుంటారని నమ్మాను. సాయంత్రం వరకు నమిలి నమిలి వాళ్ల దవడలెంత నొప్పెడతాయంటే, యిక తర్వాత నీగ్రోలు వచ్చి, తిండిని నమిలి వాళ్ల కందించాలి. అప్పటికి అలసి-సొలసి చెమటోడుతున్న శరీరాన్ని మంచం మీద చేరుస్తారు. కాని, యింత తిన్నా మరెంత తిన్నా, పెట్టుబడుల మీద వచ్చే వడ్డీలో సగం కూడా కరగలేదే!

పాపం, ఎంత కష్టం వచ్చి పడింది. అందరికన్నా ఎక్కువ తినలేనప్పుడు కోటీశ్వరుడు కావడమెందుకు మరి. బూట్లకు బంగారు మడిమలూ, తలమీద టోపీకు బదులుగా వజ్రాల కిరీటం వుంటాయేమో. కోటుకు మూడు వందల బంగారు బటన్స్ వుంటాయా? సెలవు రోజుల్లో ఎనిమిది కోట్లూ, ఆరు పాంట్లూ తొడుక్కుంటాడా మిలియనేర్?. . .



**స్టాలిన్ - గోర్కీ**

అతడి జేబు చాలా విశాలమైనది. అందులో చర్చీ, సెనెట్ బిల్డింగు కూడా దాగ గలవనుకున్నాను. కడుపులో ఒక పెద్ద షిప్పు సులభంగా దూరగలదు. ఇలాంటి మనిషి కాళ్లూ చేతులూ ఎంత పెద్దవో వూహకందలేదు. మరి కప్పుకునే దుప్పటి కనీసం చదరపు మైలంతనన్నా వుండదా, అన్ని అలవాట్లూ అలాగే వుంటాయి. వందలు, వేల మంది ఖర్చు పెట్టగలిగిన సంపద ఒక్క మనిషి అవసరం తీరుస్తుంది.

అతని వేళ్ళు చాలా సుకుమారంగా ఉన్నాయి. న్యూయార్కులో కూర్చున్న ఈ పెద్దమనిషి, దూరంగా ఎక్కడో సైబీరియాలో ఒక డాలరు కనిపిస్తే చాలు, బేరింగ్ అఖాతం మీదుగా చేతులు చాపి దాన్ని లాక్కోగలడు.

ఇంతకూ యిలాంటి వింత అవయవాలున్న మనిషి తలకాయ ఎలా ఉంటుందో వూహించు కోలేకపోయాను. పైగా, తల అంటూ వుండాల్సిన అవసర ముందా? కేవలం కండబలంతో పట్టిందంతా బంగారం చేసుకోగల శక్తి వుంది ఈ జీవికి. మిలియనీర్ల గురించి నా కళ్ల ముందు మసక మసకగా ఏర్పడిన రూపమిది. *నేను చూడగలిగిన రెండు చేతులు ఈ భూగోళాన్ని పట్టుకుని చీకటి గుహలాంటి నోటిలో కుక్కుకుంటున్నాయి. ఆ యినప దవడల్లో ఈ గ్రహం నుజ్జునుజ్జుయిపోతున్నది.*

కాని ఒక కోటీశ్వరుణ్ణి స్వయంగా చూసినప్పుడు నా ఆశ్చర్యానికంతులేదు. అలా వుంటాడని నమ్మలేకపోయాను. ఆయన, మీలాగా, నాలాగా ఒక మామూలు మనిషిలాగే వున్నాడు!

# అమ్మ మొదటి భాగం, మొదటి అధ్యాయంలో నుంచి ...

ఉదయం, ప్రతిరోజూ కర్మాగారపు అరుపులాంటి పిలుపు బిగ్గరగా వణుకుతూ గాలిలో తేలి ప్రక్కనే పొగతో, ఆయిల్ వాసనతో మునిగి వున్న పారిశ్రామిక వాడన ఒక్క సారి ఉలిక్కిపడేలా చేస్తుంది! ఆ పిలుపులోని శక్తి కార్మికులను ఇళ్ళల్లోనుంచి బయటకు తోసివేస్తుంది. మకిలి ముఖాలతో– భయం నిండిన గుండెలతో, నిద్రలేని కళ్ళతో, అలసిన కండరాలతో వాళ్లు పరుగులాంటి నడకతో కర్మాగారపు గేటువైపు గుంపులుగా కదుల్తారు. ఇరుకు రాళ్ళ దారిలో, మంచులాంటి గాలిలో వారికోసం వేచివున్న ఆ రాతిగోడ బందెలదొడ్డిలోకి ప్రవేశిస్తారు. బురదకాళ్ల శబ్దంతో, బొంగురు గొంతుకలతో, విసుగు, చిరాకు బూతులతో అక్కడి వాతావరణం నిండి పోతుంది. వాళ్ళను ఆహ్వానించటానికి పెద్ద పెద్ద ఆవిరి యంత్రాలు గాండ్రిస్తూ ఘోషిస్తుంటాయి. వాటి ముక్కుపుటాల్లోంచి తెల్లని ఆవిర్లు విరజిమ్ముతూ. కర్మాగారపు గొట్టం నిలువుగా ఎత్తుగా నిలబడి పొగలు వదలుతూ, కార్మికులను పురుగుల్లా చూస్తుంది పై నుంచి.




సాయంత్రం, ప్రొద్దుగూకేవేళ, ఎర్రటికిరణాలు ఇళ్ల అద్దాలపై జరిగిపోయేవేళ, కర్మాగారపు గేటులో నుంచి అదే జనం కాలిన కట్టెల్లా–బొగ్గుమసిలా బైటకు తోసి వేయబడతారు–అదే ఇరుకు రాళ్ల దారిలో నడుస్తూ మరింత జిడ్డు, మడ్డి ముఖాలతో, ఆకలినోళ్లతో ఇళ్లవైపు సాగుతారు. కాని ఇప్పుడు ఏదో ఇంత సంతోషం వాళ్ల మాటల్లో ధ్వనిస్తుంది. కాయకష్టం ఇవాల్టికి అయిపోతుంది. ఇంటి దగ్గర ఆహారం, తాగేందుకు సారా వుంటుంది కదా!

పగలు కర్మాగారం మింగేసింది. యంత్రాలు కండరాల్ని నమిలివేశాయి. వారి బ్రతుకులో ఒక రోజు దోచుకోబడింది, కనీసం దాని గుర్తు కూడా లేకుండా! వారు మరణానికి మరికొంచెం దగ్గరయ్యారు. కాని ఆహారపు వాసనలు రమ్మంటున్నాయి. నిద్ర పిలుస్తోంది–అదే ఊరట!

❖ ❖ ❖

ఆ రోజు కర్మాగారం కూతవేసే సమయానికి అతను కన్నుమూశాడు. శవపేటికలో, తెరిచిన నోటితో భ్రుకుటి ముడితో ఎవరినో తిడుతున్నట్లు పడివున్నాడు–అతన్ని కర్మాగారపు శ్రమ తాలూకు అలసట నల్లని మబ్బులా కమ్మి, చివరకు సమాధిలో అతన్ని కప్పివేసింది. సమాధి చేసే సమయంలో భార్య, కొడుకు, అతని కుక్క, ఓ తాగుబోతు, ఇద్దరు బిచ్చగాళ్లు వున్నారు. అతని భార్య నిశ్శబ్దంగా ఓ నిమిషం ఏడ్చింది – కొడుకు ఏడవనేలేదు. ఆ సమయంలో అటుగా వచ్చిన కార్మికులు ఆగి, 'వాడు సంతోషంగా చనిపోయాడు' అని ఒకడంటే, 'తప్పురా వాడు చనిపోలేదు వాడు కుళ్లి పోయాడు.' అంటూ వెళ్లి పోయారు. చివరకు, శవాన్ని పూడ్చిన తర్వాత అందరూ ఇంటి దారి పట్టారు. అతని కుక్కమాత్రం మట్టిని వాసన చూస్తూ అక్కడే కూర్చుండి పోయింది,






# కనక పుష్యరాగం

## ప్రత్యేక సమీక్ష

శ్రీమతి కనకమ్మ తన స్వీయచరిత్ర రచన గురించి ఈ విధంగా పేర్కొన్నారు.

"1959లో నా స్వీయచరిత్ర వ్రాయడానికి పూనుకున్నాను. 4-5 సంవత్సరాల నుండి పక్షవాతంతో బాధపడుతున్నాను. ఎంత ప్రయత్నించినా మాటలు బయటకు పెగలవు. వచ్చిన మాటలు జ్ఞాపక ముండవు. వ్రాత అసలే కుంటుపడ్డది. నా కాళ్ళ మీద నిలబడలేక పోతున్నాను. దైవ మనుకూలించటము లేదు. నేను చెప్పినది వ్రాసి, సరిచేసిన వారందరికీ నా కృతజ్ఞత.లు ఈ స్వీయచరిత్ర 1959 జనవరి 15న మొదలుపెట్టి, 1960 సెప్టెంబరు 20వ తేదిన ముగించాను."

10-6-1892వ సంవత్సరములో పొట్లపూడి అన్న చిన్న గ్రామంలో జన్మించింది. ఆమె పుట్టినది, మెట్టినది స్థితిమంతుల కుటుంబమే. వారి తాతగారిది కోడెల వ్యాపారము. మైసూరులో పశువులను కొని ధార్వాడలో విక్రయించేవారు. అమ్మమ్మగారింట్లో పడమట బేరగాళ్ళంతా కంబళ్లు పరచుకొని, వెండి రూపాయిలు కుప్పలుగా పోసుకుని లెఖ్ఖపెట్టుకునేవారు. నెల్లూరు జిల్లాలోనే పేరుగాంచిన రెండు, మూడు కుటుంబాలలో ఆమెది ఒకటి. తల్లి కామమ్మకు పురాణేతిహాసములు కరతలామలకము. తండ్రి కొండారెడ్డి జ్ఞాని, తపోనిధి, వాస్తు శాస్త్రజ్ఞుడు, హాస్యప్రియుడు, చిన్మయమూర్తి. కనకమ్మకు తొమ్మిదేళ్ళ వయసులోనే మేనమామ సుబ్బరామిరెడ్డితో వివాహం జరిగింది. ఆయన ఔదార్యవంతుడు. ధైర్యసాహసాలు కలవాడు, బంధుప్రీతి ఎక్కువ. ఆడపిల్లలను 'అమ్మా' అని తప్ప పేరుపెట్టి పిలిచేవాడు కాదు. వ్యవసాయం నుంచి వ్యాపారందాక ఎన్నో పనులు ఆయన చేసినా ఎంతో కొంత పోగొట్టుకోవడం తప్ప జీవితంలో ఎప్పుడూ, ఎవరినీ మోసగించి ఎరుగడు. సుబ్బరామిరెడ్డిగారికి మాలపల్లి అంటే అమిత ప్రాణం. వారికి సహాయపడటం ఒక విద్యుక్త ధర్మంగా భావించేవారాయన.

1919వ సంవత్సరంలో మొదటిసారిగా కనకమ్మ గాంధీని కలిశారు. అప్పటి నుండి ఆమె ఆయన సిద్ధాంతాలను అనుసరిస్తూ వచ్చారు. గాంధీగారితో చివరి వరకూ ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. 1923వ సం॥లో జాతి వివక్షత లేని పాఠశాలను 'కస్తూరిబా' పేరిట స్థాపించారు. దీనిని 'పొట్లపూడి విద్యాలయం' అని కొందరు హాస్యానికి అన్నా, ఆచరణలో ఆ అర్హతను సాధించింది. అందులో ఇంగ్లీషు, తెలుగు భాషలే కాక, శాస్త్రీయ సంగీతం, కుట్టుపని, యోగాసనాలు నేర్పేవారు. ఇది ఎంతో మంది అధికారులకు స్ఫూర్తిదాయకమైంది. కొందరు విద్యావిధానాన్ని కొంతవరకూ ఆ విధంగా మార్చారు కూడా. మొదట ఆమె నెల్లూరు పొగతోటలోని స్థలాన్ని సేకరించి, కొంతకాలానికి స్థలం చాలక, అది ఊరి మధ్యలో ఉండటముతో ఆ స్థలాన్ని రేబాల పట్టాభి రామిరెడ్డికిచ్చి, ఊరవతల దర్గామిట్టలోనున్న ఆయన స్థలాన్ని స్కూలుకు తీసుకున్నారు. అయితే కొందరు చరిత్రకారులు ఇది రేబాల పట్టాభిరామిరెడ్డి వితరణగా చూప ప్రయత్నించారు. కానీ ఆమె అది స్థలమార్పిడి పద్ధతిలో తీసుకున్నారు. ఆ పాఠశాల నడపటం కోసం ఆమె ఎన్నో పాట్లు పడ్డది. ఎందరి నుంచో విరాళాలు సేకరించింది. పల్లెటూరి బాలికల విద్యా సహాయార్థం హాస్టలు వసతి కూడా ఉన్నందున హరిజన బాలికలను, ఇతర బాలికలను చేర్చుకుని పోషించారు. ఇలా 1947 వరకూ సాగింది. 1947వ సం॥లో కనకమ్మ భర్త మరణించాడు. 1950లో ఆమె మాతృమూర్తి మరణించింది.

ఆమె అస్సాం కరువు, రాయలసీమ కరువు, ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన వరద బీభత్సాలకు నడుంబిగించి విరాళాలు వసూలు చేసింది. స్థానం నరసింహరావు నుంచి, కన్నాంబ నుంచి, రేలంగి, లలిత, పద్మిని, ఘంటసాల, ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి లాంటి ఎందరివో కచ్చేరీలు పెట్టి డబ్బును విరాళంగా పోగుచేసేవారు. విరాళాలు పోగు చేయటమే కాదు, ఆమె కూడా

తనవంతు సాయం చేసేవారు. ఆమె తన ఒంటిమీదనున్న నగలన్నీ తీసి గాంధీ గారికిచ్చింది. "నాలుగు గాజులు, 100 రూ.లు ఖరీదు చేసే కమ్మలు, అడ్డిగ, మంగళ సూత్రములోని కాసులు వగైరా 40 సవరలతో సరితూగునవి ఇచ్చాను" అని చెప్పారు. కనకమ్మ ఏకైక పుత్రికయిన వెంటక సుబ్బమ్మ 1929లో గాంధీజీ నెల్లూరు వచ్చినపుడు తన ఒంటిమీది 20 సవరలు బంగారు నగలను ఇచ్చి వేసింది. కస్తూరిబా పాఠశాలకు అన్నీ తానై చూసుకున్నా ప్రాంతీయ రాజకీయ ఈర్ష్యాద్వేషాలతో ఆమెను నెమ్మదిగా ఆ పాఠశాల పెత్తనం నుంచి తొలగింపబడటం ఒక విషాదం.

కనకమ్మదంతా స్మృతి పాండిత్యం. చిన్నతనంలో ఆమె చదువుకోలేదు. చదివినవారు చెడిపోతారని అమె భర్తగారి ఊహ. వచన భాగవతముతో ఆమె విద్యకు అంకురార్పరణ జరిగింది. ఆ తరువాత కాలంలో ఆమె *శశిరేఖ, హిందూసుందరి, అనసూయ* లాంటి పత్రికల్లో పద్యాలు, వ్యాసాలు వ్రాసి తన రచనా వ్యాసాంగానికి మెరుగులు దిద్దుకున్నారు. రేడియో ఉపన్యాసాలు ఇచ్చారు. ఎన్నో సభలకు అధ్యక్షత వహించి తన ప్రతిభను చాటుకున్నారు. ఇదంతా ఆమె స్వీయ ప్రతిభే. ఆమె తనంత తానుగా ఆధునిక మహిళగా రూపుదిద్దుకుంది. చైతన్యమే ఆమె జీవన లక్షణం. ఆమె జీవితం చాలా విస్తృతమైంది. సంఘానికి మేలుచేసే ఏ ఒక్క అవకాశము ఆమె విడువలేదు. 'స్త్రీణాంచ చిత్తం, పురుషస్య భాగ్యం' అన్న ఆర్యోక్తి మననం చేసుకునేది. తన భర్త ఔదార్యంవల్లనే 'సుజన రంజని సమాజం' అన్న సంస్థను స్థాపించి, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక పునరుజ్జీవనంలో తన పాత్ర పోషించింది. జమీన్ రైతు ఉద్యమానికి కనకమ్మ ఇల్లు పురిటిద్దైంది. 'జమీన్ రైతు' అన్న పత్రిక ఆమె త్యాగాగ్నిగుండం నుంచే ఆవిర్భవించిందని ఇప్పటికీ పలువురు చెప్పుకుంటారు.

కనకమ్మతోపాటు ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ సహితం కస్తూరిబా స్కూలుకు తమ జీవితాల్ని అర్పించారు. ఆమె పరిశ్రమను గుర్తించిన పశ్చిమ గోదావరి జిల్లా మంత్రి అల్లూరి సూర్యనారాయణ రాజు ఆమెను రెండుసార్లు ఎమ్.ఎల్.సి.గా నామినేట్ చేయించారు. నెల్లూరివారు మాత్రం 'కష్టజీవి' అన్న బిరుదుతో కనకమ్మను అభినందించి చేతులు దులుపుకున్నారు. కనకమ్మ తన 71వ యేట 15-9-1963న ఇహలోక యాత్ర చాలించారు. కనకమ్మ మరణించిన తరువాత ఆమె పార్థివ శరీరాన్ని చూడడానికి కస్తూరిబా పాఠశాల నుంచి విద్యార్థినులుగాని, అధ్యాపకులుగాని రాకపోవటం, దానిని తీవ్రంగా విమర్శిస్తూ రేబాల పట్టాభిరామిరెడ్డి మరదలు శుభప్రదమ్మ వ్యాసాలు వ్రాశారు. ఆ శుభప్రదమ్మే ఆమె కాంస్య విగ్రహాన్ని విద్యాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠింపకుండా అడ్డుకున్నారు. నేటికీ ఆ విగ్రహం ప్రతిష్ఠ లేకుండా అలానే ఉండి పోయింది. చివరకు ఆమె వ్రాసిన, వ్రాయించిన స్వీయ చరిత్ర కూడా ప్రచురణకు నోచుకోకుండా ఒక అర్ధ శతాబ్ది కాలం అలానే ఉండిపోయింది. 1972లో ఈ విషయం తెలుసుకున్న డాక్టరు కాళిదాసు పురుషోత్తంగారు చొరవ తీసుకుని కుటుంబ సభ్యులనుంచి ఆ ప్రతిని తీసుకొని, మొదటిసారిగా 2011లో ప్రచురించారు. "కనకమ్మ మీద జరిగింది కుట్రగాని, దారుణమైన నిర్లక్ష్యం, చరిత్రలో ఆమెకు సముచిత స్థానం కల్పించటంలో అన్యాయం జరిగిందంటూ" పేర్కొన్నారు.

నెల్లూరు మున్సిపల్ ఛైర్మన్ అయిన ఏ.సి. సుబ్బారెడ్డి, కనకమ్మ నిర్మించిన పారిశ్రామిక విద్యాలయం మూతపడిన తరువాత, కనకమ్మ నిర్మించిన భవనంలోనే ప్రభుత్వం ఒక బాలికా పాఠశాల నెలకొల్పి, కనకమ్మ స్మృత్యంకంగా "పొణకా కనకమ్మ బాలికల పాఠశాల" అని నామకరణం చేశారు. ఇప్పుడు నెల్లూరులో కనకమ్మ పేర మిగిలిన ఒక స్మృతి చిహ్నం ఇదే.

ఆనాటి కౌటుంబిక, రాజకీయ, సామాజిక పరిస్థితులకు దర్పణం ఆమె ఆత్మ కథ. *మచ్చుకు కొన్ని భాగాలు :*

*"స్వరాజ్యము వచ్చెడి దాకా వివాహము చేసుకోము అని కొందరు శపథము చేసినారు."*

*"1918లో ఈ ఉద్యమమును రహస్యముగా నడిపినాము. మా సందు తట్టు చాకలివారి ఇంట్లో నిషిద్ధ సాహిత్యము భద్రపరిచినాము. పరిశోధనకు నెల్లూరు నుంచి మా ఇంటికి కొంతమంది వచ్చినా అవి కనిపించలేదు..."*

*"పిల్లల చదువు నెపంతో చతుర్వేదాల రాఘవయ్యను పోట్లపూడి తీసుకువచ్చి సావర్కరు '1857 స్వాతంత్ర్య యుద్ధము' అను పుస్తకమును తెలుగు చేయించినాము..."*

*"1921లో స్వదేశీ నేత సంఘంవారు ఖద్దరు చేసేవారు కాదు. నేనడిగితే విధి లేక నేసి ఇచ్చేవారు. నాకు ఖద్దరు కట్టాలని ఉబలాటము..."*

*"పొట్లపూడి ములుమూడి మడమనూరుల్లోని భూములన్ని విక్రయించవలసి వచ్చినది."*

*".... మేము ఒక పత్రిక స్థాపించినాము. దానికి పొణకా పిచ్చిరెడ్డి సంపాదకులు. దానిపేరు "జమీన్‌రైతు." ప్రపంచాన్ని చకిత మొనరించిన జమీందారీ ఉద్యమము మా కుటుంబము యొక్క మహాగ్ని జ్వాలలో అవతరించి దశ దిశలా వ్యాపించినది...." 'జమీన్‌రైతు' కూడా పుట్టి పెరిగినది ఆ దారుణమైన దావాగ్నిలోనే..."* మి

*కనక పుష్యరాగం : పుటలు : 272 వెల : ₹ 225/- ప్రాప్తి స్థానం : డా॥ కె. పురుషోత్తం, ఫోన్ : 9247564044*

## దండకం...

"భగవతీ! భాగ్యలక్ష్మీ! ప్రణామంబు! నీ దాస దాసాను దాసుండ. నీ పాదముక్తుండ, నీ దివ్య రూపంబె నిత్యంబు భావింతు. నీ దివ్య నామంబె నిక్కంబుగా నిద్రలో కూడ జింతింతు. నాదిక్కు నా మ్రొక్కు, నా యండ, నా దండ నీవే సుమా! భార్యయు, గీర్యయు, బిడ్డలుం, గిడ్డలుం, దేవుడుం, గీవుడున్, మోక్షమున్, గీక్షమున్, సర్వము నీవె సత్యంబు! నీకై నిరాహారినై యుందు, నీకై నిశల్ నిద్ర మాన్కొందు, నీకై శరీరాభిమానంబు వర్జింతు. నీకై యసత్య ప్రమాణంబు లెన్నేనియు గావింతు నీ యాన! ఈ పెట్టెయే నీ పవిత్రాలయం, నేనె నీ యర్చకుండన్, యదార్థంబుగా నాదు ప్రాణంబులె నీదు పూజా సుమంబుల్. శరీరంబె నైవేద్య కుంభంబు నా యింటనే యుండి, నా పూజలం గొంచు, నే యింటికి నంపినం బోయి యా యిల్లు మట్టంబు గావించి నా యింటికిం దెచ్చి నాకిచ్చు కేచుండంగదే కన్నతల్లీ! నమస్తే నమస్తే నమః"

***– సింగరాజు లింగరాజు***

(వరవిక్రయం – కాళ్లకూరి నారాయణరావు)

## జంక్‌ఫుడ్

"నారాయణ! నారాయణ! ధర్మశాస్త్రములు తగులబడి పోతున్నాయి. ఇతర దేశస్తులను జూచి మనవాళ్లు యింటా వంటా లేని కాఫీలు, ఉప్మాలు అలవాటు చేసుకోబట్టి చచ్చిపోయి పితృదేవతలయిన తర్వాత గూడా ఆ కాఫీ నీళ్ళమీద, ఉప్మామీద గూడ వాంఛ దీరకుండా ఉన్నది. ఇప్పుడు ధర్మశాస్త్రాలు మార్చివేయాలి. 'తిలోదక, వాసోదక పిండ ప్రధానం కరిష్యే' అని మంత్రాలు మార్చి వెయ్యవలసి వచ్చింది. దీనమ్మా కడుపు కాల, కలిమాయ లోకాన్ని యెంతవరకు ముంచేసింది. అయినావాళ్లు, కానివాళ్లూ కాఫీ దాగి యేదుస్తుంటే యిటువంటి యోగం పట్టకపోతుందా? గొడ్లు కుడితి త్రాగినట్లు, కంచు చెంబుడు కాఫీ త్రాగడమున్ను కడుపులు చాకి బానల్లాగ పెంచుకొని రోగాలపాలవడమున్ను, ఈ కాఫీలు, కాఫీకొట్లు వచ్చిన తర్వాతనే రోగాలు యెక్కువవుతూ వున్నవి. ఈ కాఫీ కొట్లు పోతేనేగాని మనం బాగుపడము. వేళలేదు పాళలేదు, మడిలేదు మైలలేదు. ఆకలి అయిందన్నమాట లేదు, కాలేదన్నమాట లేదు. గోనెబస్తాలో పోసినట్లు, రాదారి పడవలో చక్క పూటుగా సరుకు వేసినట్లుతిని దొర్లడమే మనవాళ్ళ పని."

***– వినాయక శాస్త్రి***

(ప్రహసనములు – చిలకమర్తి లక్ష్మీనరసింహం)

## తరవాణి

"దేవతల కమృతము, మనుష్యులకు తరవాణి బ్రహ్మదేవుడు విధించినాడు, అమృతము మీద విసుగెత్తి దేవతలు తరవాణి కొరకు తపస్సు జేసినారు. కాని ఇది వారికి దొరకలేదు. గ్రుక్కెడు తరవాణి త్రాగినా చంద్రుని కళంకమిన్నాళ్ళుండునా? దినమునకు ముమ్మారు మూడు సత్తు గిన్నెల చొప్పున తరవాణి యొక మండలము సేవించిన సాంబమూర్తి కంఠములోని నలుపు హరించిపోదా? ఇది రెండు చుక్కలు నోటిలోబడినా శివునకు విషమును దిన్న వెగటు నశింపదా! ఈ తరవాణి త్రాగియె భీముడు దుర్యోధనుని తొడలు విరగగొట్టెను. అర్జునుడు శత్రువులను జావగొట్టెను. వానరులు వారధి గట్టిరి. ఆంజనేయుడు సముద్రము దాటెను. లక్ష్మణస్వామి మూర్ఛబోయినపు డాంజనేయులు వెర్రిపడి సంజీవి దెచ్చెను కాని, యుప్పు కలిపిన పుల్లని తరవాణి గిద్దెడు నోటిలోబోసి యొక పచ్చి యుల్లిపాయ నంజుకొనబెట్టినచో గిరుక్కున లేచి కూర్చుండకపోవునా? తెలివితేటలు లేవు. తరవాణికుండ నూరావుల పాడిచెట్టు. ఆవులకు గడ్డి కావలె, గాదము కావలె. ఒకపూట దూడ కుడుచుకొని పోవుట, మఱియొక దూడ తన్నివేయుట మొదలగు చిక్కులు గలవు. తరవాణి కుండ కట్టి చిక్కులు లేవు. ఆదిలేని కొంప, కొంపకాదు. రోగములు వచ్చినపుడు పాడు కషాయములు, రుచిలేని యరజలు త్రాగి గిఱగిఱ తన్నుకొనుట కంటె, మాత్ర వేసుకొని తవ్వెడేసి తరవాణి త్రాగిన యెక్కడి జబ్బక్కడ యెగిరిపోవును. తరవాణి త్రాగమని చెప్పని వైద్యుడా! కుడితి పశువులకెంత బలమో, మనుషులకు తరవాణి యంత బలం."

***– గంగాధరుడు*** (గణపతి – చిలకమర్తి లక్ష్మీనరసింహం)

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు**

| | | | ₹ |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు-2 | " " | 200.00 |
| 6 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 7. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 8. | అమాహ | " " | 60.00 |
| 9. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 10. | సిద్ధార్థ | " " | 50.00 |
| 11 | నాలో నేను | " " | 30.00 |
| 12. | కథాంజలి-1 | *ఎస్సారె* | 80.00 |
| 13. | కథాంజలి-2 | " " | 110.00 |
| 14. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 15. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 16. | రెండు దశాబ్దాలు - కథ 1990-2009 | కథా సాహితి | 150.00 |
| 17. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 18. | గురవాయణం | *డాక్టర్ గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన - *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన - *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన - *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన - *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | మహాపరిత్తం - *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ : ఉపమలు - *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు - అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా - జె. లక్ష్మి రెడ్డి | 50.00 |
| 8. | జయమంగళం - బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు - ఈమని శివనాగిరెడ్డి | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ - బొర్రా గోవర్ధన్ | 150.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in ; e-magazine : www.kinige.com

***మిసిమి*** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................

వీథి ..............................

పేట ..............................

ఊరు ..............................

పిన్ ..............................

సెల్ ..............................

**3. సంతకం :** ..............................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



వాన.. వాన

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



ప్రకృతి - స్త్రీ